నవంబర్
2023

211

సంపుటి :19 సంచిక : 6

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

పత్రికా స్వేచ్ఛపై పైశాచిక దాడి

బూర్జువా వార్తాపత్రికల మాయలో కార్మికులు పడరాదు

కుల గణన

గుప్త సామ్రాజ్యం: స్థాపన, విస్తరణ

76 వసంతాల భారతదేశం నిజంగానే వెలిగిపోతోందా ?

గాజా యుద్ధం

గాంధీ హంతకుడిపై ప్రేమ

ఏది అసలైన భారతీయ సంస్కృతి?

ప్రాంతీయ పార్టీల అవకాశవాదం గురించి సిపిఐ(ఎం)కు స్పష్టమైన అవగాహన ఉంది

ఆయన దేశానికే అన్నదాత

నివాళి

# ఆయన దేశానికే అన్నదాత

**దేవీందర్ శర్మ**

**భా**రతదేశంలో ఆయన్ని "హరిత విప్లవ పితామహుడు" అని పిలుస్తారు. పట్టుదల, క్రమశిక్షణ అన్నిటికీ మించిన దేశభక్తి భావనతో కూడిన తన పరిశోధనల ద్వారా దేశంలో ఆకలి చావుల్ని నివారించడానికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి ఆయన. దేశానికి అధిక దిగుబడినిచ్చే గోధుమ, వరి పండించే రకరకాల వంగడాలను పరిచయడం చేసి భారత దేశం ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంలో ముఖ్య పాత్ర నిర్వహించారు.

ఆయన డాక్టర్ ఎంఎస్ స్వామి నాథన్. 98 ఏళ్ల ప్రయోజనవంతమైన జీవితాన్ని ఆయన గత అక్టోబర్ 5 న ముగించారు.

.......

ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ) డైరెక్టర్ జనరల్ అయిన ఫ్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్ 1984వ సంవత్సరంలో భారతదేశం నుండి ఫిలిప్పీన్స్‌కు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవ సభలో ప్రసంగించడానికి బయలు దేశారు. ఆయన ఉదయం మనీలాకు బయలుదేరే ముందు నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీని కలవాలని కోరుతూ ప్రధాన మంత్రి కార్యాలయం నుండి ఆయనకు ఓ సందేశం వచ్చింది. అదే రోజు సాయంత్రం స్వామినాథన్ న్యూఢిల్లీ వెళ్లి ప్రధాన మంత్రి కార్యాలయంలో ఆమెని కలిశారు.

"కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికను రాయమని నన్ను శ్రీమతి గాంధీ కోరారు" అని ఎం.ఎస్. స్వామినాథన్ ఓ సందర్భంలో నాతో చెప్పారు. ఎన్నికలు ఇంకా దూరంలో ఉండగా ఎందుకు ఆమె ఎన్నికల ప్రణాళిక రాయాలని మిమ్మల్ని కోరారు అని నేను ఆయనను అడిగాను. "ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకుంటున్నట్లు ఆమె నాకు చెప్పారు" అని ఆయన బదులిచ్చారు. ఎన్నికల ప్రణాళికలో చేర్చాలనుకుంటున్న కొన్ని అంశాలను వారు చర్చించారు. ఆపై ఆయన మరుసటి రోజు ఉదయం మనీలాకు విమానం ఎక్కేలోపు దాన్ని పూర్తి చేయాలని అభ్యర్థించారు. ఇది జరిగిన ఏడు రోజుల తర్వాత, ఇందిరా గాంధీ హత్యకు గురయ్యారు.

రాజీవ్ గాంధీ తన తల్లి మరణంతో వచ్చిన సానుభూతిని ఉపయోగించుకుని



ఎన్నికలకు పిలుపునిచ్చారని అన్ని రకాల ఆరోపణలు వినిపించాయి. అయితే, అప్పటికే ఎం.ఎస్. స్వామినాథన్ పార్టీ ఎన్నికల ప్రణాళిక రాశారని దేశానికి తెలియదు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తగా, వృక్ష జన్యు శాస్త్రవేత్తగా, భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా, సామూహిక కరువును నివారించడంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తిగా కీర్తి గడించిన ఎం.ఎస్. స్వామినాథన్ ఓటర్ల నాడిని పట్టుకోవడంతో కూడా దిట్ట కాబట్టే ఇందిరా గాంధీ అంతటి వారు ఆయన సహాయం కోరారు. భారతదేశంలోనే కాదు, అంతర్జాతీయంగానూ ప్రముఖ విద్యావేత్తలు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు ఆయనతో తరచూ సంభాషించడానికి ఉత్సాహపడే వారంటే స్వామినాథన్ సంపాదించుకున్న గౌరవం ఎంతటిదో తెలుస్తుంది.

1987-1988 కాలంలో నేను ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ) కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఎం.ఎస్.స్వామినాథన్ గారి పదవీకాలం పూర్తయిన రోజున తమ టీ-షర్టులపై ఆయన ఫోటోలు ముద్రించుకుని, ఆయన ఆటోగ్రాఫ్ పొందడానికి క్యూలో నిలబడిన ఉద్యోగులు, శాస్త్రవేత్తలను చూశాను. ఒక శాస్త్రవేత్తను గొప్ప సెలబ్రిటీగా సాగనపటం అంత సాధారణ విషయం ఏమీ కాదు.

1990లో డాక్టర్ స్వామినాథన్ 'ఇవోకెర్మా ఇంటర్నేషనల్ రెయిన్‌ఫారెస్ట్ ప్రోగ్రామ్'కు అధ్యక్షుడుగా పనిచేశారు. ఆ సమయంలో గుయానా అధ్యక్షుడు స్వామినాథన్‌ను ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (యుఐసిఎన్)కి చైర్మన్‌గా ఉండాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమం కింద 3,60,000 హెక్టార్ల ఉష్ణమండల వర్ష ప్రాంతపు అడవులను కామన్వెల్త్ దేశాల సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. ఒకవైపు అడవులను సంరక్షిస్తూనే వాటిని స్థానిక కమ్యూనిటీ ప్రజలు ఎలా వాణిజ్య పరంగా ఉపయోగించుకోవచ్చునో స్వామినాథన్ చేసి చూపించారు.

కేరళలోని పశ్చిమ కనుమలలోని 'సైలెంట్ వ్యాలీ' వద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా ఉద్యమానికి ఎం.ఎస్.స్వామినాథన్ మద్దతు ఇచ్చారు. ప్రాజెక్టును రద్దు చేసేకంటే, వర్షారణ్య జీవావరణాన్ని రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రధాని ఇందిరా గాంధీని ఒప్పించడంలో వారు ముఖ్యమైన పాత్ర పోషించారు. సహజమైన వర్షారణ్యం జీవవైవిధ్యానికి కేంద్రంగా ఉండి, అనేక అరుదైన జాతుల పక్షులు, జంతువులు, వందలాది సహజసిద్ధ పువ్వుల్ని కలిగి ఉన్న ప్రాంతంగా ఉంది.

ఒడిశాలోని భితార్కానిక ప్రాంతంలో 'ఆలివ్ రిడ్లీ' అనే అరుదైన తాబేళ్లు జాతికి ప్రత్యేకమైన అనువైన నివాసం ఆ ప్రాంతంగా ఉంది. అత్యంత ప్రమాదంలో ఉన్న అర కోటికిపైగా ఉండే తాబేళ్లు ప్రతి సంవత్సరం ఈ సహజ సంతానోత్పత్తి ఈ ప్రదేశాలకు చేరుకుంటాయి. అయితే, అప్పటి ఒడిశా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ ఆ తీర ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించాలనుకున్నాడు. అందుకోసం ఆయన తాబేళ్ల సంతానోత్పత్తి భంగం కలిగించకుండా వాటిని వేరే ప్రదేశాలకు తీసుకెళ్లాలని అనుకున్నారు. రాజకీయ ఒత్తిళ్ళు ఎన్ని ఉన్నప్పటికీ, ఆ ప్రాంతాన్ని సహజ వారసత్వపు ప్రాంతపు ప్రాముఖ్యతను అర్థం చేసుకొని సంరక్షించాలనుకున్నారు. ఇది ఏమాత్రం ప్రకృతికి సరైనది కాదని ఆ అరుదైన జాతి సంతానోత్పత్తి ప్రదేశాలకు భంగం కలిగించకుండా అప్పటి ఒడిశా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌ను ఎం.ఎస్.స్వామినాథన్ ఒప్పించగలిగారు. నిజానికి ప్రకృతి అందించే అనేక వనరులు ఆర్థికంగా ఉపయోపడుతున్నపటికీ, ప్రకృతి, పర్యావరణాలకు ఎటువంటి భంగం కలగకుండా ఉండేవిధంగా ఆయన ఆలోచనలకు శ్రీకారం చుట్టారు.

ఎం.ఎస్.స్వామినాథన్ ముఖ్యంగా చేపట్టిన అంశం, మడ అడవుల సంరక్షణ.

**(మిగతా 35వ పేజీలో)**

## ఈ సంచికలో...


1. ఆయన దేశానికే అన్నదాత

దేవీందర్ శర్మ........2

2. పత్రికా స్వేచ్ఛపై పైశాచిక దాడి

ఎన్. రామ్...........4

3. బూర్జువా వార్తాపత్రికల మాయలో కార్మికులు పడరాదు

ఆంటోనియో గ్రాంసీ ...........7

4. కుల గణన

హరిష్ వాంఖేడ్........8

5. గుప్త సామ్రాజ్యం: స్థాపన, విస్తరణ

ఎంవిఎస్ శర్మ...........11

6. 76 వసంతాల భారతదేశం నిజంగానే వెలిగిపోతోందా ?

సిపి చంద్రశేఖర్......14

7. గాజా యుద్ధం

తల్మిజ్ అహ్మద్..........16

8. గాంధీ హంతకుడిపై ప్రేమ

సుభాష్ గటాడే ......21

9. ఏది అసలైన భారతీయ సంస్కృతి?

అనూషా పాల్......28

9. ప్రాంతీయ పార్టీల అవకాశవాదం గురించి సిపిఐ(ఎం)కు స్పష్టమైన అవగాహన ఉంది

బివి రాఘవులు......33



సంపాదకుడు :

**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**

సంపాదకుడు : ఎస్.వెంకట్రావు

**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)

**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**

email:venkataraosankarapu@gmail.com

email:marxistap@gmail.com

visitcpi(m)site at:cpim.org


# సాంస్కృతిక మార్క్సిజం?

ఫాసిస్ట్ తరహా హిందుత్వ చీకటి శక్తులను ఎదుర్కొనే వారిని ఆక్షేపించేందుకు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఇటీవల ఒక కొత్త పదాన్ని ప్రయోగించారు. ఇటువంటి వారిని "కల్చరల్ మార్క్సిస్టులు" లేక "మేల్కొన్న వాళ్లు" అని ఆయన ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది దసరా సందర్భంగా అక్టోబర్ 24న నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రంలో చేసిన ప్రసంగంలో పేర్కొన్నాడు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఒకవైపు దేశాన్ని తన కాళ్ల మీద తాను నిలబడ్డానికి ప్రయత్నిస్తుంటే మరికొందరు "సమాజంలో వివక్ష సృష్టించడానికీ, నిర్మాణాత్మక సమిష్టిని విచ్ఛిన్నం చేయడానికీ, వేర్పాటును ఘర్షణలను సృష్టించడానికీ" ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటువంటి వారిని ఆయన సాంస్కృతిక మార్క్సిస్టులు లేక మేల్కొన్న వాళ్లు అని పేర్కొన్నారు. వీరు "మీడియానూ, విద్యా సంస్థలనూ చేజిక్కించుకుని విద్య, సంస్కృతి, రాజకీయాలు, సామాజిక వాతావరణాన్ని గందరగోళం, అస్తవ్యస్తత, అవినీతిలోకి నెట్టేస్తున్నారు" అని ఆరోపించారు.

నిజానికి సాంస్కృతిక మార్క్సిజం అనే పదాన్ని ఆయన కొత్తగా సృష్టించలేదు. ఐరోపాలో పచ్చి మితవాద, నయా-ఫాసిస్టు, జాత్యహంకార శక్తులు పురోగామి భావాలను నిలువరించడానికి ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ సాంస్కృతిక మార్క్సిస్టులు తమ పురోగామి భావాలతో పశ్చిమ దేశాల నైతిక విలువలను నాశనం చేసేస్తున్నారని వారి ఫిర్యాదు. భారత దేశంలో వామపక్ష భావజాలం, ప్రజాతంత్ర లౌకిక భావాలనుండి రోజురోజుకూ హిందుత్వ సిద్ధాంతానికి వస్తున్న ప్రతిఘటనను ఎదుర్కోడానికి ఆర్ఎస్ఎస్ అధినేత ఆ పదాన్ని ఐరోపా నుండి అరువు తెచ్చుకున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా అదే రోజున ఢిల్లీలో దసరా ఉత్సవాల్లో పాల్గొంటూ కులం, ప్రాంతం పేరుతో దేశాన్ని విడదీయ జూస్తున్న శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొనడం ద్వారా ఆర్ఎస్ఎస్, బిజెపీ రెండూ ఒకే తానులోని గుడ్డలని మరోమారు నిరూపించారు.

నిజానికి మోహన్ భగత్‌గానీ, నరేంద్ర మోడీ గానీ చెబుతున్నట్లు ఈ దేశాన్ని విభజిస్తున్నదీ, దేశ సమైక్యతకు ముప్పుతెస్తున్నదీ హిందుత్వ శక్తులూ, వారి సాంస్కృతిక జాతీయ వాద సిద్ధాంతమే. అనేక మతాలు, అనేక కులాలు, జాతులు, భాషలు, సంస్కృతుల సమాహారమైన భారత దేశం స్వాతంత్ర్యం వచ్చి ముప్పావు శతాబ్దం పాటు ఐక్యంగా ఉన్నదీ, భారత ప్రజలు కలిసికట్టుగా ఉన్నారూ అంటే దానికి కారణం మన రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాతంత్ర, లౌకిక, సామాజిక న్యాయ విలువలే. మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం తన దశాబ్దపు ఏలుబడిలో ఈ విలువలను విధ్వంసం చేస్తూ దేశాన్ని మతపరంగా విభజించడానికీ, నిరంకుశత్వాన్ని ప్రవేశపెట్టడానికీ, సామాజిక న్యాయాన్ని వెనక్కు మళ్లించడానికీ ప్రయత్నిస్తున్నది. దాని హిందుత్వ సిద్ధాంతమే గుజరాత్‌లోనూ, దేశంలోని అనేక ప్రాంతాల్లోనూ మైనారిటీలపై దాడులకు కారణమైంది, మణిపూర్‌లో రెండు మతాల మధ్య చిచ్చుపెట్టి మానవ మారణహోమాన్ని తెచ్చిపెట్టింది. కాశ్మీర్ ప్రజల హక్కులు కాలరాసింది, దేశ ప్రజలకు మానవహక్కులు మృగ్యం చేస్తున్నది. పత్రికా స్వేచ్ఛనూ, భావ ప్రకటనా స్వేచ్ఛనూ హరిస్తున్నది. న్యూస్‌క్లిక్ పై దాడి దీనికి సరికొత్త ఉదాహరణ.

అందువల్ల దొంగే దొంగ దొంగ అన్నట్లు ఆర్ఎస్ఎస్-బిజెపి దేశంలో వినాశకర, విచ్ఛిన్నకర పాత్ర నిర్వహిస్తూ దాని నిందను మాత్రం 'సాంస్కృతిక మార్క్సిస్టులు', 'మేల్కొన్న వాళ్ల' మీద నెడుతున్నది. ఒక మాట మాత్రం వాస్తవం. ఈ నాడు దేశంలో మేల్కొంటున్న సామాజిక శక్తులు, వామపక్షాల ఆధ్వర్యంలో హిందుత్వ సిద్ధాంతానికి పెద్ద సవాలు విసురుతున్నాయి. ఆర్థిక రంగంలో ఆర్ఎస్ఎస్-బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వ్యతిరేకించడమే కాదు, సాంస్కృతిక రంగంలో కూడా దాని తిరోగామి సిద్ధాంతాలను ప్రజల్లో ఎండగడుతున్నాయి. దేశంలో అణగారిన వర్గాలు ఎంత శాతం ఉన్నాయో వారికి సంపదలో ఎంత వాటా అందుతున్నదో తెలుసుకోడానికి జనాభా లెక్కల్లో కుల గణన చేయాలనగానే బిజెపి హిందుత్వ సిద్ధాంతం చివురుటాకులా వణికిపోతున్నది. రాష్ట్రాలకు న్యాయమైన హక్కులు కావాలన్న కోర్కె వ్యక్తం కాగానే వేర్పాటు వాదం అంటూ గుండెలు బాదుకుంటున్నది.

అటు ఆర్ఎస్ఎస్ ఇటు దాని రాజకీయ విభాగం అయిన బిజెపీలు 'సాంస్కృతిక మార్క్సిజం' పేరుతో చేస్తున్న ప్రసంగాలు పరిశీలిస్తే వారు ఈ వాదాన్ని ఉపయోగించుకుని విద్య, సాంస్కృతిక రంగాల నుండి 'బయటివారు' అనే పేరుతో అభివృద్ధికర శక్తులనూ వారి భావాలనూ ఏరివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమవుతుంది. పురోగామి శక్తులు రెట్టించిన పట్టుదలతో సమైక్యంగా దీన్ని ఎదుర్కోవాల్సిన అవసరం ఇప్పుడు ఏర్పడింది.

# పత్రికా స్వేచ్ఛపై పైశాచిక దాడి



రచయిత హిదూ దినపత్రిక, ఫ్రంట్‌లైన్ ప్రతికల మాజీ ఎడిటర్. ప్రస్తుతం హిందూ గ్రూప్ పబ్లిషింగ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన 1990లో జర్నలిజంలో పద్మభూషన్‌తో పాటు అనేక జర్నలిజం అవార్డులు పొందారు. 2005లో శ్రీలంక రత్న అవార్డు పొందారు.

**ఎన్. రామ్**

దేశంలో మధ్య స్థాయి డిజిటల్ వార్తా సంస్థ అయిన న్యూస్‌క్లిక్ కార్యాలయం పైనా, దాని జర్నలిస్టుల ఇళ్లపైనా ఢిల్లీ పోలీసులు జరిపిన కిరాతకమైన దాడి 1975–76 ఎమర్జెన్సీ తరువాత దేశంలో పత్రికా స్వేచ్ఛ ఎంత అధమ స్థాయికి పతనమయిందో తెలియజేస్తోంది. అక్టోబర్ 3వ తేదీన ఢిల్లీ పోలీసులు నగరంలోని న్యూస్ క్లిక్ కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడికి తెగబడ్డమే కాకుండా ఆ సంస్థతో సంబంధం కలిగి ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టు, ఇతరుల ఇళ్లపై దాడులకు దిగి, వారి ఎలక్ట్రానిక్ పరికరాలను విచక్షణా రహితంగా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకుంటున్నట్లు ఎటువంటి మెమోలు ఇవ్వడం, స్వాధీనం చేసుకున్న డేటా ఏమిటో తెలియజేయడం, వాటి కాపీలు ఇవ్వడం వంటి న్యాయపరమైన క్రమం దేన్నీ అనుసరించలేదు. వార్తా పోర్టల్ ప్రధాన కార్యాలయాన్ని సీల్ చేశారు. దాని వ్యవస్థాపక సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థను, వార్తా పోర్టల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అమిత్ చక్రవర్తినీ ఉగ్రవాద సంబంధ చట్టం క్రింద అరెస్టు చేశారు. ఇదంతా చాలదన్నట్లు పైనుండి వచ్చిన ఆదేశాల మేరకు సిబిఐ వాళ్లు న్యూస్‌క్లిక్ కార్యాలయంమీద, దాని వ్యవస్థాపక సంపాదకుని ఇంటిమీద దాడి చేసి ఆయనపై సరికొత్తగా మరో కేసు పెట్టారు. పైనుండి వచ్చిన ఆదేశాలతో సిబిఐ పెట్టిన కేసుల్లో ఇది అయిదవది.....ఇదంతా చూసినపుడు భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ ఎంత అధమ స్థాయికి పతనమైందో తెలుస్తుంది. 2014 (నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన) తరువాత ప్రపంచ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత స్థానం ఏటేటా క్రమంగా దిగజారుతూ వస్తున్నది. సరిహద్దులు లేని రిపోర్టర్స్ అనే సంస్థ ఏటా ప్రచురించే ఈ సూచీ ప్రకారం మొత్తం 180 దేశాల్లో భారత్ 161వ స్థానంలో అధోగతిన ఉన్నది. న్యూస్‌క్లిక్‌పై దాడి ఘటనలు చూస్తుంటే ఈ దిగజారుడు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. దీనికి వ్యవస్థీకృతమైన, సమర్ధవంతమైన ప్రతిఘటనను నిర్మించినప్పుడూ, వృత్తి, న్యాయ, రాజకీయ స్థాయిల్లో దీనికి వ్యతిరేకంగా సమిష్టిగా, సుస్థిరంగా చర్యలు తీసుకున్నప్పుడు మాత్రమే ఈ దిగజారుడును అడ్డుకోగలం.

ఈ పూర్వ రంగంలో ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ ప్రవేశపెట్టిన ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అది సత్య దూరంగా ఎవరో పైనుండి ఆదేశించి రూపొందించినట్లు ఉన్నది మినహా నిజాయితీగా లేదు. ఎఫ్ఐఆర్ చదివితే బూజుపట్టిపోయిన పోలీసు మైండ్ ఎలాఉంటుందో మనకు తెలియజేస్తుంది. కోర్టులు పగ్గాలు వదిలేస్తే 'ముందు శిక్షించడం, తరువాత తీర్పు చెప్పడం' అనే లక్ష్యంతో పనిచేసే పరమ వికృత, దుష్ట, బుర్రలేని పోలీసు రాజ్యంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఇది మనకు రుచి చూపిస్తుంది.

కేసు "సున్నితత్వం దృష్ట్యా ఎఫ్ఐఆర్‌ను ఆన్‌లైన్ చేయడం లేదు' అని పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినప్పటికీ కొంత మంది జర్నలిస్టు మిత్రులు దాని కాపీని సంపాదించగలిగారు. ఈ ఎఫ్ఐఆర్‌ను ఒక్క సారి చదివితే చాలు ఇది పూర్తిగా ఉద్దేశపూర్వకంగా పెట్టిన, తప్పుడు కేసు అనీ, న్యూస్‌క్లిక్‌పై చేసిన ఆరోపణలు నిర్ధారణకు నిలవని బోగస్ ఆరోపణలనీ తెలిసిపోతుంది. హిందూ పత్రికలో ప్రచురించబడిన ఎడిటోరియల్ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేసింది.

కానీ న్యూస్‌క్లిక్ మీద దాడి కేవలం పోలీసుల దుశ్చర్య మాత్రమే కాదు. ఇది ఒక రాజకీయ కథనం. ఇది ఒక మధ్య స్థాయి, పురోగామి, వామపక్ష భావాలు గల డిజిటల్ వార్తా వ్యవస్థకీ, అది ప్రతిబింబించే స్వతంత్ర, విమర్శనాత్మక, సవాలుతో కూడిన జర్నలిజానికీ మరోవైపు బిజెపి, హిందుత్వ నిరంకుశ ప్రభుత్వానికీ మధ్య జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన కథనం. ఈ ఘర్షణ అసలు స్వరూపాన్ని తెలుసుకోవాలంటే మనం కొన్ని మౌలిక వాస్తవాలను పరిశీలించాలి.

2009లో ప్రారంభించబడిన న్యూస్‌క్లిక్...పిపికె న్యూస్‌క్లిక్ స్టుడియో ప్రయివేట్ లిమిటెడ్ అనే ఒక చిన్న ప్రయివేటు కంపెనీకి చెందినది. చిన్న బడ్జెట్‌తో పనిచేస్తుంది. ఒక ఎడిటోరియల్ బృందం సమిష్టిగా దీన్ని నడుపుతుంది. దాని వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు ప్రబీర్ పుర్కాయస్థ ఒక ఇంజినీరు, విద్యుత్, టెలికమ్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో సైన్సు ప్రచారకార్యకర్త. భారత దేశ వామపక్షంలో ప్రతిష్ట కలిగిన మేధావి. ఈ వార్తా సంస్థ ప్రజా ఉద్యమాలు, పోరాటాలను గురించి రిపోర్టు చేస్తుంది, విశ్లేషిస్తుంది, వ్యాఖ్యానిస్తుంది. అనేక అంశాలపై అది నిత్యం విమర్శనాత్మక, పురోగామి గొంతులు వినిపించే అవకాశం కల్పిస్తుంది. అందువల్ల సహజంగానే న్యూస్‌క్లిక్ మోడీ ప్రభుత్వ నిరంకుశ 'హిదూత్వ' లేక హిందూ–ఆధిపత్యవాద రాజకీయ ఎజెండాను వ్యతిరేకిస్తుంది, దాని నుండి వచ్చే విధానాలను విమర్శిస్తుంది.

> "ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ ప్రవేశపెట్టిన ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అది సత్య దూరంగా ఎవరో పైనుండి ఆదేశించి రూపొందించి నట్లు ఉన్నది మినహా నిజాయితీగా లేదు. ఎఫ్ఐఆర్ చదివితే బూజుపట్టిపోయిన పోలీసు మైండ్ ఎలాఉంటుందో మనకు తెలియజేస్తుంది. కోర్టులు పగ్గాలు వదిలేస్తే 'ముందు శిక్షించడం, తరువాత తీర్పు చెప్పడం' అనే లక్ష్యంతో పనిచేసే పరమ వికృత, దుష్ట, బుర్రలేని పోలీసు రాజ్యంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఇది మనకు రుచి చూపిస్తుంది."

ఈ న్యూస్ పోర్టల్ తన రిపోర్టులనూ, విశ్లేషణలనూ, రోజువారీ అప్‌డేట్స్‌నూ ఉచితంగా అందిస్తుంది. చందాదారులను చేర్పించడం, విదేశాల్లో ఎంపిక చేయబడ్డ కస్టమర్లకు తన జర్నలిస్టిక్ కంటెంట్‌ను అమ్మడం, దాని పనికి మద్దతిచ్చి, దాన్ని మరింత విస్తరించాలని కోరుకునే వారి నుండి కొంత మేరకు పెట్టుబడులు సమకూర్చుకోవడం వంటి మార్గాల ద్వారా అది సంస్థను నడపగలుగుతోంది. దీన్ని బట్టి స్పష్టమయ్యే దేమంటే ఈ సంస్థ లాభార్జన రహిత సంస్థ కాకపోయినా, లాభాలే లక్ష్యంగా పనిచేసే సంస్థ కాదు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రైతు వ్యతిరేక చట్టాకు వ్యతిరేకంగా 2020-21లో తలెత్తిన రైతాంగ ఉద్యమం సందర్భంలో న్యూస్‌క్లిక్ గొప్ప పాత్ర నిర్వహించి ంది. ఆ ఉద్యమానికి సంబంధించి న్యూస్‌క్లిక్ క్రింది స్థాయి నుండి అందించిన రిపోర్టులు, సమగ్రమైన, ఉద్యమానికి సానుకూలమైన వార్తలు, ఉద్యమం ఏ సమస్యలపై జరుగుతోంది అన్న విషయాలను పెద్ద సంఖ్యలో ప్రజలు ఫాలో అయ్యారు. ఈ విషయాలన్నిటినీ సంస్థ హిందీ, ఇంగ్లీషుల్లో వారా కథనాలు, వీడియోల రూపంలో అందజేసింది. ఈ కవరేజీ ఎంతగా ఉందంటే పెద్ద మీడియా సంస్థలు, వార్తా పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు కూడా అంతగా కవర్ చేయలేకపోయాయి. ఒక రకంగా చెప్పాలంటే ఉద్యమం విజయం సాధించి, మూడు ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయబడ్డంలో న్యూస్‌క్లిక్ ప్రముఖ పాత్ర నిర్వహించింది.

ఈలోగా అమెరికా పౌరుడైన వామపక్ష వైఖరిగల మేధావి, కార్యకర్త, విజయసాధకుడైన వ్యాపారవేత్త అయిన నెవిల్లె రాయ్ సింఘమ్ ఈ కథలోకి ప్రవేశించాడు. ఆయన ప్రపంచ స్థాయి గల ఐటి కన్సల్టెన్సీ థాట్‌వర్క్స్ ఇంక్ వ్యవస్థాపకుడూ, ఎక్కువ షేర్లు గల యజమానీ. ప్రపంచ వ్యాపితంగా విస్తరించి ఉన్న ఈ సంస్థకు భారత దేశంలో కూడా వర్క్ సైట్లు, ఆఫీసులు, ఉద్యోగులు ఉన్నారు. 2017లో థాట్‌వర్క్స్ ను ఒక బ్రిటిష్ ప్రయివేట్ ఈక్విటీ ఫండ్‌కు 78.5 కోట్ల డాలర్లుకు అమ్మేశారు. ఈ అమ్మకం వల్ల వచ్చిన డబ్బును సద్వినియోగం చేయాలన్న సంకల్పంతో సింఘమ్, ఆయన టీమ్ అమెరికాలో ఒక ప్రయివేటు ఫౌండేషన్ స్థాపించారు. దానిపేరు పీపుల్స్ సపోర్ట్ ఫౌండేషన్ లిమిటెడ్ (పిఎస్ఎఫ్). ఈ సందర్భంగా ఫౌండేషన్ లాయరు, మేనేజర్ అయిన జాసన్ ఫెచెర్ చేసిన ఒక ప్రకటన ఇక్కడ గమనార్హం. "పిఎస్ఎఫ్‌కు విరాళంగా వచ్చిన నిధులన్నీ థాట్‌వర్క్స్ అమ్మకం ద్వారా మాత్రమే వచ్చాయి,", "పిఎస్ ఎఫ్ ఏనాడూ ఒక విదేశీ ప్రభుత్వం నుండి నిధులు స్వీకరించలేదు'' అని ఆయన ప్రకటించారు. ఈ ఫౌండేషన్‌కి వరల్డ్‌వైడ్ మీడియా హోల్డింగ్స్ (డబ్ల్యుఎంహెచ్) అనే ఒక పెట్టుబడి మాధ్యమం ఉంది. ఇది "ప్రపంచ వ్యాపితంగా ప్రజానుకూల వార్తలు ఇచ్చే మీడియా ప్రాజెక్టుల్లో లాభాలు ఆశించి పెట్టుబడులు పెడుతుంది."

''డబ్ల్యుఎంహెచ్ ఆశయాలకు అను గుణంగా న్యూస్‌క్లిక్ పనిచేస్తున్నదనీ, అందువల్ల దానిలో పెట్టుబడులు పెట్టవచ్చుననీ'' 2017లో డబ్ల్యుఎంహెచ్ గుర్తించింది. న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ థాట్‌వర్క్స్ సంస్థలో అనేక సంవత్సరాలు పనిచేశారు. అందువల్ల ఆయన సంగతి తెలిసిన డబ్ల్యుఎంహెచ్ న్యూస్‌క్లిక్‌లో పెట్టుబడి పెట్టవచ్చునని భావించింది. 2018 మార్చిలో పెట్టుబడి పెట్టడం జరిగింది.

2021 సంవత్సరం నుండీ కేంద్ర ప్రభుత్వ సంస్థలు ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి), ఢిల్లీ పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం, ఆదాయపన్ను శాఖలు రాజకీయ కారణాలతో న్యూస్‌క్లిక్ ఆఫీసు మీద దాడులమీద దాడుల చేస్తున్నాయి. పెద్ద ఎత్తున పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మెయిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కానీ మనీ లాండరింగ్‌కు సంబంధించిన ఆధారాలు దొరకలేదు. ఆదాయపు పన్ను ఎగవేత ఆధారాలూ దొరకలేదు. దాంతో ఈ కేసు మూసేసే దశకు వచ్చింది.

ఇప్పుడు న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక 'ప్రత్యేక కథనం'తో రంగంలోకి ప్రవేశించింది. పరిశోధనాత్మక కథనం పేరుతో అది వండివార్చిన వాస్తవాలు, సైద్ధాంతిక నిందలు, తక్కువ సరుకు గల ఎక్కువ నిర్ధార ణలుతో. అతికొద్దిపాటి డేటాతో ఈ కథనం ప్రచురించింది. ఈ కథనానికి ''చైనా ప్రపంచవ్యాపిత ప్రచార నెట్‌వర్క్ అమెరికా టెక్ మొఘల్‌ను చేరింది" అని శీర్షిక పెట్టింది. 'చైనాను సమర్థించే, దాని ప్రచారాన్ని ముందుకు తీసుకుపోయే క్యాంపెయిన్ వ్యవస్థకు పెద్ద ఎత్తున విరాళాలు' అందుతున్న వైనాన్ని తాను కనిపెట్టినట్టు అది చెప్పుకుంది. దీనికి కేంద్రంగా అమెరికా కోటీశ్వరుడు నెవిల్లె రాయ్ సింఘమ్ ఉన్నట్లు పేర్కొంది. ఆయన వామపక్ష భావాల వ్యాప్తికి సహకరించే సోషలిస్టు అని కూడా పేర్కొంది అదేదో నేరం అయినట్లు. న్యూస్‌క్లిక్ గురించి ఈ వ్యాసంలో రెండు యధాలాప ప్రస్తావనలు ఉన్నాయి. "భారత దేశంలో న్యూస్‌క్లిక్‌కు చైనా ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు దాని కార్యాలయంపై దాడులు చేశారు. అయితే వారికి ఎటువంటి ఆధారాలు దొరకలేదు" అని అది పేర్కొంది. మరోచోట సింఘమ్ నెట్‌వర్క్ న్యూస్‌క్లిక్‌కు నిధులిచ్చింది అందువల్ల అది 'తన కవరేజీలో చైనా ప్రభుత్వ టాకింగ్ పాయింట్లను చేర్చింది' అని పేర్కొంది.

విశేషం ఏమంటే న్యూయార్క్ టైమ్స్ వ్యాసంలో న్యూస్‌క్లిక్ చట్టాన్ని ఉల్లంఘించిందని ఎక్కడా చెప్పలేదు. ఆ పత్రిక పరిశోధనాత్మక జర్నలిస్టు గనుక న్యూస్‌క్లిక్ సంపాదకుణ్ణి లేదంటే యాజమాన్యాన్ని సంప్రదించి ఉంటే 'నిధులు సమకూర్చడం' అనేది డబ్ల్యుఎంహెచ్ పెట్టుబడుల రూపంలో ఇచ్చిందని తెలిసేది. దీని వివరాలను చట్ట ప్రకారం ఆయా అధికారులకు ముందుగానే తెలియజేసి ఉన్నారనీ, భారత దేశపు ఇడి విభాగం ఆరోపించినట్లు ఈ విషయంలో మనీ లాండరింగ్ జరగలేదనీ, 2021 ఫిబ్రవరిలో రాజకీయ ఒత్తిళ్లతో జరిగిన దాడుల్లో

**"న్యూస్‌క్లిక్, దాని జర్నలిస్టులకు సంఘీభావంగా సమిష్టి నిరసన కార్యక్రమాలు జరగడం ఆనందించదగ్గ విషయం. దీంతోపాటు ఈ విషయాన్ని కోర్టులో సవాలు చేయడం జరిగింది. భారత దేశపు ప్రఖ్యాత లాయర్లు కొందరు దాడులకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు.కానీ ఇదే సరిపోదు. అప్పుడప్పుడూ జరిగే కార్యక్రమాలతో మీడియా స్వాతంత్ర్యా న్ని, స్వేచ్ఛనూ కాపాడలేం. రాజ్యం అణచి వేతను అనేక మార్గాల్లో ఎదుర్కోవాలి,"**



**న్యూస్‌క్లిక్ వ్యవస్థాపక ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేసి తీసుకు వెళుతున్న ఢిల్లీ పోలీసులు**

అధికారులకు మనీలాండరింగ్‌కు సంబంధించి ఎటువంటి ఆధారాలూ లభించలేదనీ తెలిసేది. అంతేకాదు ఢిల్లీ హైకోర్టు ప్రైమా ఫేసీ కేసు విచారణ చేసిన అనంతరం న్యూస్‌క్లిక్‌కు అనుకూలంగా.. కంపెనీకి చెందిన అధికారులెవ్వరినీ అరెస్టు చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చిందనీ, ఇటువంటి ఒక కేసులో ఈ సంస్థకు వ్యతిరేకంగా ఆదాయపు పన్ను శాఖవారు చేసిన ఫిర్యాదును దిగువ కోర్టు ఒకటి కొట్టివేసిందని కూడా ఆ విలేకరికి తెలిసి ఉండేది. ఇక న్యూస్‌క్లిక్ 'చైనా ప్రభుత్వ టాకింగ్ పాయింట్లను' ప్రచారం చేస్తున్నదని చెప్పడానికి న్యూయార్క్ టైమ్స్ పత్రిక జర్నలిస్టు ఇచ్చిన ఉదాహరణ ఏమంటే, 2019 అక్టోబర్ 2న "70 ఏళ్ల చైనా విప్లవం' సందర్భాన్ని పురస్కరించుకుని తదనంతరం దేశంలో జరిగిన పరిణామాత్మక మార్పుల గురించి వివరించే ఒక వీడియోను ప్రసారం చేయడమే.

న్యూయార్క్ టైమ్స్ కథనం పూర్తిగా జర్నలిజం ముసుగులో జరిగిన సైద్ధాంతిక పక్షపాతంతో కూడిన కథనం. దాన్ని న్యాయమైన విమర్శ అని ఏమాత్రమూ అనరు. లాయరు, డబ్ల్యుఎంహెచ్ మేనేజర్ అయిన జాసన్ ఫెచెర్ జర్నలిజం నైతిక విలువలపై తీవ్రమైన ఫిర్యాదు చేశారు. ఈ వ్యాసాన్ని ప్రచురించే ముందు ఆయన జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు పిఎస్ఎఫ్ తరపున జవాబులు చెప్పాడు. ఆ జవాబులు ఇలా ఉన్నాయి: "పిఎస్ఎఫ్ ఏనాడూ నిధులు తీసుకోలేదు. విదేశీ వ్యక్తుల నుండి గానీ, సంస్థల నుండి గానీ, రాజకీయ పార్టీల నుండి గానీ లేక ప్రభుత్వం లేక దాని సభ్యులు, ప్రతినిధుల నుండి గానీ ఎటువంటి ఆదేశాలూ దానికి రాలేదు''. దిగ్భ్రాంతికరమైన విషయం ఏమంటే న్యూయార్క్ టైమ్స్ పత్రిక...నిధులు రాలేదని ఆయన చేసిన ఖండనను ప్రచురించకుండా వదిలేయడం ద్వారా పాఠకుల్లో పిఎస్ఎఫ్‌కు ఆ మాటకొస్తే రాయ్‌కి నిధులు థాట్‌వర్క్స్ అమ్మకం నుండి కాకుండా చైనా నుండి అందుతున్నాయన్న భావన ఏర్పడేట్లు చేసింది.

న్యూయార్క్ టైమ్స్ ఉప్పందించిన విషయాన్ని పట్టుకుని న్యూస్‌క్లిక్ మీద ఈ సారి మరో దాడికి పూనుకున్నారు. ఈసారి ప్రభుత్వం మెకార్థీ ప్రచార పద్ధతిలో తప్పుడు సమాచారం, భయపెట్టడం, దుష్ప్రచారం చేయడానికి పూనుకుంది. హిందూత్వ ప్రచారకులు, లేక అందరూ పిలుస్తున్నట్లు మూఢ "భక్తులు" సోషల్ మీడియా వేదికల మీద రెచ్చిపోయారు. అమెరికా వార్తా పత్రికలు వెల్లడించిన వివరాలను బట్టి భారత దేశ జాతీయ భద్రతకే ప్రమాదం వచ్చినట్లు వారు ప్రచారాన్ని లంకించుకున్నారు. న్యూస్‌క్లిక్, దాని వెనుకనున్న వారి రక్తం కళ్లజూడాలని రంకెలు వేశారు. జాతీయ ప్రధాన మీడియాలో ఒక భాగం, ముఖ్యంగా ప్రభుత్వ ప్రచార బాకాలుగా పేరుతెచ్చుకున్న ఒకటి రెండి టెలివిజన్ ఛానళ్లు కూడా ఈ దుష్ప్రచారంలో గొంతుకలిపాయి. దర్యాప్తు సంస్థలు 'లీక్' చేశాయన్న పేరుతో ఇష్టం వచ్చినట్లు తప్పుడు వార్తలు ప్రసారం చేశాయి.

దీంతో న్యూస్‌క్లిక్ మీద నేర, ఉగ్రవాద సంబంధ ఆరోపణలతో కేసులు పెట్టడం జరిగింది. అక్టోబర్ 3న, ఆ తరువాత జరిగిన ఘటనలకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా జర్నలిస్టులు, లాయర్లు, రాజకీయ కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేశారు. దీన్ని ఖండిస్తూ, లేక న్యూస్‌క్లిక్ మీద బిజెపి ప్రభుత్వ దాడులను విమర్శిస్తూ అనేక పత్రికలు ఎడిటోరియల్స్ రాశాయి, వార్తలు ప్రచురించాయి. ప్రెస్ క్లబ్బులు, వర్కింగ్ జర్నలిస్టుల సంఘాలు, వృత్తి సంఘాలు ముఖ్యంగా ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, డిజిపబ్, ఇండియన్ మీడియాలో మహిళా నెట్‌వర్క్, వీటితోబాటు న్యూయార్క్‌కు చెందిన కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ మొదలైనవి ఈ దాడులను తీవ్రంగా ఖండించాయి. న్యూస్‌క్లిక్, దాని జర్నలిస్టులకు సంఘీభావంగా సమిష్టి నిరసన కార్యక్రమాలు జరగడం ఆనందించదగ్గ విషయం. దీంతోపాటు ఈ విషయాన్ని కోర్టులో సవాలు చేయడం జరిగింది. భారత దేశపు ప్రఖ్యాత లాయర్లు కొందరు దాడులకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు.

కానీ ఇదే సరిపోదు. అప్పుడప్పుడూ జరిగే కార్యక్రమాలతో మీడియా స్వాతంత్ర్యా న్ని, స్వేచ్ఛనూ కాపాడలేం. రాజ్యం అణచి వేతను అనేక మార్గాల్లో ఎదుర్కోవాలి, ప్రతిఘటించాలి. ఈనాడు విషపూరిత ప్రచారం ముమ్మరిస్తున్న తరుణంలో సోషల్ మీడియాలోనూ, కొన్ని వృత్తిపరమైన మీడియా వేదికల్లో కూడా తప్పుడు సమాచారం, విద్వేష రాజకీయాలు తీవ్రంగా ప్రచారం అవుతున్న తరుణంలో ఈ ప్రతిఘటనను సుస్థిరంగా నిర్వహించడం నిజమైన సవాలు.

2014 మే నెల నుండి ఇప్పటివరకు 19 మంది భారతీయ జర్నలిస్టులు తమ వృత్తిలో ఉండగా చంపబడ్డారు. కానీ చంపిన వారిని

(మిగతా 34వ పేజీలో)

సిద్ధాంతం

# బూర్జువా వార్తాపత్రికల మాయలో కార్మికులు పడరాదు

ఆంటోనియో గ్రాంసీ



రచయిత ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, మార్క్సిస్టు మేధావి

ఇవి వార్తాపత్రికల సర్కులేషన్ పెంచటం కోసం క్యాంపెయిన్ జరుగుతున్న రోజులు. బూర్జువా వార్తాపత్రికల యజమానులు, నిర్వాహకులు దారిన పోయేవారిని (అంటే పాఠకులను) ఆకర్షించే విధంగా తమ షాపులలో పత్రికను ప్రదర్శించే కిటికీలకు వార్నిష్ రాసి, చక్కగా అలంకరిస్తారు. ప్రతిరోజూ ఉదయం లేక సాయంత్రం నాలుగు, ఆరు పేజీలతో వార్తాపత్రికలు వస్తాయి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను వార్తాపత్రికల యజమానులు, నిర్వాహకుల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యాఖ్యానిస్తాయి. వాటిని పాఠకుల మెదళ్ళలోకి ఎక్కించి, యజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా అర్థం చేసుకొని, వ్యాఖ్యానింపజేసే విధంగా ఉంటాయి.

కార్మికులు తాము చందాదారులుగా చేరే వార్తాపత్రికను ఎంచుకోవటం గురించీ, వారు అమాయకంగా చేసే ఈ పని ఎంత ముఖ్యమైనదో, ఎంత ప్రాధాన్యత కలదో కార్మికులతో ప్రత్యేకంగా చర్చించాలి. కార్మికులను ఉచ్చులోకి, ప్రమాదంలోకి లాగే పరిస్థితులలో చైతన్యవంతంగా, పరిణితితో యోచించి, తగిన కొలబద్దను వినియోగించి పత్రికను ఎంపిక చేసుకోవాలి.

అన్నిటికీ మించి కార్మికులు పెట్టుబడిదారీ పత్రికల మోజు నుండి తక్షణమే బయట పడాలి. పెట్టుబడిదారీ వర్గపు వార్తాపత్రికలు (అవి వారిలో ఏతరగతికి చెందినవైనప్పటికీ) తమ ప్రయోజనాలకూ, భావాలకూ వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించే సాధనాలని కార్మికులు ఎల్లప్పుడు, ఎల్లప్పుడు, ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. పత్రికలో ప్రచురించే ప్రతి విషయం ఒకే అభిప్రాయంతో ప్రభావితమై ఉంటుంది. ఆధిపత్యంలో ఉన్న వర్గానికి అనివార్యంగా సేవచేసేలా, దాన్ని వాస్తవంలోకి మార్చి కార్మిక వర్గంతో పోరాటం చేసేలా ఉంటాయి. వాస్తవంగా పెట్టుబడిదారీ పత్రికలలో మొదటి వాక్యం నుండి చివరి వాక్యం వరకు ఈ లక్ష్యాలను నెరవేర్చే విధంగానే ఉంటాయి.

వందలు, వేలాది మంది కార్మికులు ప్రతి రోజూ, క్రమబద్ధంగా తమ ధనాన్ని బూర్జువా పత్రికలకు ఇస్తూ వాటి శక్తిని పెంచుకోవటానికి తోడ్పాటునందిస్తున్నారు. ఎందుకు? తన ముందు బూర్జువా వార్తాపత్రికను పెట్టుకొని రోడ్డుమీదనో, ట్రామ్‌లోనో ప్రయాణం చేస్తున్న వారిని దీనిని గురించి మీరు అడిగితే "ఏం జరుగుతున్నదో తెలుసుకోవటానికి నాకు అవసరం" అని చెబుతాడు. అందులోని వార్తలు, విషయాలను కళాత్మకంగా మలిచి, కార్మికుని ఆలోచనలను, మేధను తమకు కావలసిన వైపుకు మలచుకోవటానికి అవి ఉద్దేశించబడినవనే విషయం ఎప్పటికీ అతని బుర్రలోకి ప్రవేశించదు. ఈ వార్తాపత్రిక అవకాశవాదంతో ఉన్నదనీ, ఒకటి ధనికుల కోసమని, రెండు, మూడు, నాలుగు, ఐదు తన ప్రయోజనాలకు పూర్తి విరుద్ధమైన బూర్జువా రాజకీయ పార్టీలతో లంకెవేసుకొని ఉన్నాయని అతను తెలుసుకోవలసి ఉంది.

పెట్టుబడిదారీ వార్తాపత్రికలు చిన్న విషయాలను కూడా పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా, కార్మికవర్గానికి, వారి రాజకీయాలకు వ్యతిరేకంగా చెప్పటాన్ని ప్రతి కార్మికుడూ, ప్రతిరోజూ వ్యక్తిగతంగా చూస్తున్నాడు. ఒక సమ్మె ప్రారంభమైతే ఏం జరుగుతుంది? కార్మికులు ఎల్లప్పుడూ తప్పు దారిలోనే ఉంటున్నట్లు పెట్టుబడిదారీ వార్తాపత్రికలు రాస్తాయి. ఒక ప్రదర్శన జరిగితే ఏమౌతుంది? ప్రదర్శనలో పాల్గొన్నవాళ్ళు అపమార్గంలో ఉన్నారని ఎప్పుడూ చెబుతాయి. కేవలం వారు కార్మికులు కాబట్టి తల పొగరు కలవారనీ, గొడవలు సృష్టించే వాళ్ళనీ, గూండాలనీ ప్రచారం చేస్తాయి. ప్రభుత్వం ఒక చట్టం చేస్తే ఏమి చెబుతాయి? ఆ చట్టం న్యాయమైనది, ఉపయోగకరమైనది కాకపోయినా అది మంచిదనీ, న్యాయమైనదనీ, ఉపయోగకరమైనదనీ చెబుతాయి. ఎన్నికలు, రాజకీయ, అధికార పోరాటం జరుగుతుంటే ఏమి చెబుతాయి? అన్నింటికన్నా మంచి కార్యక్రమం, అందరికన్నా మంచివారు బూర్జువా పార్టీల అభ్యర్థులేనని చెబుతాయి.

కార్మికులను దారి తప్పించటానికి బూర్జువా వార్తాపత్రికలు కొన్ని సార్లు మౌనంగా ఉంటాయి. కొన్ని సార్లు వక్రీకరిస్తాయి. మరికొన్ని సార్లు అసత్యాలను సత్యాలుగా చెబుతూ కార్మికులను అజ్ఞానంలో ఉంచటానికి ప్రయత్నిస్తాయి. కానీ మనం ఈ విషయాలకు సంబంధించిన వాస్తవాలను గురించి కనీసం మాట్లాడం. కాబట్టి బూర్జువా వార్తాపత్రికల మోసాన్ని కార్మికులు అంగీకరించటానికి అవధులు లేకుండా ఉన్నాయి. దీనికి వ్యతిరేకంగా మనం స్పందించాలి. వాస్తవాన్ని సక్రమంగా అర్థం చేసుకొనే విధంగా కార్మికులకు మనం తోడ్పడాలి. లక్ష్యం లేకుండా వార్తాపత్రికలు అందించే యువకుల చేతుల్లో పెట్టే డబ్బులు బూర్జువా వార్తాపత్రికలకు ఇచ్చే ఆయుధాలు. తగిన సమయం చూసి వాటిని కార్మికవర్గానికి వ్యతిరేకంగా ప్రయోగిస్తారు.

కార్మికులు అత్యంత ప్రాథమికమైన ఈ వాస్తవాలను తెలుసుకొని, బూర్జువా వర్గం ఎంత ఐక్యతతో, క్రమశిక్షణతో కార్మికవర్గ వార్తాపత్రికలను, అంటే సోషలిస్టు పత్రికలను బహిష్కరిస్తున్నారో అంత ఐక్యంగా, క్రమశిక్షణతో బూర్జువా పత్రికలను బహిష్కరించడానికి కార్మిక వర్గాన్ని ఒప్పించాలి. ఏ విషయంలో అయినా మీ శత్రువైన బూర్జువా పత్రికా రంగానికి ఆర్థిక సహాయం అందించవద్దు. అన్ని బూర్జువా వర్గ పత్రికలు చందాదారులను పెంచుకోవటానికి క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఈ సందర్భంలో, వాటిని బహిష్కరించండి, వాటిని బహిష్కరించండి, వాటిని బహిష్కరించండి అనేది మన యుద్ధ నినాదంగా ఉండాలి.

**(గ్రాంసీ 1961లో "వార్తాపత్రికలు, కార్మికులు" అన్న శీర్షికతో రాసిన ఈ వ్యాసాన్ని ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీ పత్రిక 'అవంతి'లో అదే ఏడాది డిసెంబర్ 22న ప్రచురించారు.)**

# కుల గణన

## నిజమైన సామాజిక న్యాయం X హిందూత్వ

హరిష్ వాంఖేడ్



రచయిత ఢిల్లీలోని జెఎన్‌యులో ప్రభుత్వ సంస్థలు, సామాజిక న్యాయ శాస్త్రాల అసిస్టెంట్ ప్రొఫెసర్

**అణగారిన కులాలకు సామాజిక న్యాయం చేయడానికి ఇప్పుడు అమలవుతున్న విధానాలనన్నిటిని సమూలంగా మార్చాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది బీహార్ కుల గణన. ఇది కొత్త రాజకీయ చైతన్యానికి బాటలు వేయవచ్చు.**

.......

గత నాలుగు దశాబ్దాలుగా అమలవుతున్న నయా–ఉదారవాద విధానాలు ఉద్యోగాలలోనూ, యాజమాన్యాలలోనూ కొత్త రంగాలను సృష్టించాయి. ఫలితంగా ప్రముఖమైన ఉన్నత మధ్యతరగతి ఆవిర్భవించింది. అది భారతదేశ వ్యాప్తంగా ఉన్న అనేకమంది ఇంజినీర్లు, సాంకేతిక పరిజ్ఞానులు, వృత్తి విద్యా నిపుణులు వలసలు పోయేందుకు అవకాశం కల్పించింది. ఈ క్రమం, నేడు దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ముసుగేయగలిగింది. ఈ రోజు దేశ జనాభాలో అత్యధికభాగం అత్యంత వెనుకబాటు తనానికి గురైఉన్నారు. వీరు దేశ ఆర్థిక, రాజకీయ పరిమాణాలకు దూరంగా మిగిలిపోయారు. వీరిలో ఎక్కువశాతం గ్రామీణప్రాంతాలలో నివసించేవారే. చిన్నచిన్న పనులు చేసుకుంటూ బతికే వారే. ఎన్నికల ప్రక్రియలో నిర్ణయాత్మక స్థానాలలో లేనివారే.

వర్గ అసమానతలు, విద్యలో వెనుకబాటుతనం, జనాభాలో వివిధ కులాల, వివిధ మతస్థుల స్థానాలు తెలుసుకోడానికి రాష్ట్రాలు అనేక కమిషన్లు వేస్తుంటాయి (1955లో కాకా కాలేకర్ .1980 లో మండల్. 2006 సచార్). ఇటువంటి కమిషన్లు సమర్పించిన గణాంకాలు చట్టసభల్లో తగిన చట్టాలు చేయడానికి ఉపయోగపడతాయి. సమాజంలో అణగారిన, వెనుకబడిన తరగతి ప్రజలకు ప్రయోజనకరమైన విధానాలు రూపొందించడానికి అవసరమవుతాయి.

ఈ మధ్యే (2023) బిహార్ ప్రభుత్వం, కుల గణన సర్వే నివేదిక విడుదల చేసింది. ఇది రాష్ట్రాలు తమ జనాభాలోని వివిధ తరగతుల వివరాలను సేకరించవలసిన అవసరాన్ని మరోమారు నొక్కి చెప్పింది. వెనకబడిన, నిమ్న కులాల ప్రజల ప్రయోజనాలు కాపాడడానికి రూపొందించిం చవలసిన విధానాల ఆవశ్యకతను ఈ గణన తెలియచేస్తుంది. విడుదల చేసిన నివేదికలో ఉన్నత కులాలవారు మైనారిటీలుగా, అంటే రాష్ట్ర జనాభాలో కేవలం 16 % గా మాత్రమే ఉన్నారని తెలియచేసింది. ఇతర వెనుకబడిన కులాలవారు (ఒబిసి) 27.12% ఉండగా, అత్యంత వెనుకబడిన కులాలు (ఎక్స్‌ట్రీమ్‌లీ బాక్‌వార్డ్ కాస్ట్స్–ఇబిసి) అత్యధికంగా 36. 01% ఉన్నట్టు తెలియవచ్చింది. అంటే రాష్ట్ర జనాభాలో మొత్తం వెనుకబడిన కులాల వారు 63. 13 % ఉన్నారని అర్థం.

కులాలవారీ జరిగిన ఈ గణన, దేశంలోని కీలకమైన వనరులు (భూమి, ప్రభుత్వ సంస్థలు, బడా పరిశ్రమలు) ఉన్నత వర్గాల ఆధీనంలోనే ఉన్నాయనేది వాస్తవమని నిరూపిస్తున్నది. ఇతర వెనుకబడిన కులాలు, అత్యంత వెనుకబడిన కులాలు, ఎస్సీలది ప్రేక్షక పాత్రే. వారు అతి తక్కువ వేతనాలు పొందుతున్న వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. లేదా గ్రామీణ ప్రాంతాలలోని కార్మికులుగా ఉన్నారు.

ఇదివరకటి సర్వేలు కూడా భూమి ఏ ఏ కులస్థుల ఆధీనంలో ఎంత మేరకు ఉందో తెలిపాయి ఈ సర్వే లలో సామాజికంగా అగ్రకులాలుగా (బ్రాహ్మణులూ, భూమిహార్లు, రాజపుట్లు) ఉన్న వారి ఆధీనంలోనే అత్యధిక శాతం భూమి ఉన్నట్టు తేలింది. ఆర్థికంగా వెనుకబడిన కులాల అధీనంలో ఉన్నభూమి అతి స్వల్పం. ఇతర వెనుకబడిన కులాలలోని యాదవులు, కుర్మీలు (ప్రధానంగా 14.26 శాతం జనాభాగలిగిన యాదవులు, 2.87% ఉన్న కుర్మీలు) అధీనంలో కూడా భూమి ఉన్నది. వారు ప్రజాతంత్ర వ్యవస్థలో ప్రధాన భూమికను పోషిస్తున్నారు. అయితే వారికి కూడా ఉన్నత కులాలకంటే తక్కువ భూమి ఉంది. అంటే ఇతర వెనుకబడిన కులాలు, అత్యంత వెనుకబడిన కులాలు సంఖ్యాపరంగా అత్యధిక భాగంగా ఉన్నప్పటికీ ఆర్థిక సంపదకి, వ్యవస్థలలో పరపతికి ఆమడదూరంలో ఉన్నారు.

బీహార్ ప్రభుత్వం నిర్వహించిన ఈ సర్వే రాష్ట్రం రూపొందించే విధాన రూపకల్పనను ప్రభావితం చేయడమే కాదు, దేశ రాజకీయాలను కూడా ఓ కుదుపు కుదుపుతుంది. వెనుకబడిన కులాల జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రధానంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో కూడా ఇటువంటి సర్వేలు నిర్వహించడం వల్ల వెనుకబడిన కులాల రాజకీయ సమీకరణలకు దారి తీస్తుంది. వారు ఆయా రాష్ట్ర రాజకీయ వ్యవస్థల్లో, శాసన సభలు వగైరాలలో, అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో తమవంతు వాటాను కోరవచ్చు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు కూడా కొత్తగా అందు బాటులోకి వచ్చిన గణాంకాలను రాజకీయాలలో స్తబ్దుగా ఉన్న సామాజిక న్యాయం అంశాన్ని పునరుత్తేజింపచేయడానికి వాడుకోవచ్చు. ఈనాడు కేంద్రంలో ఉన్న హిందుత్వ పాలనను సవాలు చేయడానికి ఉపయోగించవచ్చు.

అంటే, బీహార్లో నిర్వహించబడిన కుల

" బీహార్ కుల గణన మితవాదుల అధికార దాహార్తుల గుండెల్లో గుబులు రేపుతున్నది. కారణం స్పష్టం. ఇది సామాజికంగా అధమ స్థానంలో ఉన్నవారిలో రాజకీయ చైతన్యానికి బాటలు వేసే శక్తి కలిగి ఉన్నది. రాజ్య రక్షణలో తమ స్థానం కోసం దావా చేయడానికి అవకాశం ఏర్పరిచింది. "

గణనకు ఆర్థికంగా వెనుక బడిన కులాల సమస్యను మార్పుకు గురిచేయగల సత్తా ఉన్నది. వెనుకబడిన తరగతులకు సామాజిక న్యాయం అందించడానికి ఇప్పుడు అమలవుతున్న విధానాల మార్పును ప్రోత్సహించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అణగారిన తరగతులనుండి ప్రభావితం చేయగల కొత్త నాయకత్వం అవిర్భవించవచ్చు. ఈ తరగతుల సంక్షేమాన్ని కోరేవారికి ప్రాధాన్యతలనిచ్చే కొత్త రాజకీయ, సామాజిక మిత్రుల చుట్టూ సమీకరణలు జరగవచ్చు. ప్రధానంగా ,ఇది సాంప్రదాయకంగా అనుసరిస్తున్న సామాజికన్యాయ అజెండాని సంస్కరిస్తుంది. అత్యంత వెనుకబడిన కులాల కు శాసన సభల్లో సమభాగస్వామ్యాన్ని కలిగిస్తుంది. వారికి అధికార యంత్రాంగంలో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తుంది. వారికి చెందవలసిన రాజ్యాంగ రక్షణ కల్పిస్తుంది.

గత రెండు దశాబ్దాలుగా బీజేపీ లోని మితవాద పక్షం వివిధ రకాల సాంస్కృతిక ఎత్తుగడలతో, అత్యధికంగా వెనుకబడిన తరగతులను ప్రభావితము చేస్తున్నది. ఈనాడు బీజేపీ రాజకీయంగా బలపడడానికి కారణం ఉత్తర భారతదేశంలో అది రాజకీయంగా పొందుతన్న విజయాలకు కారణం ఆ ప్రాంతాలలో అది అత్యంత వెనుకబడిన కులాల నుండి పొందుతున్న మద్దత్తు. ఈ మద్దత్తు బీజేపీ కేవలం ఉన్నత కులాలకు ప్రాతినిధ్యం వహిస్తుందన్న ఆరోపణను పూర్తిగా తొలగించింది. నిమ్న కులాలతో సహా ''హిందుత్వ తనలో అన్ని కులాలను ఇముడ్చుకుంటుందన్న'' పేరు సంపాదించ డానికి తోడ్పడింది. అంతేకాదు, రకరకాల జానపద నృత్యాలు, సంప్రదాయాలు, ఆయా కులాల గాథలు ప్రచారంలో పెట్టి వీరందరిని తనవైపు ఆకట్టుకుంది.

ప్రధానంగా మితవాదులు, యాదవులను లక్ష్యంగా చేసుకుంది. వారు రాజకీయాధికారంలో, ఆధిపత్యంలో ఉన్నట్టు, రాష్ట్ర సంపదలో సింహభాగం పొందుతున్నట్టు ప్రచారం చేసింది. అందువలన అత్యంత వెనుకబడిన కులాలు, బీజేపీ తమకు కూడా సమర్ధవంతంగా సామాజిక, ఆర్థిక న్యాయం అందిస్తుందని భ్రమపడి మద్దత్తు నిచ్చాయి.

బీజేపీ ప్రభుత్వాలు కులాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించాయనే అపోహ కూడా ఉంది.



బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్

అయితే, ఇవి కేవలం బీజేపీ ప్రభుత్వాలు ఆయా కులాలవారు తమకి ఎన్నికలముందు వాగ్దానం చేసినట్టు రాజకీయ, సామాజిక ఆకాంక్షలు పక్కదారి పట్టించేందుకు పన్నిన పన్నాగమని తెలియవస్తున్నది. బీజేపీ హయాంలో ఆర్థికంగా వెనుకబడిన కులాలవారు సామాజికంగా గాని,రాజకీయంగా గాని ప్రధానమైన శక్తిగా ఎదిగిన దాఖలాలు లేవు. సాంప్రదాయ అధికారిక వ్యవస్థలలో వీరికి భాగస్వామ్యం కల్పించి మరింత ప్రజాతంత్రయుతంగా మలిచిన సందర్భాలు కూడా లేవు.

మితవాద ప్రభుత్వాలు అణగారిన కులాలకు ఉపయుక్తమైన నాయకత్వ స్థానాలు కానీ, స్పష్టమైన రాజకీయ ప్రాతినిధ్యంగాని కల్పించడంలో విఫలమయ్యాయి. అధికారిక వ్యవస్థలన్నీ ఇప్పటికీ అధిపత్య కులాల ఆధీనంలోనే ఉన్నాయన్నది స్పష్టం. కేవలం కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కొన్ని చర్యలు చేపట్టబడ్డాయి అంతే. అణగారిన సామాజిక తరగతులకోసం కొన్ని సంస్కరణలు చేపట్టబడ్డాయి. కేవలం పైపైకి చూసినా ఇప్పటికీ అధికారిక యంత్రాంగంలో (ప్రభుత్వరంగమయినా ,ప్రైవేటు రంగమయినా) ప్రధానమైన సంస్థలన్నిటిలో, అన్నిరంగాలలో అంటే న్యాయ వ్యవస్థ, అధికారయంత్రాంగంలోని ఉన్నత పదవులులో అధికారిక స్థాయి, ప్రసారమాధ్యమాలు, సాంస్కృతిక సంస్థలు వగైరాల్లో పెద్దగా మార్పేమిలేదు. అవన్నీ సామాజికంగా ఉన్నతస్థాయిలో ఉన్నవారి ఆధీనంలోనే ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థలు నానాటికి పెరుగుతున్న నిమ్న కులాల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరంగా విఫలమవుతూనే వస్తున్నది.

బీహార్ కుల గణన మితవాదుల అధికార దాహార్తుల గుండెల్లో గుబులు రేపుతున్నది. కారణం స్పష్టం. ఇది సామాజికంగా అధమ స్థానంలో ఉన్నవారిలో రాజకీయ చైతన్యానికి బాటలు వేసే శక్తి కలిగి ఉన్నది. రాజ్య రక్షణలో తమ స్థానం కోసం దావా చేయడానికి అవకాశం ఏర్పరిచింది. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సమాన హోదా ఇవ్వకపోవడాన్ని, అగౌరవ సామాజిక స్థానంలో ఉంచడాన్ని, దుర్భరమైన వారి ఆర్థిక స్థితికి, రాజకీయాల్లో వారికి బీజేపీ తగిన నాయకత్వ స్థానం కల్పించక పోవడాన్నితీవ్రంగా సవాలు చేస్తున్నది. బీజేపీ తరహా అభివృద్ధిలో ఇముడ్చు కోవడం అంటే ఇదేనా అని ప్రశ్నిస్తున్నది.

ప్రభుత్వ సంస్థలన్నిటినీ ధనిక, పట్టణ సామాజిక ఉన్నతి తరగతులవారు ఆక్రమించుకోగా దళిత బహుజనులు ప్రభుత్వ అధీనంలో లేని, ప్రధానంగా నయా-ఉదారవాద విధానాలు అమలైన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఉన్నారు.

ఈ సర్వే సమాజంలోని అన్ని తరగతులకు అన్ని సంస్థలలో సమాన ప్రాతినిధ్యం ఉండాలని డిమాండ్ చేయడానికి మద్దత్తు గా నిలిచే అవకాసం ఉంది. ఉన్నత వర్గాల వారు సామాజికంగా ఉన్నతస్థానవంలో

> “ ‘ఇండియా’ కూటమి ఈ సర్వే యొక్క రాజకీయ అవకాశాన్ని తక్షణమే అంచనా వేసుకుంది. తన కార్యక్రమంలో సామాజిక న్యాయమే ప్రధానమైన అజెండాగా ఉంటుందని, దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తామని ప్రకటించింది . ఆర్థికంగా వెనుకబడిన కులాలకు గౌరవప్రదమైన స్థానాలు ఇస్తే, రాజకీయ అధికార పంపిణీలలో వారికి తగిన ప్రాతినిధ్యాన్ని కల్పిస్తే, ఆర్థిక స్వావలంబన కి బాటలు వేస్తే , వారి సామాజిక భద్రతకు ప్రాధాన్యత నిస్తే మాత్రమే ఈ కొత్త రూపకల్పనకు అర్థం ఉంటుంది. ”

ఉండడంకాదు, భూమిలో అతధిక భాగాన్ని కలిగి ఉన్నారు. అందువలనే అధికారం వారి చుట్టూ కేంద్రీకరించబడి ఉంది. సాంప్రదాయకంగా ఉన్నఫ్యూడల్ అధిపత్యం కొనసాగుతూనే ఉంది. వారి అధీనంలోనే సామాజిక వ్యవస్థ ఉన్నది. శక్తివంతమైన మధ్యతరగతి సంపదలు, తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయాలు ఉన్నాయి. వారే విధాన నిర్ణయాలు చేసేవారిని సృష్టిస్తారు. అమచేసేది వారే. సిఇఓ లు వారే. యజమానులు వారే. నయా–ఉదారవాద ఆర్థిక విధానంలో కూడా మునుపటి ఆర్థిక విధానాల నమూనాలలో లాగే సామాజిక సాంస్కృతిక ప్రభావాలు ఎక్కువగా ఉన్నాయి. నయా–ఉదారవాద ఆర్థిక నిర్మాణాన్ని ప్రజాతంత్రయుతంగా మలిచే చర్యలు ఏవీ చేపట్టబడలేదు. సామాజిక న్యాయం కూడా పెరుగుతున్న అసమానతలను తొలగించే మార్గం దరి చేరలేదు.

సామాజిక న్యాయానికి ప్రతినిధులమని చెప్పుకునే రాజకీయ పార్టీలు శాసన సభలలో అధికారాలు చెలాయిస్తున్న రాష్ట్రాలలో కూడా – బీహార్ లో రాష్ట్రీయ జనతాదళ్, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ – ప్రభుత్వ విధానాల రూపకల్పనలో లేదా అర్థి కాభివృధి ప్రణాళికలు రచించే వ్యవస్థలలో, ఆర్థికంగా అణగారిన వర్గాల ప్రాతినిధ్యం విస్మరించ బడింది. ఈ సమస్యను సైద్ధాంతికంగా వాడుకోడం తప్పితే, రాజకీయ పార్టీలకు, ఈ సామాజిక తరగతులకు వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర స్థానాన్ని కల్పించాలనే రాజకీయ సంకల్పం లేదు. సామాజికంగా ఉన్నత తరగతుల నిరంతర ఆధిపత్యం సవాలు చేయబడలేదు. లేదా ప్రజామద్దతు గల క్రియాశీల ఉద్యమాలు ఊపందుకోలేదు.

ఇందుకు భిన్నంగా సాధారణ ప్రజల రాజకీయ చర్చలలో ఆర్థికంగా వెనుకబడిన కులాల వారిని పేద కార్మిక వర్గంగా విభజించి వారికి సంక్షేమ పథకాలు, ఆహార భద్రతా, కనీస వేతనాలు, లేదా కొన్ని నిష్క్రియాత్మక వెసులుబాట్లు కల్పించడంతో సరిపెట్టాలని చుసారు. ఇది, ఈబిసి లను కొద్దిపాటి మౌలిక సంక్షేమ పధకాలు రాష్ట్రాల నుండి పొందేవారిగా చేస్తున్నది. రాజ్యం లోని ఆధిపత్య కులాల దాతృత్వ గుణ మార్గదర్శకాల్లో ఈ పథకాలు నడుస్తుంటాయి. ఆర్థికంగా వెనుకబడిన కులాల వారిని అధికార యంత్రాంగంలో విస్మరించడం, ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఎన్నడూ గుర్తించలేదు.

బీహార్ కులగణన వారిలో కొత్త సామజిక చైతన్యాన్ని కలిగించి, వారిని విధాన రూపకల్పనలకోసం – దృఢమైన ఆర్థిక అభివృద్ధికి, సమానత్వం సాధించగల సామాజిక సంస్కారణలకి– ఒత్తిడి చేసేవిధంగా ప్రేరేపిస్తుంది అని భావించ వచ్చు. ప్రస్తుతానికి ఆర్థికంగావెనుక బడిన కులాలవారు అనేక భాగాలుగా విడిపోయి ఉన్నారు. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలలో ఇది కనిపిస్తుంది. వారి సమస్యలు పరిష్కరించుకునే స్వతంత్ర రాజకీయ ఎజెండాతో లేరు. ఈ సర్వే నివేదిక వారిని ఒక స్వతంత్ర రాజకీయ విభాగాన్ని ఏర్పాటు చేసుకువాల్సిన తప్పనిసరి పరిస్థితులు కల్పించవచ్చు.

ఇది, అన్ని కులాలవారిని హిందుత్వ తనలో ఇముడ్చుకుంటున్నదని చెప్పుకునే హిందుత్వ శక్తుల ప్రయోజనాలను దెబ్బతీయడమే కాదు, సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే సాంప్రదాయ నాయకుల స్వభాన్ని కూడా బట్టబయలు చేస్తుంది. వారెంతగా వెనుకబడిన కులాల ప్రయోజనాలను విస్మరించారో, వారి గురించి శ్రద్ధ చూపలేదో తెలియచేస్తుంది.


సాంప్రదాయకంగా సామాజిక న్యాయం ఓట్లను పొందే రాజకీయ పార్టీలు ఇప్పుడయినా వెనుకబడిన కులాల ఆందోళనని అర్థం చేసుకోవాలి. వారికి రాజకీయాలలో న్యాయబద్ధంగా ఇవ్వవలసిన స్థానాలను కేటాయించే విషయం ఆలోచించాలి. బాధ్యతాయుతంగా ఈ పనిచేస్తే, అది ఉన్నత కులాల సామాజిక అధిపత్యానికి వ్యతిరేకంగా కొత్త ప్రజాతంత్ర ఉప్పెనను రగిలిస్తుంది. సామాజిక న్యాయం సూత్రాల ఆధారంగా, సామాజిక న్యాయం కోసమే పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న సమాజ్ వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదల్ , ద్రావిడ మున్నేట్ర ఖజగం, బహుజన పార్టీ వంటివన్నీ తమ నిజాయితీని పునరుద్ధటించుకోవలసిన అవసరం ఉంది. అణగారిన కులాలవారికి తగిన రాజకీయ స్థానాలు కేటాయించి, వారి మానిఫెస్టోలలో వారి ప్రయోజనాలు కాపాడే డిమాండ్లకు ప్రాధాన్యత కలించాలి. ఈ పార్టీలు ఆతరువాత నిమ్న కులాలకు ప్రతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలతో సౌహార్ద్ర త్వాన్ని, మిత్రుత్వాన్ని ప్రకటించుకుని బలహీన వర్గాల సామాజిక న్యాయం ఆధారంగా శక్తివంతమైన ప్రజాతంత్ర రాజకీయాలకి మూలాధారం కావాలి.

‘ఇండియా‘ కూటమి ఈ సర్వే యొక్క రాజకీయ అవకాశాన్ని తక్షణమే అంచనా వేసుకుంది. తన కార్యక్రమంలో సామాజిక న్యాయమే ప్రధానమైన అజెండాగా ఉంటుందని, దేశవ్యాప్తంగా కుల గణన నిర్వహిస్తామని ప్రకటించింది . ఆర్థికంగా వెనుకబడిన కులాలకు గౌరవప్రదమైన స్థానాలు ఇస్తే, రాజకీయ అధికార పంపిణీలలో వారికి తగిన ప్రాతినిధ్యాన్ని కల్పిస్తే, ఆర్థిక స్వావలంబన కి బాటలు వేస్తే , వారి సామాజిక భద్రతకు ప్రాధాన్యత నిస్తే మాత్రమే ఈ కొత్త రూపకల్పనకు అర్థం ఉంటుంది. ఇటువంటి నిర్మాణాత్మక, నిజాయితితో కూడిన చర్యలు మాత్రమే సామాజిక న్యాయం రాజకీయాలకు సహకరిస్తాయి. అవి మాత్రమే హిందుత్వ వాదుల, ‘అన్నికులాలను ఇముడ్చుకుంటామని’ చెప్పే బూటకపు వాదనలను ఖండించే వజ్రాయుధాలుగా పనిచేస్థాయి. ధనికుల అనుకూల నయా–ఉదారవాద విధానాల ఆర్థిక అజెండాను తిప్పికొట్టగలుగుతాయి.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# గుప్త సామ్రాజ్యం: స్థాపన, విస్తరణ

ఎం.వి.ఎస్.శర్మ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

మౌర్య సామ్రాజ్యం పతనం అనంతరం ఉత్తరాదిన కుషానులు, దక్కను, దక్షిణాది ప్రాంతాన శాతవాహనులు పెద్ద రాజకీయ శక్తులుగా ఆవిర్భవించాయి. తమ ఏలుబడిలో ఉన్న ప్రాంతాలకు రాజకీయ స్థిరత్వాన్ని కల్పించడంతోబాటు రోమన్ సామ్రాజ్యంతో సాగించిన వ్యాపారం ద్వారా ఆర్థిక పరిపుష్టిని కూడా ఈ రెండు సామ్రాజ్యాలూ కల్పించాయి. క్రీ.శ. మూడవ శతాబ్దం నడిమి దశలో ఈ రెండు రాజ్యాలూ పతనం చెందాయి. కుషానుల ఆధిపత్యం క్రీ.శ.230 నాటికి అంతరించింది. ఆ తర్వాత వారికి సామంతులుగా ఉండిన మురుందులు క్రీ.శ.250 వరకూ ఉత్తరాదిన ఆధిపత్యాన్ని నెరపారు. ఆ తర్వాత వారి రాజ్యం కూడా పతనం అయింది.

కుషాను సామ్రాజ్య శిధిలాలమీద ఆవిర్భవించింది గుప్త సామ్రాజ్యం. తర్వాత అది శాతవాహన సామ్రాజ్యం లోని గణనీయమైన ప్రాంతాన్ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకుంది. గుప్తులు వైశ్యులుగా ఉండేవారు. మొదట కుషానులకు సామంతులుగా వ్యవహరించారు. కుషాను సామ్రాజ్యం పతనం తర్వాత ఆ స్థానాన్ని క్రమంగా పొందగలిగారు. గుప్త వంశం పాలన క్రీ.శ.275 లో మొదలైనట్టు కనిపిస్తోంది. ఐతే ఒక బలమైన సామ్రాజ్యంగా స్థిరపడినది ఒకటవ చంద్రగుప్తుడి కాలం నుండే. ఇతడు ఉత్తరాదిన క్షత్రియ వీరులుగా గుర్తింపు ఉన్న లిచ్ఛవీ తెగకు చెందిన రాకుమారిని వివాహం చేసుకున్నాడు. దాని కారణంగా గుప్తుల సామాజిక హోదా క్షత్రియులతో సమానంగా గుర్తింపు పొందింది.

సామంతులుగా ఉన్నప్పుడే గుప్తులు కుషానులనుండి బలమైన అశ్విక దళాలను నిర్మించే విషయంలో శిక్షణ పొందారు. కుషానుల మాదిరిగానే గుప్తుల అశ్విక దళాలు కూడా జీను, కళ్ళెం, రికాబు, కోటు, పంట్లాము, పాదరక్షలు ఉపయోగించడంలో ఆరితేరాయి. కుషానుల కాలానికే రథాలకు, గజబలానికి ప్రాధాన్యత తగ్గి, అశ్విక దళాల ప్రాధాన్యత పెరిగింది. ఆ క్రమంలో గుప్త రాజులు నైపుణ్యం కల అశ్విక దళాలను సిద్ధం చేసుకున్నారు. అదే వారి సైనిక ఆధిపత్యానికి, విజయాలకు దోహదం చేసింది. క్రీ.శ.319-20 లో ఒకటవ చంద్రగుప్తుడి పాలన మొదలైంది. అక్కడినుంచి క్రీ.శ.445 వరకూ గుప్త సామ్రాజ్య ప్రాభవం కొనసాగింది.




ప్రారంభంలో గుప్త సామ్రాజ్యం ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతానికి పరిమితమైవుండేది. అందునా ఉత్తర ప్రదేశ్ ప్రాంతానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. అక్కడే గుప్తుల కాలానికి చెందిన నాణేలు, వస్తువులు ఎక్కువగా లభించాయి. ప్రయాగ నుంచి (ఇప్పుడు అలహాబాద్) గుప్తుల పాలన మొదలై అన్ని వైపులా క్రమంగా విస్తరించింది.

సారవంతమైన భూములు కలిగి వుండడంతోబాటు మధ్య భారతంలో, దక్షిణ బీహార్‌లో విస్తారంగా లభించే ఇనుప ఖనిజాన్ని కూడా వారు ఉపయోగించు కోగలిగారు. ఉత్తరాదిన విస్తరించే క్రమంలో తూర్పు రోమన్ సామ్రాజ్యంతో వర్తకం సాగించడానికి ఉపయోగించిన సిల్క్ రూట్ గుప్తులకు అందుబాటులోకి వచ్చింది. ఈ సానుకూల అంశాలు గుప్త సామ్రాజ్యం బలపడడానికి, విస్తరించడానికి దోహదం చేశాయి.

### విస్తరణ

ఒకటవ చంద్రగుప్తుడి కుమారుడు, వారసుడు అయిన సముద్రగుప్తుడి కాలంలో గుప్త సామ్రాజ్యం బాగా విస్తరించింది. క్రీ.శ.335 నుండి 380 వరకూ సముద్రగుప్తుడి పాలన సాగింది. సముద్రగుప్తుడు బలప్రయోగం అన్నా, ఆక్రమించుకోవడం అన్నా అమితమైన ప్రీతిని ప్రదర్శించేవాడు. సముద్రగుప్తుడు చేసిన యుద్ధాలను, ఆక్రమణలను అతని ఆస్థాన కవి హరిశేనుడు వివరంగా

> **“ సముద్రగుప్తుడి ఖ్యాతి భారత ఉపఖండం అంతా వ్యాపించింది. శ్రీలంక రాజు మేఘవర్మన్ సముద్రగుప్తుడికి విలువైన కానుకలు పంపిస్తూ బుద్ధగయలో ఒక దేవాలయాన్ని నిర్మించవలసిందిగా కోరినట్టు చైనా గ్రంధాలలో ప్రస్తావన ఉంది. మౌర్య సామ్రాజ్యంతో పోల్చుకుంటే అంత విస్తారమైనది కాకున్నా ఆ తర్వాత చెప్పుకోదగిన స్థాయిలో గుప్త సామ్రాజ్యం భారత భూభాగంలో ఎక్కువ భాగాన్ని తన ఏలుబడి కిందకు తెచ్చుకోగలిగింది. ”**




వర్ణించాడు. అలహాబాద్ లో అశోకుడి కాలంలో శాంతిని, సహజీవనాన్ని బోధిస్తూ స్థాపించిన రాతిస్తంభం మీదనే మరోపక్క సముద్రగుప్తుడు సాగించిన దండయాత్రల వివరాలను కూడా చెక్కారు.

సముద్రగుప్తుడు ఆక్రమించుకున్న ప్రాంతాలను అయిదు తరహాలుగా విభజించవచ్చు. మొదటి కోవలోకి గంగా యమున పరీవాహక ప్రాంతంలో ఉండే రాజ్యాలు వస్తాయి. ఈ ప్రాంతపు రాజులందరినీ ఓడించి వారి భూభాగాలను గుప్త రాజ్యంలో విలీనం చేసుకున్నాడు. ఇక రెండవ కోవలోకి తూర్పు హిమాలయ సానువులలో ఉండే రాజ్యాలు, నేపాల్ , అస్సాం, బెంగాల్ వంటి చుట్టుపక్కలి రాజ్యాలు వస్తాయి. సముద్రగుప్తుడి సైనిక బలగాల శక్తి ఏమిటో ఆ రాజ్యాలన్నీ చవి చూశాయి. పంజాబ్ ప్రాంతంలో ఉన్న గణ రాజ్యాలు మౌర్య సామ్రాజ్య పతనానంతరం కొంతకాలం పాటు స్వతంత్రంగా ఉండగలిగాయి. ఇప్పుడు అవన్నీ గుప్తులకు లొంగిపోయాయి. మూడవ కోవలోకి వింధ్య ప్రాంతంలోని ఆటవిక రాజ్యాలు వస్తాయి. వీటన్నింటినీ సముద్రగుప్తుడు తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. నాలుగో కోవలోకి దక్కను ప్రాంతంలో, దక్షిణాదిన ఉన్న పన్నెండు రాజ్యాలు వస్తాయి. వీటన్నింటినీ సముద్రగుప్తుడు ఓడించాడు. సముద్రగుప్తుడి జైత్రయాత్ర దక్షిణాదిన కాంచీపురం వరకూ కొనసాగింది. అక్కడ పాలిస్తున్న పల్లవులు సైతం సముద్రగుప్తుడి సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు. ఇక అయిదవ కోవలోకి వాయవ్య ప్రాంతంలో దాదాపు ఆఫ్ఘనిస్తాన్ వరకూ ఉన్న శకుల, కుషానుల రాజ్యాలు వస్తాయి. (చూ. క్రీ.శ. 400 నాటి గుప్త సామ్రాజ్య పటం )

సముద్రగుప్తుడి ఖ్యాతి భారత ఉపఖండం అంతా వ్యాపించింది. శ్రీలంక రాజు మేఘవర్మన్ సముద్రగుప్తుడికి విలువైన కానుకలు పంపిస్తూ బుద్ధగయలో ఒక దేవాలయాన్ని నిర్మించవలసిందిగా కోరినట్టు చైనా గ్రంధాలలో ప్రస్తావన ఉంది. దానిని అంగీకరిస్తూ గయలో ఒక పెద్ద బౌద్ధారామాన్ని సముద్రగుప్తుడు నిర్మించాడు. మౌర్య సామ్రాజ్యంతో పోల్చుకుంటే అంత విస్తారమైనది కాకున్నా ఆ తర్వాత చెప్పుకోదగిన స్థాయిలో గుప్త సామ్రాజ్యం భారత భూభాగంలో ఎక్కువ భాగాన్ని తన ఏలుబడి కిందకు తెచ్చుకోగలిగింది.

### రెండవ చంద్రగుప్తుడు
### ( క్రీ.శ. 380-412)

గుప్త సామ్రాజ్యపు ఉచ్చ దశ రెండవ చంద్రగుప్తుడి కాలంలో చూడవచ్చు. దండయాత్రల ద్వారా సామ్రాజ్య విస్తరణ కొనసాగించడంతోబాటు వివాహ సంబంధాలను నెరపడం ద్వారా కూడా తన ఆధిపత్యాన్ని విస్తరించాడు. మధ్య భారతంలో పాలిస్తున్న వాకాటకుల రాజు రెండవ రుద్రసేనుడికి తన కుమార్తె ప్రభావతిని ఇచ్చి వివాహం చేశాడు రెండవ చంద్ర గుప్తుడు. ఆ రాజు మరణించాక పిన్న వయస్కుడైన అతని కుమారుడికి పట్టాభిషేకం చేసి, ఆ రాజ్యాన్ని రాణి ప్రభావతి వాస్తవానికి పాలించింది. ఆ విధంగా మధ్య భారతం మీద గుప్తుల పరోక్ష పాలన సాగింది. పశ్చిమ మాళ్వ, గుజరాత్ ప్రాంతాలమీద 4 శతాబ్దాల పాటు శకుల ఆధిపత్యం కొనసాగింది. రెండవ చంద్రగుప్తుడు ఆ ప్రాంతాలను తన స్వాధీనంలోకి

తెచ్చుకున్నాడు. దాంతో పశ్చిమ సముద్రతీరపు వాణిజ్య మార్గాలమీద ఆధిపత్యం నెరపడం సాధ్యమైంది. మాళ్వ ప్రాంతం సంపద్వంతమైంది. ఆ ప్రాంతపు ముఖ్య పట్టణం ఉజ్జయిని రెండవ చంద్రగుప్తుని రెండో రాజధానిగా ఉండేది. రెండవ చంద్రగుప్తుని విజయాలను కుతుబ్ మినార్ సమీపంలో స్థాపించిన ఇనుప స్తంభం మీద చెక్కారు. వాటిలో సహజంగానే అతిశయోక్తులు ఉన్నా, వాయవ్య ప్రాంతంలో, తూర్పున బెంగాల్ ప్రాంతంలో గుప్తుల అధికారాన్ని అతడు సుస్థిరం చేసినట్టు తెలుస్తుంది. (చూ. గుప్తుల కాలపు నాణేలు)

> **"ఈ చంద్రగుప్తుడు "విక్రమాదిత్యుడు" అన్న బిరుదు స్వీకరించాడు. క్రీ.పూ.57 లో ఉజ్జయినిని పరిపాలించిన విక్రమాదిత్య మహారాజు పేరునే తన బిరుదుగా ఈ రెండో చంద్రగుప్తుడు స్వీకరించాడు. చంద్రగుప్తుడి ఆస్థానంలో కాళిదాసు, అమరసింహుడు వంటి పండితులు ఉండేవారు. ఇతని పాలనా కాలంలోనే ఫా-హియాన్ అనే చైనా యాత్రికుడు ఇక్కడికి వచ్చి ఆ పరిస్థితుల్ని వివరంగా గ్రంథస్తం చేశాడు."**

ఈ చంద్రగుప్తుడు "విక్రమాదిత్యుడు" అన్న బిరుదు స్వీకరించాడు. క్రీ.పూ.57 లో ఉజ్జయినిని పరిపాలించిన విక్రమాదిత్య మహారాజు పేరునే తన బిరుదుగా ఈ రెండో చంద్రగుప్తుడు స్వీకరించాడు. చంద్రగుప్తుడి ఆస్థానంలో కాళిదాసు, అమరసింహుడు వంటి పండితులు ఉండేవారు. ఇతని పాలనా కాలంలోనే ఫా-హియాన్ అనే చైనా యాత్రికుడు ఇక్కడికి వచ్చి ఆ పరిస్థితుల్ని వివరంగా గ్రంధస్తం చేశాడు.

**గుప్త సామ్రాజ్య క్షీణత**

రెండవ చంద్రగుప్తుడి అనంతరం అతడి కుమారుడు కుమారగుప్తుడు క్రీ.శ.413లో అధికారంలోకి వచ్చాడు. అతడు దాదాపు 40 సంవత్సరాలు పాలించాడు. మహేంద్రాదిత్య అన్న బిరుదు స్వీకరించాడు. కుమారగుప్తుడి పాలన చివరి కాలంలో ఉత్తరాదినుండి హూణుల దాడులు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. కుమారగుప్తుడి కొడుకు స్కందగుప్తుడి పాలనలో ఈ దాడుల తీవ్రత హెచ్చింది. క్రీ.శ.455 నుండి 467 వరకూ పాలించిన స్కందగుప్తుడు హూణుల దాడులను విజయవంతంగా తిప్పికొట్టగలిగినా, ఆ దాడుల పరంపర కొనసాగుతూనేవచ్చింది. స్కందగుప్తుడి వారసులు మరో దశాబ్దం పాటు గుప్త సామ్రాజ్యాన్ని నిలబెట్టగలిగారు. ఆ తర్వాత అతడి సోదరుని కుమారుడు బుధగుప్తుడు క్రీ.శ.500 వరకూ పాలించాడు. ఐతే అప్పటికే సామంత రాజ్యాలు బలపడడం, అలా బలపడ్డాక గుప్తుల సార్వభౌమాధికారాన్ని నామమాత్రంగా మాత్రమే అంగీకరించడం మొదలైంది. మరో పక్క హూణుల రాజు తోరమానుడు ఉత్తరాది నుండి తన ప్రాబల్యాన్ని విస్తరింపజేస్తూ గుప్తుల ఆధిపత్యాన్ని దెబ్బ తీశాడు. అతని కుమారుడు మిహిరకులుడు మరింత శక్తివంతంగా వ్యవహరించి గుప్తసామ్రాజ్య పతనానికి తెర తీశాడు. గుప్తుల కాలంలో విరివిగా కొనసాగిన భూదానాలు ప్రభుత్వ ఆదాయం తరిగిపోడానికి దోహదం చేశాయి. దానికి తోడు పశ్చిమాన మాళ్వ ప్రాంతం స్వతంత్రతను ప్రకటించుకోవడంతో వాణిజ్యపరమైన ఆదాయాలూ తగ్గిపోయాయి. హూణుల దాడులను తట్టుకోడానికి అవసరమైన సైన్యాన్ని పోషించడం తలకు మించిన భారం అయింది. క్రీ.శ.550 నాటికి గుప్త సామ్రాజ్యం విచ్ఛిన్నం అయింది.

గుప్త సామ్రాజ్య స్థాపనతో భారతదేశంలో భూస్వామ్య యుగం మొదలైనట్టు చరిత్రకారులు భావిస్తారు. మౌర్యుల కాలంలో అమలైన కేంద్రీకృత పాలన విధానం ఏ విధంగా సంక్షోభంలో పడ్డదీ మనకు కలియుగం గురించిన వివిధ వ్యాఖ్యానాలు వివరిస్తాయి. (గత సంచికలో వాటి వివరాలు ఇవ్వబడ్డాయి) . మన దేశంలో ఫ్యూడల్ భూ సంబంధాలు ఏ విధంగా మొదలై విస్తరించినదీ ఇప్పుడు తెలుసుకుందాం.

**(వచ్చే సంచికలో)**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# 76 వసంతాల భారతదేశం నిజంగానే వెలిగిపోతోందా ?

సిపి చంద్రశేఖర్



రచయిత ప్రముఖ ఆర్థిక వేత్త. ఆర్థిక రంగంపై నిత్యం వ్యాసాలు రాస్తుంటారు

భారతదేశానికి స్వతంత్రం వచ్చి 76 నిండిన సందర్భములో ప్రభుత్వ ప్రతినిధులు, ప్రభుత్వేతర విశ్లేషకులు, దేశీయ, విదేశ మీడియా సంస్థలు, అనేక మంది 'విజ్ఞులు' ఉత్సాహంగానో లేదా అనూయతోనో భారతదేశం ఆర్థికంగా వెలిగిపోతోందని ఊదర గొడుతున్నారు. 2014లో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, భారత ఆర్థిక వ్యవస్థ చైతన్యవంతంగా, నూతన కాంతులు విరజిమ్ముతుండడం స్పష్టంగా కనిపిస్తున్నదనే అంచనాలకు వస్తున్నారు.

స్థూల జాతీయోత్పత్తి 2021-22 లో 9.1శాతం, 2022-23 లో 7.2 శాతం పెరగడం ఈ అంచనాకి రావడానికి కారణమని చెపుతున్నారు. రాబోయే రెండేళ్లు ఈ రేటు తగ్గుతుందని ఐఎంఎఫ్ అంటున్నా, అది 6.1, నుండి 6.3 శాతం మధ్య ఉండ వచ్చని అంచనా వేసింది. ఇది 4.5 నుండి 5.2 శాతంగా చూపిన చైనా అభివృద్ధి కంటే ఎక్కువే. కోవిడ్ సంవత్సరం మన ఆర్థికాభివృద్ధి -5.8 శాతం తగ్గింది. ఈ మాంద్యం నుండి 7శాతం వార్షిక వృద్ధి వైపుకు మరలిందని చూపిస్తున్నారు. భారతదేశం చైనా కన్నా అభివృద్ధిలో పరుగులు తీస్తోందని చూపే ప్రయత్నం జరుగుతున్నది.

సుదీర్ఘ కాలం ప్రపంచాభివృద్ధిలో నాయకత్వస్థానంలో ఉన్న చైనాను సహితం అధిగమించి ఎంతో బాగా వృద్ధి చెందుతూ, భారతదేశం ప్రపంచ అభివృద్ధిలో ముందుకు దూసుకుని పోతున్నది అని చెప్పుకోడానికి ఈ గణాంకాలను నిదర్శనంగా చూపుతున్నారు.

అయితే, ఈ అంచనాలకు రావడానికి ఉపయోగించిన గణకాలను అనేకమంది ఆర్థికవేత్తలు, ప్రభుత్వ సంస్థలలో సేవలు అందించిన వారితో సహా ప్రశ్నిస్తున్నారు. ఈ అంచనాలకు రావడానికి 2011-2012 బేస్ సంవత్సరంగా మార్చడాన్నీ, అలాగే జాతీయ గణాంకాలను రూపొందించడానికి అను సరించిన విధానాలలో మార్పులనూ వారు తప్పు పడుతున్నారు. ఈ బేస్ సంవత్స రాన్ని మార్చడం వలన స్థూల జాతీయోత్పత్తి స్థాయి, అభివృద్ధి రేటు పెరిగినట్టు కనిపిస్తున్నాయి. ప్రధానంగా కంపెనీ వ్యవహారాలు పర్యవేక్షించే మంత్రిత్వ శాఖ నుండి వ్యవస్థీకృత తయారీ రంగంలో స్థూల జాతీయోత్పత్తి ని లెక్కించ టానికి కార్పొరేట్ ఫైనాన్స్ గణాంకాలు తీసుకోవాలనే నిర్ణయం వివాదాస్పదమైనది.

దీనికి తోడు, ఈ లెక్కలు వేసేటప్పుడు నగదు రద్దు వల్ల, కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోడంలో వైఫల్యం వల్ల బాగా నష్టపో యిన వ్యవసాయేతర ఆర్థిక కార్యకలాపాలు ఎక్కువగా జరిగే అసంఘటిత రంగాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. అందువలన కూడా అభివృద్ధి బాగా జరిగినట్టు కనిపిస్తు న్నది. కానీ ప్రభుత్వం, దాని తాబేదారులు నేషనల్ శాంపిల్ సర్వే, లేదా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేల గణాంకాలు నాణ్యత లేనివని చెబుతూనే మరోవైపు జాతీయ కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందించిన గణాంకాలనే ఆనందంగా స్వీకరించి ఉపయోగించుకుంటున్నారు.

2011-2012ను బేస్ సంవత్సరంగా తీసుకోడానికి చేసే వాదనలను అంగీకరించి నప్పటికీ, స్థూల జాతీయోత్పత్తి స్థాయి, అభివృద్ధి రేటు అంచనాలు అతిగా ఉన్నాయి. మార్కెట్‌లు పెరిగాయని ఉదరగొడుతున్నంత స్థాయిలో వాస్తవంగా తిరిగి పుంజుకున్న దాఖలాలు కనిపిండం లేదు. 2020-21 లో 5.8 శాతం దిగజారిన ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత సంవత్సరాలైన 2021-22, 2022-23లలో పుంజుకున్న మాట వాస్తవమే. అయితే ఎదుగుదల ఎంతని నిశితంగా పరిశీలిస్తే కొన్ని కలవరపరిచే విషయాలు కనిపిస్తున్నాయి.

మొదటిది, స్థూల జాతీయోత్పత్తి సంపూర్ణంగా పూర్తిస్థాయిలో పుంజుకోలేదు. 2019-20 స్థూల జాతీయోత్పత్తిని 2022-23 తో పోల్చి చూసినప్పుడు 10.1శాతం పెరుగుదల కనిపిస్తున్నది. అంటే ఈ పెరుగుదల మూడేళ్లలో జరిగినది. అంటే ఏడాదికి 3.4 శాతం మాత్రమే వృద్ధి చెందింది. 2020-21కి ముందున్న తొమ్మిది త్రైమాసి కాలలో వరుసగా వృద్ధి ంటు పడిపోతూ వస్తున్నది. 2018 మొదటి త్రైమాసికంలో 8.9 శాతంగా ఉన్న వృద్ధి రేటు 2020 కి 2.9 శాతానికి పడిపోయింది. క్రితం సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి అమాంతం 23 శాతం దిగజారిపోయింది. అంటే కోవిడ్ కాలం నుండి పుంజుకుంది ప్రభుత్వాలు చూపిస్తున్నంత గొప్పగా ఏమి లేదు.

**ముఖ్యాంశాలు:**

ప్రభుత్వమూ, దాని తాబే దారులు ఎన్ఎస్ఎస్ఓ, ఎన్ఎఫ్‌హెచ్ఎస్ అందించిన గణాంకాలను పరిగణలోకి తీసుకోవడం లేదు (తమకు అనుగుణంగా ఉండకపోవడం వలన). జాతీయ గణాంకాలనే (నేషనల్ అకౌంట్స్) పరిగణించడానికి మాత్రమే తీసుకుంటున్నారు. నయా-ఉదారవాద విధానాలు తయారీ రంగాన్ని పునరుత్తేజింప చేస్తాయని ఆశిస్తున్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజింప

చేస్తానని నమ్మబలికింది. ఈ మూడేళ్ళ కాలంలో 18 శాతం స్థూలజాతీయోత్పత్తి పెరిగిందని చూపెట్టేందుకు అనుగుణంగా ఉన్న ఆధారాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నది. ఇది మొదటి అంశం. రెండోది, మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితులలో అభివృద్ధి చెందిన దేశాలలోని పెట్టుబడిదారుల వ్యూహం వలన, వారు విదేశాలలో కొత్త భాగస్వాములను వెతుక్కుం టారనీ, చైనాపై 'మరింతగా' ఆధారపడడాన్ని తగ్గించుకుంటారనీ, తద్వారా భారతదేశం ఎక్కువగా లబ్ది పొందుతుందనే భావన కలిగి ఉన్నారు. ఇది భారతదేశానికి ప్రపంచ తయారీరంగం హబ్‌గా మారే అవకాశాన్ని కల్పిస్తుందని భావిస్తున్నారు.

ఈ రెండింటిలో మొదటి భావనకు పునాది లేదు. ఎందుకంటే, విచిత్రమైన ఊహలతో ఉండే సట్టా మదుపరులను, బాండ్ల మార్కెట్లో పెట్టుబడులు పెట్టేవారిని నమ్ముకుని వెళ్లడమంటే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదటం వంటిదే. రెండవది, మూడు దశాబ్దాలుగా 'సంస్కరణలు' అమలు చేస్తున్న ప్పటికీ భారతదేశం ప్రపంచ మార్కెట్లో ఒక చిన్న ఎగుమతిదారునిగా ఉండి పోడానికి కారణమైన నిర్మాణ బలహీనతలను పరిగణనలోనికి తీసుకోలేదు. నిజానికి ఇప్పటికే భారతదేశం తయారీరంగంలో దూసుకుపోతూ ఎగుమతులలో తన సత్తా చాటి, అందరికన్నా ముందుండవలసినది. కానీ అలా జరగలేదు.

2011-12 నుండి 2022-23 మధ్య కాలాన్నే పరిగణలోనికి తీసుకుందాము. నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ ఈ గణాంకాలనే తీసుకున్నది. దీని ప్రకారం దేశ స్థూలజాతీయోత్పత్తిలో 61శాతం సేవా రంగం నుండి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల నుండి 11శాతం, తయారీ రంగం నుండి 28 శాతం స్థూల జాతీయోత్పత్తి వస్తున్నది. ఎన్‌డిఏ ప్రభుత్వం, తయారీ రంగాన్ని నూతన ఆర్థిక విధానాల అములు ద్వారా పునరుత్తేజింప చేస్తానని నమ్మబలికింది. కానీ ఈ కాలంలో ఈ రంగం అభివృద్ధి సాధించినది కేవలం 18 శాతం మాత్రమే. అది కూడా ఇంత సుదీర్ఘ కాలానికి.

తయారీ రంగం వెనకబడడానికి కారణం అసంఘటిత రంగం ఉత్పత్తిని పెంపొందించడంలో విఫలమవడం కాదు, మన గణాంకాల్లో అధిక భాగం సంఘటిత రంగానికి సంబంధించినవే. అందులోని కొన్ని సమూహాలు అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ ఉత్పత్తిని మాత్రం నిలడగానే ఉంచుతున్నాయి.

**" మొదటిది, స్థూల జాతీయోత్పత్తి సంపూర్ణంగా పూర్తి స్థాయిలో పుంజుకోలేదు. 2019-20 స్థూల జాతీయో త్పత్తిని 2022-23 తో పోల్చి చూసినప్పుడు10.1శాతం పెరుగుదల కనిపిస్తున్నది. అంటే ఈ పెరుగుదల మూడేళ్లలో జరిగినది. అంటే ఏడాదికి 3.4 శాతం మాత్రమే వృద్ధి చెందింది. 2020-21కి ముందున్న తొమ్మిది త్రైమాసి కాలలో వరుసగా వృద్ధి ఎటు పడిపోతూ వస్తున్నది. "**




భారతదేశంలోని కొన్ని మౌలికమైన నిర్మాణ బలహీనతలు ఆర్థిక వ్యవస్థను పట్టి పీడిస్తూ, ఎదగ నీయకుండా కట్టి పడేస్తున్నాయి. ఇవే కనుచూపుమేరలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారి, తయారీరంగంలో బాగా అభివృద్ధి చెంది, ఎగుమతులను పెంచుకునే దిశగా ముందుకు ముందుకెళ్లకుండా నిలవరిస్తున్నాయి.

ప్రభుత్వానికి ఇందుకు సంబంధించిన అవగాహన ఉంది. కేవలం 'భారతదేశంలో తయారు చేయడం' అనే పిలుపు ఇస్తే ఫలితాలు రావని దానికి కూడా తెలుసు. అందుకనే ఈ మధ్య కాలంలో కొన్ని పరిశ్రమలను ఎంపిక చేసుకుని వాటికి ప్రత్యక్ష సబ్సిడీలు, 'ఉత్పత్తుల ఆధారంగా' ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ పథకం 2020 మార్చ్‌లో ప్రారంభించబడింది. అసలు ఈ పథకం కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం చేయాలని భావించింది. కానీ తరువాత మరో 14 ఇతర రంగాలకు కూడా విస్తరించడం జరిగింది. దీనికి గాను రూ 1.97 లక్షల కోట్లు కేటాయించింది.

అయితే, వివిధ రంగాలకు చేసిన కేటాయింపులు అసమతుల్యంగా ఉన్నాయి. వాటి నుండి పొందిన ఫలితాలు కూడా పరిమితంగానే ఉన్నాయి. 2023-24 సంవత్సరానికి గాను పిఎల్ఐ స్కీములకి రూ.8083 కోట్లు కేటాయించగా, అందులో భారీ మొత్తాలలో తయారీలు జరిగే ఎలక్ట్రానిక్ తయారీరంగానికి రూ.4499 కోట్లు కేటాయించడం జరిగింది. అయితే, అందులో అత్యధిక భాగం మొబైల్ ఫోన్లు, వాటి విడి భాగాల తయారీకి పోతుంది. ఈ రంగం లో సింహ భాగం దేశీయ వినిమయానికి పోయి, కొంత భాగం మాత్రమే ఎగుమతులు చేయడం జరుగుతుంది. విదేశీ పారిశ్రామికవేత్తలకు ఇచ్చే ప్రత్యక్ష సబ్సిడీలు పేద, మధ్యతరగతులకిచ్చే కీలక రంగుల నుండి నిధులు మరలుస్తున్నారు. కానీ ఈ సబ్సిడీల పొందిన ఆ పెద్ద కంపెనీలు తయారీ రంగాన్ని అభివృద్ధి చేసి ఎగుమతులు చేస్తున్నారనడానికి ఎటువంటి ఆధారాలు లేవు.

(అనువాదం: కె. ఉషారాణి)

❋

# గాజా యుద్ధం

## ఇజ్రాయిల్ జాత్యహంకార విధానాల పర్యవసానం



రచయిత సౌదీ అరేబియా, ఒమన్, యుఎఇలో మాజీ రాయబారి. "యుద్ధంలో పశ్చిమాసియా' అన్న శీర్షికతో ఆయన రాసిన పుస్తకం గత ఏడాది ప్రచురితమైంది.

**తల్మీజ్ అహ్మద్**

గాజా సంక్షోభం అనేది ఏ క్షణంలోనైనా పేలడానికి సిద్ధంగా ఉన్న టైమ్ బాంబ్ మాదిరిగా ఉండేది. ఈ టైమ్ బాంబ్ పెట్టింది ఇజ్రాయిల్. దానికి ఇంధనం సమకూర్చింది ఉగ్రవాద ఇజ్రాయిలీ మంత్రులు వారి హింసాకాండ, యుద్ధానికి ఎదురు చూస్తున్న హమాస్. టైమ్ బాంబ్ బటన్ నొక్కేవారి కోసం ఇంతకాలం వేచి చూస్తూ వచ్చింది.

ఈ ఏప్రిల్‌లో రంజాన్ సందర్భంగా అల్-అస్కా మసీదులోకి ఇజ్రాయిలీ పోలీసులు ప్రవేశించడంతో ఆ బాంబు కాస్తా పేలింది.

..............

గాజాలో ఇజ్రాయిలీ దళాలు సాగిస్తున్న మారణకాండలో ఇప్పటికే అనేక వేల మంది ప్రజలు ప్రాణాలు విడిచారు. ఇది ఇప్పటిలో ఆగేట్లు లేదు. ఇంకా చాలా ప్రాణ నష్టం సంభవించే పరిస్థితి కనిపిస్తోంది. హమాస్ ఇజ్రాయిల్ మీద దాడి జరిపిన మొదటి రోజుల్లో 1,300 మంది ఇజ్రాయిలీలు మరణించారు. తమ దేశంలోకి ప్రవేసించిన 2,500 మంది హమాస్ సైనికుల్లో నగం మందిని చంపేశామని ఇజ్రాయిల్ చెబుతోంది. ఆ తరువాత గాజా మీద ఇజ్రాయిల్ చేస్తున్న వైమానిక, భూతల దాడుల్లో వేలాది మంది చనిపోయారు. గాజాను ఇజ్రాయిల్ పూర్తిగా దిగ్బంధనం చేసింది. పట్టణానికి విద్యుత్ కట్ చేసింది. అది ఒక పెద్ద మానవ సంక్షోభంలోకి నెట్టబడింది. భవనాలు శిథిలమైపోతున్నాయి. వాటికింద వేలాది మంది చనిపోతున్నారు. ఆసుపత్రులన్నీ క్షతగాత్రులతోనిండిపోయాయి. చివరికి చిన్నపిల్లల ఆసుపత్రి మీద పడిన బాంబు 500 మందికి పైగా పసిపిల్లల ప్రాణాలు హరించింది. ప్రజలకు ఆహారం కూడా దొరకడం లేదు. పిల్లలు, తల్లులు, వృద్ధులనే తేడా లేకుండా ఇజ్రాయిలీ సైన్యాలు పాలస్తీనా ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నాయి.

ఇజ్రాయిల్ గాజాపై వైమానిక దాడులు ఆపకపోతే తాము అపహరించుకుపోయిన వందమందికి పైగా ఇజ్రాయిలీ బందీలను రోజుకొక్కరు చొప్పున చంపేస్తామని హమాస్ ప్రకటించింది. ఈ లోగా ఇద్దరు వృద్ధ బందీలను విడిచిపెట్టింది. ఈ హెచ్చరికలను ఇజ్రాయిల్ పక్కన పెట్టి గాజాతో తనకు గల 360 కిలో మీటర్ల సరిహద్దుల గుండా యుద్ధ ట్యాంకుల సహాయంతో పదాతి దళాలను గాజాలోకి నడిపిస్తోంది. 33 లక్షల జనాభా గల గాజాను పూర్తిగా ఆక్రమించుకోడానికే సిద్ధమైంది. ఉత్తర గాజాలో 23 లక్షల మంది, దక్షిణ గాజాలో 10 లక్షల మంది నివసిస్తున్నారు. యుద్ధం వల్ల ఇప్పటికే లక్షలాది మంది పాలస్తీనా ప్రజలు నిరాశ్రయులై శరణార్థి శిబిరాల్లో చేరారు.

హమాస్ తను జరిపిన దాడిని "ఆపరేషన్ అక్సా ఫ్లడ్" అంటోంది. ఈ దాడిని "మహా విప్లవ దినం" అని హమాస్ దళాల కమాండర్ మొహమ్మద్ దీఫ్ పేర్కొన్నారు. అల్-అక్సా మసీదును అపవిత్రం చేసినందుకు ప్రతీకారంగా ఈ దాడి చేసినట్లు ఆయన ప్రకటించారు. ఇజ్రాయిల్ సంకీర్ణ ప్రభుత్వంలోని పచ్చి మితవాద పార్టీకి చెందిన ఉగ్రవాద మద్దతుదారులు ఏప్రిల్‌లో మసీదులోకి ప్రవేశించి పాలస్తీనియన్లపై పెద్ద ఎత్తున దాడికి దిగిన సంగతి విదితమే. పశ్చిమ తీరంలోనూ, ఇజ్రాయిల్‌లోనూ, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఉన్న పాలస్తీనియన్లంతా 'ఎడతెరిపిలేని దాడులు ప్రారంభించాలని' దీఫ్ పిలుపునిచ్చారు. అక్టోబర్ 8న హమాస్‌కు సంఘీభావంగా హెజ్‌బుల్లా సైనికులు లెబనాన్ నుండి ఇజ్రాయిల్ ఆక్రమిత షెబా ప్రాంతంలోని ఇజ్రాయిలీ స్థావరాలపైకి ఫిరంగులు పేల్చారు.

ఇజ్రాయిల్ తన యుద్ధ చర్యలను "ఆపరేషన్ ఐరన్ స్వార్డ్" (ఉక్కు ఖడ్గం) అని పిలుస్తోంది. 3,60, 000 మంది ఉన్న తన రిజర్విస్టులతో సహా మొత్తం సైన్యాన్ని గాజాపై యుద్ధంలోకి దించింది. దీనికి తోడు యూదు నాయకులు అత్యంత తీవ్రమైన యుద్ధ నాదాలు మొదలు పెట్టారు. గాజాలోని హమాస్ స్థావరాలను బూడిద చేసేస్తానని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు.

హమాస్ దాడి పెద్ద తప్పిదం "ఇజ్రాయిల్ ఈ యుద్ధంలో గెలుస్తుంది" అని రక్షణ శాఖ మంత్రి యోవ్ గాల్లంట్ ప్రకటించారు. ఇజ్రాయిల్ నాయకుల భాష రోజురోజుకూ తీవ్రమవుతోంది. హమాస్‌ను ఐఎస్ఐ ఉగ్రవాద సంస్థతో సమానంగా పరిగణిస్తూ "దాన్ని అణచివేసి పూర్తిగా నిర్మూలిస్తాం'' అని నెతన్యాహూ ప్రకటించారు.

అక్టోబర్ 11న నెతన్యాహూ దేశంలో అత్యవసర ప్రభుత్వాన్ని ప్రకటించారు. ఇద్దరు ప్రతిపక్ష నాయకులు బెన్నీ గాంట్జ్, గాడి ఎజెంకోట్‌లను ప్రభుత్వంలోకి తీసుకున్నారు.

ఈ ఇద్దరూ మాజీ సైనికాధికారులు. వీరిద్దరితో కలిపి నలుగురు సభ్యుల 'యుద్ధ నిర్వహణ మంత్రివర్గం" ఏర్పాటు చేశారు. దీంతోపాటు 14 మంది సభ్యులతో ఒక భద్రతా మంత్రివర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇందులోకి నలుగురు ప్రతిపక్ష సభ్యుల్ని తీసుకున్నారు. దేశాన్ని రక్షించలేకపోతున్నారని తనపై వచ్చిన విమర్శలనుండి తప్పించుకోడానికి తన కన్నా ప్రజల్లో ప్రతిష్ట గలిగిన ప్రతిపక్ష సభ్యులను నెతన్యాహూ యుద్ధ మంత్రివర్గంలో చేర్చుకున్నారు.

**అమెరికా వైఖరి**

తన పదవీ కాలమంతా నెతన్యాహూతో పట్టీ పట్టనట్టు ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఘర్షణ విషయంలో మాత్రం పాత పద్ధతి ప్రకారమే ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతు దారుగా రంగంలోకి దిగారు. "హమాస్ పూర్తిగా దుష్ట శక్తి" అనీ, ఎదురు దాడి చేయడం ఇజ్రాయిల్ హక్కు మాత్రమే కాదు, విధి, అమెరికా ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా ఉంటుంది" అని బైడెన్ అన్నారు. ఈ సందర్భంగా బైడెన్ చేసిన ప్రసంగం "గతంలో అధికారంలో ఉన్న ఏ అధ్యక్షుడూ చేయనంతటి ఇజ్రాయిల్ అనుకూల ప్రసంగం" అని వాషింగ్టన్ పోస్ట్ అభివర్ణించింది.

అక్టోబర్ 12న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్‌కు హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన ప్రసంగిస్తూ "మిమ్మల్ని రక్షించుకునే శక్తి మీకు ఉంది. అయినప్పటికీ అమెరికా ఉన్నంతకాలం మీకు అండగా ఉంటుంది, నిశ్చింతగా ఉండండి" అని చెప్పారు.

కానీ హమాస్ దాడులు ఇజ్రాల్ అభేద్యమైనది అన్న భ్రమలను పటాపంచలు చేశాయి. తమ భూభాగంలోని శత్రువులను కనుగొని అంతం చేసే శక్తి దానికి ఉన్నదని అందరూ అనుకునేవారు. ఆ నమ్మకాలను హమాస్ దాడులు చెదరగొట్టడమే కాదు, హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ ఒక్కటే పోరాడగలదు అన్న భ్రమలను కూడా తొలగించాయి. హమాస్‌తో యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే అమెరికా నుండి ఇజ్రాయిల్‌కు సైనిక పరికరాలు రావడం ప్రారంభమైనాయి. ఇజ్రాయిల్‌కు 200 కోట్ల డాలర్ల రక్షణ సాయం చేస్తామని అమెరికా ప్రకటించింది. ఇజ్రాయిల్ అవసరాలు ఏమిటో కనుగొనేందుకు గాను అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ వ్యక్తిగతంగా ఇజ్రాయిల్ సందర్శించారు.

> **“ హమాస్ దాడులను ఇజ్రాయిల్, దాని మద్దతు దారులను ఆశ్చర్యపరిచిందిగానీ గత ఏడాది డిసెంబర్‌లో నెతన్యాహూ తిరిగి అధికారం చేపట్టిన తరువాత ఆయన పోకడలు గమనించిన రాజకీయ పరిశీలకులు మాత్రం ఇది ఆశ్చర్య పరచలేదు. ఇజ్రాయిల్ ప్రభుత్వ టెర్రరిస్టు పోకడలకు హమాస్ నుండి ప్రతిఘటన ఉంటుందని వారు భావిస్తూనే ఉన్నారు గానీ అది ఇంత తీవ్రంగా ఉంటుంని వారూ ఊహించలేదు. ”**



ఇజ్రాయిలీ బాంబు దాడులకు బలైపోతున్న పసిపిల్లలు

హమాస్ దాడులను ఇజ్రాయిల్, దాని మద్దతు దారులను ఆశ్చర్యపరిచిందిగానీ గత ఏడాది డిసెంబర్‌లో నెతన్యాహూ తిరిగి అధికారం చేపట్టిన తరువాత ఆయన పోకడలు గమనించిన రాజకీయ పరిశీలకులు మాత్రం ఇది ఆశ్చర్య పరచలేదు. ఇజ్రాయిల్ ప్రభుత్వ టెర్రరిస్ట పోకడలకు హమాస్ నుండి ప్రతిఘటన ఉంటుందని వారు భావిస్తూనే ఉన్నారు గానీ అది ఇంత తీవ్రంగా ఉంటుంని వారూ ఊహించలేదు.

2023 మేలో ఇజ్రాయిలీ దళాలకూ, గాజా కేంద్రంగా ఉన్న ఇస్లామిక్ జిహాద్‌కూ మధ్య జరిగిన ఘర్షణల తరువాత రాజకీయ వ్యాఖ్యాత ఆరోన్ డేవిడ్ మిల్లర్ ఇలా రాశారు: "సరికొత్త తుపాను ముంచుకు రావడం ఖాయం. ఎప్పుడు? రోజుల్లోనా, వారాలా, నెలలా అన్నదే ప్రశ్న." " ఇజ్రాయిల్ ప్రభుత్వంలో అగ్గి రాజేస్తున్న మంత్రుల ప్రసంగాలు, పశ్చిమ తీరం, తూర్పు జెరూసలెంలోని యూదు సెటిలర్లలో ఉగ్రవాదులు, జెరూసలెం, పశ్చిమ తీరంలో సాయుధ పోరాటానికి ఎదురు చూస్తున్న హమాస్, వీటికి తోడు ఇజ్రాయిల్, దక్షిణ లెబనాన్‌లలోని అరబ్-యూదులు కలిసి ఉన్న పట్టణాలు....వీటన్నిటి ఫలితంగా ఈ తుపాను ఖచ్చితంగా ముంచుకొస్తుంది." అని ఆయన రాశారు.

ఇటువంటి ప్రమాదకరమైన పరిస్థితులు రావడానికి కారణం ఊహించిందే. గత ఎన్నికల్లో దెబ్బతిన్న నెతన్యాహూ తన పదవిని నిలబెట్టుకోడానికి సంకీర్ణ ప్రభుత్వంలో ముఖ్యమైన పదవులను పచ్చి మితవాద పార్టీ నాయకులకు కట్టబెట్టారు. ఇటామర్ బెన్-గ్విర్‌కు జాతీయ భద్రతా మంత్రి పదవి కట్టబెట్టారు. బెజాలెల్ స్మోట్రిచ్‌కు ఆర్థిక మంత్రి పదవి ఇచ్చారు. పశ్చిమ తీరంలో సెటిల్మెంట్లు నిర్మించే బాధ్యత కూడా ఈయనకే అప్పటించారు.

ఈ మూడు ఉగ్రవాద పార్టీలు "జాత్యాహంకార, యూదు దురహంకార, అరబ్బు-వ్యతిరేక వైఖరి విషయంలో ఒక్కరకంగానే ఉన్నాయి" అని మిల్లర్ అప్పుడు వ్యాఖ్యానించారు. ఈయన చెప్పింది వాస్తవమేనని స్మోట్రిచ్ తన వ్యాఖ్యల ద్వారా నిరూపించాడు. "పాలస్తీనా ప్రజలు అనేవారే

> “ కొత్త మంత్రులు త్వరలోనే వారి అసలు స్వరూపం ఏమిటో చూపించారు. జనవరిలో బెన్-గ్విర్ అల్-అస్కా మసీదులోకి ప్రవేశించాడు. ముస్లింల ప్రార్థనా మందిరాలను పవిత్రంగా ఉంచాలన్న ప్రస్తుత ఏర్పాటు మారిపోతుందని ఆయన సంకేతాలు ఇచ్చారు. ఏప్రిల్‌లో ఇజ్రాయిల్ పోలీసులు రంజాన్ రోజున మసీదు ఆవరణలోకి ప్రవేశించి రబ్బర్ బుల్లెట్లు, స్టన్ గ్రనేడ్‌లను ప్రయోగించి 350 మంది భక్తులను నిర్బంధించారు. ”

ఈ ప్రపంచంలో లేరు'' అని ఆయన వ్యాఖ్యానించడం పాలస్తీనా ప్రజలకు పుండుమీద కారం చల్లినట్టయింది.

### ఉగ్రవాద మంత్రులు

కొత్త మంత్రులు త్వరలోనే వారి అసలు స్వరూపం ఏమిటో చూపించారు. జనవరిలో బెన్-గ్విర్ అల్-అస్కా మసీదులోకి ప్రవేశించాడు. ముస్లింల ప్రార్థనా మందిరాలను పవిత్రంగా ఉంచాలన్న ప్రస్తుత ఏర్పాటు మారిపోతుందని ఆయన సంకేతాలు ఇచ్చారు. ఏప్రిల్‌లో ఇజ్రాయిల్ పోలీసులు రంజాన్ రోజున మసీదు ఆవరణలోకి ప్రవేశించి రబ్బర్ బుల్లెట్లు, స్టన్ గ్రనేడ్‌లను ప్రయోగించి 350 మంది భక్తులను నిర్బంధించారు.

దాని తరువాత బెన్-గ్విర్, స్మోట్రిచ్‌లు ఇద్దరూ పశ్చిమ తీరంలో తమ వంతు నిధులు, సాయుధ దళాలను ఉపయోగించి యూదు సెటిల్‌మెంట్లు ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా ప్రాంతంపై ఇజ్రాయిల్ పరిపాలనా పట్టును మరింత పెంచాలనీ, ఇంకా చెప్పాలంటే అక్కడ యూదు సెట్లర్ల సంఖ్యను ఇప్పుడున్న 5,00,000 నుండి 10,00,000కు పెంచడం ద్వారా ఆ ప్రాంతాన్ని పూర్తిగా యూదు ప్రాంతంగా మార్చేయాలన్నది వారి లక్ష్యం. బెన్-గ్విర్ అయితే అధికాక పర్యవేక్షణ ఏమీ లేకుండా కొన్ని నేషన్ గార్డు దళాలను పూర్తిగా తన కింద ఉంచాలని కోరుకుంటున్నారు.

ఈ ఉగ్రవాద మంత్రుల అండను చూసుకుని యూదు సెట్లర్లు మరింత రెచ్చిపోయారు. వారు ఇష్టం వచ్చినట్లు తమ సెటిల్మెంట్లు నిర్మించుకోవడం ప్రారంభించారు. దాంతోపాటు పశ్చిమ తీరంలో ఇప్పటికే చిన్నచిన్న భూభాగాల్లో నివాసాలకు పరిమిత చేయబడిన 37 లక్షల మంది పాలస్తీనియన్లతో ఘర్షణలు ప్రారంభించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ సెటిల్మెంట్లు ఏర్పాటు చేసుకుంటే తమకు అనుకూలమైన ప్రభుత్వం తరువాత అనుమతి ఇస్తుందనే ధీమాతో వారు పెద్ద ఎత్తున అక్రమ సెటిల్‌మెంట్లు ఏర్పాటు చేయడం ప్రారంభించారు.

నెతన్యాహూ మరోసారి ప్రధాన మంత్రి పదవి చేపట్టక ముందు నుండే యూదు సెటిలర్లు పాలస్తీనియన్లపై హింస ప్రారంభించారు. 2020లో పాలస్తీనియన్ల పొలాల్లో సెటిలర్లు 127 దాడులు జరిపినట్లు రికార్డు అయింది. వారంతా జాత్యాహంకార నినాదాలు చేస్తూ ఈ దాడులకు పాల్పడ్డారు. హింసాత్మక ఘటనలు రానురాను ఎక్కువ కావడంతో ఇజ్రాయిలీ దళాలు అపాచీ హెలీకాప్టర్లు ఉపయోగించి క్షిపణుల ప్రయోగానికి కూడా పాల్పడ్డారు. నెతన్యాహూ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత సెటిలర్లు మరింత రెచ్చిపోయారు. ఒక్క జూన్ నెలలోనే పాలస్తీనియన్లపై 310 దాడులు చేశారు. గృహాలు తగుల బెట్టారు. ఒక మసీదు, ఒక పాఠశాల తగుల బెట్టారు. దీనికి పాలస్తీనియన్ల ప్రతిఘటనతో ఘర్షణలు పెరిగిపోయాయి. ఇజ్రాయిల్ భద్రతా దళాలు డ్రోన్‌లు ఉపయోగించి పాలస్తీనా శరణార్థి శిబిరం మీద దాడులు చేసి దాన్ని నేల మట్టం చేశారు.

పాలస్తీనియన్లను అంతం చేసేందుకు సైనిక చర్య తీసుకోవాలని జులైలో సెట్లర్లు పిలుపునిచ్చారు. ఆ పిలుపుకు స్పందించిన భద్రతా దళాలు జెనిన్ పట్టణంపై దాడి చేసి 10 మంది పాలస్తీనియన్లను చంపారు. 2023 మొదటి ఆరుమాసాల్లో పశ్చిమ తీరంలో సెట్లర్లకు సంబంధించి 600 ఘటనలు జరిగాయినీ, వాటిలో 200 మంది పాలస్తీనియన్లు చనిపోయారనీ ఐక్య రాజ్య సమితి ఒక ప్రకటనలో వెల్లడించింది.

### నెతన్యాహూ పాత్ర

ఈ సంక్షోభానికి నెతన్యాహూనే కారణమని మర్యాదస్తులైన ఇజ్రాయిలీలు పేర్కొంటున్నారు. యుద్ధం ప్రారంభమైన ఒక రోజు తరువాత హారెట్జ్ అనే పత్రి తన సంపాదకీయంలో ఇలా రాసింది:“పాలస్తీనియనియన్ల హక్కులను, మనుగడను పూర్తిగా, బహిరంగంగా పక్కనపెట్టేసిన విదేశాంగ విధానాన్ని అనుసరించడం ద్వారా.... భూ కబ్జా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా వచ్చే ప్రమాధాలను గుర్తించడంలో...ప్రధాన మంత్రి పూర్తిగా విఫలమయ్యారు.”

ప్రముఖ చరిత్రకారుడు, మేధావి యువల్ నోహ్ ఇలా చెప్పారు:“గత చాలా సంవత్సరాలుగా ఇజ్రాయిల్‌ను మితవాద నాయకుడు బెంజమిన్ నెతన్యాహూ పాలిస్తున్నాడు. ప్రజల్లో ప్రచారం చేయడంలో ఆయన దిట్ట గానీ అసమర్థ ప్రధాన మంత్రి. ఆయన జాతీయ ప్రయోజనాలకన్నా తన వ్యక్తిగత ప్రయోజనాలే మిన్నగా పాలిస్తుంటాడు. దేశాన్ని విభజించడం ద్వారా ఆయన తన పరపతిని పెంచుకున్నాడు.” ఈ సరికొత్త ఘర్షణకు ఇజ్రాయిల్ ప్రధాన మంత్రిదే పూర్తి బాధ్యత. ఇజ్రాయిల్ ప్రజల్లో పోతున్న తన పరిపతిని నిలబెట్టుకోడానికి ప్రభుత్వం ఈ యుద్ధాన్ని కొనసాగించవచ్చు. గాజాలో గరిష్ట నష్టం కలిగించడమే ఈ యుద్ధం ఉద్దేశం. దీంతోపాటు కొంతమంది హమాస్ నాయకులను లక్ష్యం చేసుకుని చంపవచ్చు. అందువల్ల తమపై జరిగిన దాడికి ప్రతీకారం తీర్చుకున్నామన భావన ఇజ్రాయిలీల్లో వస్తుంది.

ఈ యుద్ధంలో మానవహక్కులు తీవ్రంగా ఉల్లంఘించబడుతున్నాయని మానవహక్కుల వాచ్ (హెచ్ఆర్‌డబ్ల్యు) పేర్కొంది. రెండు పక్షాలూ ఉల్లంఘించినప్పటికీ ఇజ్రాయిల్ హక్కుల ఉల్లంఘన తీవ్రాతి తీవ్రంగా ఉంది, ఎక్కువ కాలం ఉల్లంఘిస్తోంది. పాలస్తీనియన్లమీద యూదు ఇజ్రాయిలీలు దీర్ఘకాలంగా అనుసరిస్తున్న వివక్ష “మానవాళిపై జాతి వివక్ష నేరం క్రింద శిక్షార్హం” అని హెచ్ఆర్‌డబ్ల్యు పేర్కొంది.

ఈ యుద్ధానికి ముందు కూడా ఇజ్రాయిల్ అనేక సార్లు పాలస్తీనియన్ల మీద “విచక్షణా రహితంగా దాడులు” చేసి అనేక మందిని చంపింది. కొన్ని సార్లు మొత్తం కుటుంబాలనే పొట్టనపెట్టుకుంది. అనేక సందర్భాల్లో పరిసరాల్లో ఎటువంటి సైనిక స్థావరం లేకపోయినా నివాసగృహాలు, వ్యాపార

సంస్థలు ఉన్న పలు అంతస్తుల భవనాల మీద బాంబులు వేసి అనేక మందిని పొట్టనపెట్టుకుంది'' అని హెచ్‌ఆర్‌డబ్ల్యు చెప్పింది.

ప్రస్తుత యుద్ధంలో హమాస్ సాధారణ పౌరులమీద, పిల్లల మీద దాడులు చేసిందని విమర్శలు వచ్చాయి. అయితే ఈ పనిని ఇజ్రాయిల్ దళాలు అనేక సంవత్సరాలుగా నిరంతరం చేస్తూ ఉన్నాయి. తాజా హమాస్ దాడికి ప్రతిగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడి మహాక్రూరమైనది. "గాజాలోని అసుపత్రుల్లో ఇంకుబేటర్లలోని పిల్లలు విద్యుత్తు లేక చనిపోవడం ఆందోళన కలిగించడం లేదా" అని అడిగిన ప్రశ్నకు ఇజ్రాయిల్ మాజీ ప్రధాని నఫ్తాలీ బెన్నెట్ సమాధానమిస్తూ "మీరు నన్ను పాలస్తీనా పౌరుల గురించి అడుగుతున్నారా? ఏం జరుగుతున్నదో మీరు చూడలేదా? మేము నాజీలతో పొరాడుతున్నాం" అని సమాధానం ఇచ్చారు.

''ఇజ్రాయిల్ నాయకత్వం, దాని మద్దతుదారులూ దీన్ని ప్రతీకారం తీర్చుకునే, శిక్షించే సమయంగా భావిస్తున్నారు'' అని రాజకీయ వ్యాఖ్యాత ఆషన్ థరూర్ పేర్కొన్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ తన శత్రువుల మీద తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తోంది. లెబనాన్‌లోనూ, గాజాలోనూ ఇజ్రాయిల్ ఈ తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తోందని మానవ హక్కుల వాచ్ అక్టోబర్ 12న నివేదించింది. ఈ రసాయనం వల్ల ప్రజలకు దీర్ఘకాలిక దుష్ఫలితాలు ఏర్పడతాయి.

"ఇజ్రాయిల్ నాయకత్వం, దాని మద్దతుదారులూ దీన్ని ప్రతీకారం తీర్చుకునే, శిక్షించే సమయంగా భావిస్తున్నారు" అని రాజకీయ వ్యాఖ్యాత ఆషన్ థరూర్ పేర్కొన్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ తన శత్రువుల మీద తెల్ల భాస్వరాన్ని ప్రయోగిస్తోంది. లెబనాన్‌లోనూ, గాజాలోనూ ఇజ్రాయిల్ ఈ తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తోందని మానవ హక్కుల వాచ్ అక్టోబర్ 12న నివేదించింది. ఈ రసాయనం వల్ల ప్రజలకు దీర్ఘకాలిక దుష్ఫలితాలు ఏర్పడతాయి.



నిత్యం ఇజ్రాయిలీ బాంబు దాడులతో ధ్వంసమవుతున్న గాజా

**తక్షణ పర్యవసానాలు**

పాలస్తీనా సమస్యను తక్కువచేసి చూపడానికి అమెరికా, ఇజ్రాయిల్‌లు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి. కానీ ఈ యుద్ధంతో రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొల్పుతున్నామని చేస్తున్న తప్పుడు వాగ్దానాలను ఇకపై పాలస్తీనియన్లుగానీ, వారికి మద్దతిస్తున్న అరబ్బు ప్రజలు గానీ ఇంకెంతమాత్రం నమ్మబోరు.

పాలస్తీనాతో జరిగే ప్రతి యుద్ధంలోనూ ఇజ్రాయిల్‌కు అమెరికా ప్రభుత్వం నుండే కాకుండా దాని రాజకీయ వ్యవస్థనుండీ, మీడియా సంస్థలనుండీ మద్దతు లభిస్తుంది. ఇజ్రాయిల్ ప్రచారం చేస్తున్న అత్యంత తప్పుడు వార్తలకు వంత పలకడం ద్వారా అమెరికా అధ్యక్షుడు బైడెన్ అసత్యాలను వ్యాపింప జేస్తున్నారు. "ఉగ్రవాదులు పిల్లల తలలు నరుకుతున్నారని నాకు నమ్మకమైన ఫోటోలు వచ్చాయి" అని బైడెన్ పేర్కొన్నారు. అయితే ఘనమైన అమెరికా అధ్యక్షుల వారు ఫోటోలను నిజంగా చూడలేదని ఆయన ప్రభుత్వ అధికారులు తరువాత వివరణ ఇచ్చారు. అంతటి అధ్యక్షుల వారే అలా ఉంటే సోషల్ మీడియాలో ఇజ్రాయిల్ మద్దతుదారులు ఊరుకుంటారా! వారు పూర్తిగా అవాస్తవ వార్తలు, ఆరోపణలతో రెచ్చిపోతున్నారు.

అధికారంలో దీర్ఘకాలం కొనసాగడం కోసం, గాజా యుద్ధంపై తదుపరి జరిగే కమిషన్ దర్యాప్తు నుండి బయటపడేందుకూ ప్రధాని నెతన్యాహూ తన మంత్రివర్గంలోని ఉగ్రవాద మంత్రులకు పగ్గాలు పూర్తిగా వదిలేశారు.

అమెరికాలో చాలా మంది రాజకీయ నాయకులు కూడా పాలస్తీనా రక్తం రుచి చూడాలనుకుంటున్నారు. హమాస్‌తో జరుగుతున్నది "మత" యుద్ధం అని ఒక రిపబ్లికన్ సెనెటర్ అన్నారు. గాజాను పూర్తిగా నేలమట్టం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాలస్తీనాలోని దుష్టులందరినీ నిర్మూలించాలని అమెరికా అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్న నిక్కి హాలే పిలుపునిచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగింపులో జపాన్‌లో అమెరికా ఎటువంటి ఏరివేతకు పాల్పడిందో ఇజ్రాయిల్ గాజాలో అలా చేయాలని మరో నాయకుడు పిలునిచ్చారు.

మరో ఇజ్రాయిలీ నాయకుడు మరింత ముందుకు పోయి గాజాపై అణుబాంబులు వేసి సర్వనాశనం చేయాలన్నాడు. గాజా త్వరలో గుడారాల నగరంగా మారిపోతుంది అని ఒక ఇజ్రాయిల్ సైనికాధికారి అన్నాడు.

ఇజ్రాయిల్ అజేయమైనదని ఉన్న భ్రమలను హమాస్ దాడి పటాపంచలు చేసింది. అక్టోబర్ 7న హమాస్ చేసిన మెరుపు దాడి లాంటివి జరక్కుండా ఇజ్రాయిల్ చాలా పెద్ద ఎత్తున సన్నాహాలు చేయడానికి పెద్ద ఎత్తున వనరులు వెచ్చిస్తోంది. కేవలం గాజా చుట్టూ 60 కిలో మీటర్ల సరిహద్దును బారికేడ్లతో మూసేయడానికి అది 100 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది.

హమాస్ దాడి ఆ దేశ గూఢచారి వ్యవస్థ ప్రతిష్టను కూడా దెబ్బతీసింది. శత్రువు కదలికలను అణువణువూ కనిపెట్టే నైపుణ్యం

> కొన్ని దశాబ్దాలుగా ఇజ్రాయిల్, అమెరికాలు పాలస్తీనా సమస్యనూ, పాలస్తీనియన్ల ఆశలూ, ఆకాంక్షలను తక్కువ చేసి చూపిస్తూ ఇజ్రాయిల్, అరబ్బు దేశాల మధ్య సత్సంబంధాలు కుదర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా రాజ్యం ఏర్పాటు సమస్యనూ, పాలస్తీనా శరణార్థుల సమస్యనూ పక్కన పెట్టేశాయి.

ఇజ్రాయిల్ గూఢచారి వ్యవస్థకుందని

ఇజ్రాయిల్ గూఢచారి వ్యవస్థకుందని అనుకునేవారు. గాజా సరిహద్దుల్లో హమాస్ కదలికల గురించి ఇజ్రాయిల్‌కు తెలుసు. అయితే హమాస్ గాజాకు క్వతర్ నుండి నిధులు సమకూర్చుకోవడంలోనూ, ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న 20,000 మంది పాలస్తీనియన్ల ఉపాధి కాపాడ్డంలోనూ ఆసక్తి కలిగి ఉందిగానీ యుద్ధం, దాడుల పట్ల దానికి ఆసక్తి లేదని అనుకుంది.

సైనిక, గూఢచారి వైఫల్యాలు నెతన్యాహూ ప్రభుత్వం మీదా, వ్యక్తిగతంగా నెతన్యాహూ మీదా ప్రతికూల ప్రభావం వేస్తుంది. 'ప్రస్తుత భద్రతా మంత్రివర్గం నుండి నెతన్యాహూ వైదొలగాలనీ, దాని స్థానంలో నైపుణ్యం, అనుభవం, బాధ్యత గల ప్రభుత్వాన్ని ఏర్పరచాలనీ ప్రతిపక్ష నాయకుకు యయిర్ లాపిడ్ డిమాండ్ చేశారు.

నెతన్యాహూ రాజీనామా చేయడం జరగకపోవచ్చు. ఆయన అధికారం కోసం పూర్తిగా ఉగ్రవాద మంత్రులపై ఆధారపడి ఉన్నారు. కాస్త మర్యాదస్తులైన ఇజ్రాయిలీల్లో ఆయనకు ప్రతిష్ట లేదు. ఆయన యుద్ధానంతరం పదవిలో కొనసాగడానికీ, భవిష్యత్తులో వేయబోయే యుద్ధ నేరాల కమిషన్ శిక్షల నుండి తప్పుకోడానికీ ఆయన ఉగ్రవాద సంకీర్ణ భాగస్వాముల మీద మరింతగా ఆధారపడి వారు చెప్పినట్టల్లా ఆడే పరిస్థితి కనిపిస్తోంది. అదే జరిగితే ఇజ్రాయిల్ లక్షలాది మంది పాలస్తీనియన్లను వివక్షతతో కూడిన ఆవాసాల్లో పెట్టి దారుణమైన మైన పరిస్థితులు కల్పించే జాతివివక్ష రాజ్యంగా మారిపోయే ప్రమాదం ఉంది.

### ప్రాంతీయ రాజకీయాలపై ప్రభావం

యుద్ధ ఫలితం ఎలా ఉన్నప్పటికీ గాజా యుద్ధం ఈ ప్రాంత రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

కొన్ని దశాబ్దాలుగా ఇజ్రాయిల్, అమెరికాలు పాలస్తీనా సమస్యనూ, పాలస్తీనియన్ల ఆశలూ, ఆకాంక్షలను తక్కువ చేసి చూపిస్తూ ఇజ్రాయిల్, అరబ్బు దేశాల మధ్య సత్సంబంధాలు కుదర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా రాజ్యం ఏర్పాటు సమస్యనూ, పాలస్తీనా శరణార్థుల సమస్యనూ పక్కన పెట్టేశాయి.

2020 ఆగస్టులో యుఎఇ తరువాత బహ్రాయిన్, మొరాకో, సూడాన్‌లు ఇజ్రాయిల్‌తో సయోధ్య కుదుర్చుకోవడంతో అమెరికా-ఇజ్రాయిల్ ద్వయం ఎత్తుగడ ఫలిస్తోందని అనుకున్నారు. ఈ సయోధ్య క్రమాన్ని "అబ్రహామ్ ఒప్పందాలు" అని పేరుపెట్టారు. బైడెన్ అమెరికా అధ్యక్షుడైనప్పటి నుండీ ప్రపంచంలోని ముఖ్యమైన అరబ్బు, ముస్లిం దేశమైన సౌదీ అరేబియాకూ ఇజ్రాయిల్‌కూ దోస్తీ కుదర్చడంపై ప్రధానంగా కేంద్రీకరించారు. 2023 ఏడాది అంతా ఈ క్రమం పురోగతి సాధించింది. ఈ ఏడాది చివరిలో రెండు దేశాల మధ్య ఒక ఒప్పందాన్ని ప్రకటించాలని కూడా భావించారు.

అయితే హమాస్ దాడి తరువాత సౌదీ అరేబియా విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేస్తూ తను గతంలో చేస్తూ వచ్చిన హెచ్చరికలను గుర్తు చేసింది. "పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించడం, పాలస్తీనా ప్రజలకు వారి న్యాయమైన హక్కులను నిరాకరించడం, వాటిని పదేపదే ఉల్లంఘించడం వల్ల విస్ఫోటనం బద్దలయ్యే పరిస్థితుల ఏర్పడతాయని తమ దేశం మొదటి నుండీ హెచ్చరిస్తూనే ఉంది" అని ప్రకటనలో పేర్కొన్నారు.

ఇజ్రాయిల్‌తో సంబంధాల పునరుద్ధరణ గురించి సౌదీ అధికారి ఇలా చెప్పారు: "పరిస్థితి మాకు చాలా చెడ్డగా కనిపిస్తోంది. పరిస్థితులు చేజారేట్లున్నాయి" తరువాత సౌదీ రాజు మొహమ్మద్ బిన్ సాల్మన్ పాలస్తీనా పాలనా అధిపతి మొహమౌద్ అబ్బాస్‌తో మాట్లాడుతూ తమ దేశం "పాలస్తీనా ప్రజలు తమ న్యాయమైన హక్కులు రాబట్టుకోవడంలోనూ, మంచి జీవనం సాధించడంలోనూ, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుకోవడంలోనూ న్యాయమైన, సుదీర్ఘమైన శాంతి సాధించడంలోనూ పాలస్తీనా ప్రజల తరఫున నిలబడుతుందని" హామీ ఇచ్చారు.

హమాస్ దాడి ప్రణాళికలో ఇరాన్ హస్తం ఉందని పశ్చిమ దేశాలకు చెందిన కొన్ని మీడియా సంస్థలు చెబుతున్నాయి. ఇజ్రాయిల్ తన అరబ్బు పొరుగు దేశాలతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవడం ఇరాన్‌కు ఇష్టం లేదని అవి వాదిస్తున్నాయి. "అబ్రహాం ఒప్పందాలతో ప్రారంభమైన ఈ ప్రాంత పరివర్తన క్రమాన్ని" ఈ దాడులు పట్టాలు తప్పించాయని టైమ్స్ పత్రిక రాసింది. హమాస్‌కు ప్రధాన మద్దతుదారు ఇరాన్ అనీ, స్వదేశంలో ప్రతిష్ట పోగొట్టుకుంటున్న ఇరాన్ ప్రభుత్వానికి ఈ యుద్ధం చాలా అవసరం అనీ అందులో వ్యాఖ్యాతలు రాశారు.

వాల్‌స్ట్రీట్ జర్నల్ మరో అడుగు ముందుకు వేసింది. దాని విలేకరి ఇలా రాశాడు:"హమాస్ శనివారం నాడు ఇజ్రాయిల్‌పై చేసిన ఆకస్మిక దాడి ప్రణాళిక రూపొందించడంలో ఇరాన్ భద్రతాధికారులు హమాస్‌కు సహకించారు.... ఇజ్రాయిల్‌కు అన్ని వైపుల నుండి ముప్పు ఏర్పాటు చేయడమే ఇరాన్ లక్ష్యం". సిరియా, లెబనాన్‌లో హమాస్, ఇరాన్ అధికారుల ఎప్పుడెప్పుడు సమావేశమయ్యారు ఏలా ఈ దాడిని ఖరారు చేశారు అన్ని వివరాలు కూడా వారు రాశారు.

ఇరాన్‌పై ఈ విధంగా కేంద్రీకరించడం వెనుక ఈ దాడికి నెలన్యాహూ ప్రభుత్వ అసమర్థత కారణమన్న విషయం నుండి ప్రజల దృష్టిని మరల్చే. అతని నాయకత్వం వెనుక ప్రజలను సమీకరించే వ్యూహం ఉంది. ఇరాన్‌కీ సౌదీ అరేబియాకూ పడదు కనుక ఇరాన్ బూచి చూపించి సౌదీ అరేబియాను తిరిగి సయోధ్య చర్చల్లోకి తీసుకు రావచ్చని కూడా అమెరికా-ఇజ్రాయిల్‌లు భావిస్తున్నాయి.

ప్రస్తుతం జరుగుతున్న గాజా యుద్ధం పాలస్తీనా సమస్యను అది ఎక్కడ ఉండాలో అక్కడ అంటే పశ్చిమాసియా రాజకీయ కేంద్రంలో పెట్టింది. యుద్ధం తీవ్రత, ఇజ్రాయిల్ బలహీనతల వెల్లడి, పాలస్తీనియన్లు

(మిగతా 35వ పేజీలో)

# గాంధీ హంతకుడిపై ప్రేమ

సుభాష్ గటాడే



**రచయిత ప్రముఖ పాత్రికేయుడు, వామపక్ష ఉద్యమకారుడు. 'మోడీనామా', 'హిందూత్వ పునరాగమనం' వంటి అనేక పుస్తకాలు రాశారు. వర్తమాన రాజకీయాలపై వ్యాఖ్యానాలు, వ్యాసాలు రాస్తుంటారు.**

**"రామరాజ్యమంటే నా దేశం హిందూ రాజ్యం కాదు. రామరాజ్యమంటే దైవ పాలన. భూమిపై దేవుని రాజ్యం."**

**– గాంధీ.**

నాథురాం గాడ్సే (19 మే 1910 – 15, నవంబర్ 1949) గురించి అద్వానీ చెబుతూ, గోడ్సే 1933 లో "ఆర్ఎస్ఎస్‌తో తెగదెంపులు చేసుకున్నాడని, ఆర్ఎస్ఎస్‌ని తీవ్రంగా విమర్శించేవాడని అన్నారు." దీనిని గాడ్సే సోదరుడు గోపాల్ గాడ్సే నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గాడ్సేతోపాటు గోపాల్ గాడ్సే కూడా గాంధీ హత్య కుట్రలో నిందితుడు. అతడు, 'నేనెందుకు మహాత్మా గాంధీని హత్యచేశాను' అనే పుస్తకాన్ని 1993లో ప్రచురించాడు. వారిద్దరూ ఆర్ఎస్ఎస్ క్రియాశీల కార్యకర్తలు.

**1**

తన సమకాలీనుల లాగే జవహార్‌లాల్ నెహ్రూ కూడా ఉత్తర ప్రత్యుత్తరాలలో రాటుదేలినవాడు. ఆ కాలంలో ఉత్తరాలు రాయడం అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న సమాచార సాధనం. నెహ్రూ తన కూతురు ఇందిరకు రాసిన – అప్పటికి ఆమెకు 10 ఏళ్ళు మాత్రమే – ఉత్తరాలు, తదనంతర కాలంలో పుస్తక రూపంలో ప్రచురించబడ్డాయి. ఆ గ్రంథం ప్రపంచం పట్ల సున్నితమైన అవగాహన కల్పించడానికి రాసినది. ప్రపంచ సాహిత్యంలో ఆణిముత్యం. ఆయన ఉత్తరాలు కుటుంబ సభ్యులు, స్నేహితులేకాదు, విమర్శకులను కూడా ప్రశంసించారు అన్నది ఆసక్తికరమైన అంశం. జయప్రకాశ్ నారాయణ్ సి.రాజగోపాలాచారితో జరిపిన సుదీర్ఘ ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన విధానాలు, ఆయా సమస్యల పట్ల మితవాదం వైపు మొగ్గుచూపుతున్నాయా, లేదా వామపక్షం వైపు మొగ్గుచూపుతున్నాయా తెలియచేసేవి.

గాంధీ హత్యకు గురికాబడిన రెండు రోజుల క్రితం నెహ్రూ శ్యాంప్రసాద్ ముఖర్జీకి రాసిన ఉత్తరం చూద్దాం. ఆయన ఇలా రాశారు: "గత కొన్ని రోజులుగా హిందూ మహాసభ నిర్వహిస్తున్న కార్యకలాపాల పట్ల నేను చాలా కలత చెందుతున్నాను. ప్రస్తుతం అవి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్‌ని విమర్శించడమే కాదు, దేశంలో హింసను నిరంతరంగా వ్యాపింపచేస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ మరింత దారుణంగా ప్రవర్తిస్తున్నది. మేము వాటి అభ్యంతరకర కార్యకలాపాలకు, దోపిడీలు, అక్రమాలకు సంబంధించిన అనేక రుజువులు సంపాదించాం."

"ఈ ఉత్తరాలను బట్టి చూస్తే, రానున్న రోజుల్లో పెద్ద తుఫాన్ వచ్చే సూచనలతో దేశం అట్టడుకబోతున్నట్టు స్పష్టంగా అర్థం అవుతున్నది. ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ నాయకులు 'అసాధారణంగా విషం చిమ్మే' ప్రసంగాలు చేయడాన్ని ఆయన శిక్షించదగ్గవి అన్నది స్పష్టం. సహనానికి కూడా హద్దులున్నాయి. ఇప్పటివరకు హద్దులు దాటి ఉండకపోతే, ఇప్పుడు దాటేశారని నేను భావిస్తున్నాను" అని రాశారు.

ఈ ఉత్తరం రాయడంలో అర్థం, ముఖర్జీ ప్రభుత్వంలో భాగస్వామి అయినందు వల్ల ఈ పనులు ఖండిస్తారని. మతతత్వ సంస్థలకు వ్యతిరేకంగా గొంతెత్తుతారనీ. కానీ ముఖర్జీ మౌనం దాల్చారు.

హిందూ మతతత్వ సంస్థలు హింసను ప్రేరేపిస్తున్నాయనడానికి అనేక సాక్ష్యాలు ఉన్నాయి. హిందూ మహాసభ నాయకుడు, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరు డాక్టర్ బిఎస్ మూంజె, 'జిన్నాను ఎదుర్కోడానికి మనం శాస్త్రీయ పద్ధతుల్లో హింసకు పాల్పడవలసిందే' అని సూచించారు. ఆల్ ఇండియా హిందూ మహా జాతి సమ్మేళనంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ పై మాటలన్నారు.

వాటిని చదివితే వారెంత బరితెగించారో అర్థం అవుతుంది. "హిందూ మహాసభ కార్యకర్తలు హిందువుల ప్రయోజనాలు తాకట్టు పెట్టబడ్డాయని బహిరంగంగా జాతీయ నాయకులను విమర్శించారు. నెహ్రూ, పటేల్, ఆజాద్‌లను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. 'గాంధీ ముర్దాబాద్' అనడం సర్వసాధారణం అయిపోయాయి. 1947 డిసెంబర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ ర్యాలీలో 50,000 మంది స్వయం సేవకులు పాల్గొన్నట్టు గూఢాచార సమాచారం. అందులో గోల్వాల్కర్ ప్రభుత్వ వైఖరి భారతీయుల వైఖరిగా లేదని, శనీశ్వరుని లాగా ఉందని విమర్శించారు. 1947 డిసెంబర్ 8న ఒక సమావేశంలో, గోల్వాల్కర్ మాట్లాడుతూ సంఘ్ పాకిస్తాన్‌ను అంతం చేస్తుంది. 'ఎవరైనా అడ్డుపడితే వాళ్ళను కూడా అంతం చేస్తుంది' అన్నారు . "అది నెహ్రూ ప్రభుత్వమైనా, లేదా ఇతర ఏ ప్రభుత్వమైనా సరే" భారతదేశంలో వారుండడానికి వీలులేదు. ఆర్ఎస్ఎస్‌కి తక్షణమే ప్రత్యర్థుల నోరు మూయించే సత్తా ఉంది" అని అన్నారు.

హిందూ రాష్ట్రకు అనుకూలమైన పత్రికలు మహాత్మా గాంధీని చంపేస్తామని బాహాటంగానే పరోక్షంగా బెదిరించాయి. ఉదాహరణకి: గాంధీని చంపడానికి ఆరు రోజుల ముందు దైనిక్ హిందూ రాష్ట్ర అనే పత్రికలో "గాంధీ గారు దేశానికి వ్యతిరేకంగా, పై విధమైన భయంకరమైన ప్రకటనలు చేస్తున్నన్ని రోజులు ఆయన రక్షణ కోసం మరింత ఎక్కువ మంది సైనికులను కేటాయించాలని భారతదేశ

> **“ ఈ పరిస్థితులలో నాథురాం గోడ్సే, అతని సహచరుడు గాంధీని హత్యచేశారు. హిందూ ఆధిపత్య శక్తులు ఈ కుట్ర పన్నాయి. అందులో సావర్కర్ ఆయన దగ్గరి వారు కీలకపాత్ర పోషించారు. అది ఒక వ్యక్తిని మరో వ్యక్తి ఏదో ఉడుకు రక్తంలో, ఏ ప్రణాళిక లేకుండా చంపిన సాధారణ హత్య ఎంతమాత్రం కాదు. దాదాపు దశాబ్దంన్నరగా హిందుత్వ ఆధిపత్య శక్తులు ఎంతో ఆలోచించి వేసుకున్న ప్రణాళిక అమలుచేయడం మాత్రమే. ”**

ప్రభుత్వాన్ని మేము కోరుకుంటున్నాం” అని రాశారు.

భరత్ భూషణ్ అనే జర్నలిస్టు వ్యాసంలో ఢిల్లీ సిఐడి నివేదికలను ప్రస్తావించారు. అవి ‘ఆర్ఎస్ఎస్ అధినాయకుడు, గోల్వాల్కర్ గాంధీజీని చంపుతానని బెదిరించాడు’ అన్న నివేదికతో సరిపోలాయి. అందులో లక్నో సిఐడి ఉత్తరం కూడా ఉంది: డిసెంబర్ 1వ తేదీ, 50 మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మధురలో కలిసి, కాంగ్రెస్ నాయకులను ఎలా అంతం చేయాలా అని చర్చించారని తెలియచేసింది.

ఈ పరిస్థితులలో నాథురాం గోడ్సే, అతని సహచరుడు గాంధీని హత్యచేశారు. హిందూ ఆధిపత్య శక్తులు ఈ కుట్ర పన్నాయి. అందులో సావర్కర్ ఆయన దగ్గరి వారు కీలకపాత్ర పోషించారు.

అది ఒక వ్యక్తిని మరో వ్యక్తి ఏదో ఉడుకు రక్తంలో, ఏ ప్రణాళిక లేకుండా చంపిన సాధారణ హత్య ఎంతమాత్రం కాదు. దాదాపు దశాబ్దంన్నరగా హిందుత్వ ఆధిపత్య శక్తులు ఎంతో ఆలోచించి వేసుకున్న ప్రణాళిక అమలుచేయడం మాత్రమే.

“తీస్తా శతల్వాద్ తన, ఇంట్రడక్షన్ ఆఫ్ ఎ బుక్ లో, గాంధీ హత్య స్వతంత్ర భారతదేశంలో జరిగిన మొట్టమొదటి తీవ్రవాదుల హత్య మాత్రమే కాదు... అది ఒక యుద్ధం” అని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు భారతదేశంలోని ప్రజాతంత్ర లౌకిక శక్తులపై నిరంతరంగా పోరాడుతూనే ఉంటాయని, లౌకికతత్వానికి అండగా నిలిచిన వారందరితో లేదా ఆ సిద్ధాంతాలకి కట్టుబడి ఉన్నవారందరితో నిరంతరం ఘర్షణ పడతామని ప్రకటించాయి. వారెంతవరకు వెళతారో, ఎంతవరకు వెళ్ళడానికి సిద్ధపడ్డారో ఇంకా చూడాల్సి ఉంది. గాంధీని హత్య చేయడం అంటే గాంధీ కట్టుబడి ఉన్న విలువలను అన్నింటిని నాశనం చేయడం. జాతీయోద్యమంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలిచిన వారిని నాశనం చేయడం. సమానత్వం, వివక్షతలేని ప్రజాతంత్ర ప్రభుత్వం ఇప్పటికీ సంఘ్ ఆదర్శ రాజకీయ విధానానికి గిట్టదు.

గాంధీ హత్య గావించబడిన మూడేళ్ళ తరువాత నెహ్రూ రాసిన ఉత్తరాలలో కూడా ఇదేతరహా ఆందోళన కనిపిస్తుంది. మతతత్వ సంస్థల కుతంత్రాలు, కాంగ్రెస్ పార్టీగా చెప్పుకునే వాళ్ళలో కూడా కొందరు రంగులు మార్చుకోవడం, ‘సంఘ్ వైపుకు’ మళ్లడం పట్ల నెహ్రూ ఆందోళన పడుతుండేవారు. ఉదాహరణకి 1951 సెప్టెంబర్ 19వ తేదీ నెహ్రూ పిసిసి అధ్యక్షులకందరికి ఒక ఉత్తరం రాశారు. దానిని కాంగ్రెస్ బులెటిన్‌లో కూడా ప్రచురించారు. అందులో ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలలో కొందరు కాంగ్రెస్ సభ్యులు తాము హిందూమహాసభ సభ్యులమైనట్టు లేదా అటువంటి మతతత్వ సంస్థలలో సభ్యులు అయినట్టు ప్రవర్తించారు. నిజానికి కొందరు కాంగ్రెస్‌కి రాజీనామా చేసి జనసంఘ్‌లో చేరారు కూడా. ఇదెంతో ప్రాధాన్యత కలిగిన అంశం. ఎందుకంటే నిజమైన కాంగ్రెస్ సభ్యులు మతతత్వ సంస్థలకు చాలాదూరంగా ఉండి ఉండవలసింది. మన పనిలో, ఎన్నికలలో కూడా మతతత్వ సంస్థలే మన ప్రధాన శత్రువులు అన్నారు.

అలాగే సెప్టెంబర్ 19న రాసిన మరో సర్కులర్‌లో కూడా నెహ్రూ కాంగ్రెస్ విధానాలకు మతతత్వవాదుల విధానాలకు పొంతనే లేదని చెప్పారు. అందువల్ల కాంగ్రెస్ సభ్యులను నమోదు చేసుకునే టప్పుడు శ్రద్ధ చూపాలి. సభ్యులుగా ఉండదలుచుకున్న వారు మతతత్వవాదులు కాకూడదు. మతతత్వ సంస్థలతో సంబంధాలు ఉన్న వారిని ఈ విషయంలో అనుమానించాలి. ఇదెంతో ప్రాధాన్యత గల అంశం. ఎందుకంటే గతంలో కొందరు మతతత్వ మూలాలున్న వారు కాంగ్రెస్‌లో జొరబడ్డారు అని చెప్పారు.

**2**

‘యుద్ధం ప్రకటించడం’, ‘భారతదేశంపై మొదటి ఉగ్రవాద దాడి’ వంటి వాటికి ఈ రోజు ఉండవలసినంత ప్రాధాన్యత ఉండకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. పైగా అందుకు పూర్తి భిన్నంగా వాస్తవాలు ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ భావజాలంతో కేంద్రంలో అధికారంలో ఉన్న నేటి మెజారిటేరియన్ ప్రభుత్వం, తమ కార్యకర్తలు చేసిన ఘనకార్యాలకు పొంగిపోతున్నారు.

ఆ చిట్టాలో ఈమధ్యే చేరినది ‘గాడ్సేని కీర్తించండి’ అనే ప్రచారం. డాక్టర్ పూజ శకున్ పాండే అనే మహిళ ఆగ్రాలోని ఒక గణితశాస్త్ర ఆచార్యురాలు. గాంధీ ప్రాణం బలిదానం చేసిన రోజు గాంధీ బొమ్మపై కాల్పులు జరిపి, గాడ్సే మెడలో పూలమాల వేశారు.

ఆమె వచ్చింది యూపీలోని మీరట్ నుండి. అఖిల భారతీయ హిందూ మహాసభ జాతీయ కార్యదర్శి. స్వయం ప్రకటిత ‘మొదటి హిందూ కోర్టు’ మహిళా న్యాయమూర్తి. దీనిని ఈ మధ్య స్థాపించారు. ఇది షరియా కోర్టుకి ప్రతిచర్య అట. తాను నాథురాం గాడ్సే కన్నా ముందు పుట్టి ఉంటే, తానే తన చేతులతో మహాత్మా గాంధీని కాల్చి చంపేదానిని అని డాక్టర్ పూజ అన్నారు. గాంధీని ‘మతం ఆధారంగా దేశవిభజనకు’, ‘లక్షలాది హిందువుల మరణానికి’ కారణమని నింద మోపుతూ, గాంధీనే కాదు, మరో మహాత్ముడిగా అవతరించడానికి ప్రయత్నించిన ఎవరినైనా హత్య చేస్తానని అన్నారు. ఆమె గాడ్సేకి ‘విధేయ దేశభక్తురాలు’, గాంధీని కీర్తిస్తూ, గాడ్సేని రాక్షసుడిగా చిత్రిస్తూ విద్యార్థులకు చెప్తున్న తప్పుడు చరిత్ర పాఠాలు ఇకనైనా ఆపాలని ఆమె కోరారు.

బిజెపి ఎంపి, సాక్షి మహారాజ్ పార్లమెంటులో మాట్లాడుతూ గాడ్సే జాతీయవాదనీ, దేశభక్తుడనీ కీర్తించడం ఎంతటి దుమారాన్ని లేపిందో గుర్తుకుతెచ్చుకోండి. 2014 అక్టోబర్‌లో ఆర్ఎస్ఎస్ అధికార మలయాళ పత్రికలో, గాడ్సే గాంధీని కాదు పూర్వ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను చంపి ఉండవలసిందని రాశారు. రచయిత మరెవరో కాదు. ఎన్నికలలో పార్లమెంటుకు పోటీ చేసిన బిజెపి నాయకుడు. అతనిపై చర్య తీసుకోవడం మాట అటుంచి, ఆర్ఎస్ఎస్ ఆ వ్యక్తికి

ఆర్ఎస్ఎస్‌కి సంబంధం లేదని, అది అతని వ్యక్తిగత అభిప్రాయమని చెప్పుకునే విఫల ప్రయత్నం చేసింది. ఈ గొప్ప 'దేశ భక్తులు' దేశవ్యాప్తంగా గుడులు కట్టాలనే ప్రయత్నంలో ఉన్నారు. గాంధీ హత్య కేసులో ప్రధాన నిందితుడు సావర్కర్ (జీవన్ లాల్ కమిషన్ ఎంతో శ్రమకోర్చి ఈ విషయాన్ని పరిశోధించింది) అఖిల భారతీయ హిందూ మహాసభకు చెందిన వాడు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా గాడ్సే విగ్రహాలు ప్రతిష్టించడానికి పూనుకుంది.

"మేము అఖండ భారతమాత, గాడ్సే గుడులకి జనవరి 30న శంకుస్థాపన చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాము. పూనాలో ఇప్పుడున్న గాడ్సే అస్తికలు, ఆ రోజు అక్కడికి వచ్చే అశేష ప్రజానీకం సమక్షంలో సీతాపూర్‌లో కట్టే ఈ మందిరంలో పెట్టాలనుకుంటున్నాం. మా కల అయిన అఖండ భారత్, అంటే అవిభాజిత భారతదేశం, అంటే హిందూ రాష్ట్రాన్ని స్థాపించాలనుకుంటున్నాం. మేము మా కల సాకారం చేసుకున్న తరువాతే గాడ్సే అస్తికలు నిమజ్జనం చేస్తాం అని హిందూ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ కమలేష్ తివారి న్ హెడ్ లైన్స్ టుడే పత్రికకు చెప్పారు.

"ఇటువంటి కదలికలను పరిశీలించిన ఒక ఆంగ్ల దిన పత్రిక ప్రాధాన్యత గల వ్యాఖ్య చేసింది" గాడ్సేని కీర్తించడం ఒకరకంగా పెత్తనం చేసే రాజకీయాలను మొదలుపెట్టడం అవుతుంది. ఇది భారతదేశ ఐక్యతకు, చిత్తశుద్ధికి భంగం కలిగిస్తుంది. 2007లో సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లో బాంబులు వేయడాన్ని మనం చూశాం. ఇది గాడ్సే విధానాల ప్రతిరూపమే. అందులో నిందితులు భారతదేశంలోని సైనిక సంప్రదాయాల వల్ల ప్రభావితుడై, ఆ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న పాకిస్తాన్ జాతీయులను అంతం చేయాలనుకున్నారు. అసలు గాడ్సేనే పెడదారి పట్టిన దేశభక్తుడు. బహిరంగంగా అటువంటి వ్యక్తిని ఆదర్శ పురుషునిగా చూపడం, మితవాద రాజకీయాలు ఎంతటి నష్టం కలిగిస్తున్నాయో తెలియచేస్తుంది.

నిజానికి ఇటువంటి చర్యలకు పాల్పడినందుకు ఎవరిపైనైనా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవచ్చు. హింసను కీర్తించడం, లేదా హత్య చేసిన వారిని అమరుడిగా చిత్రించడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, లేదా విభిన్న జాతుల మధ్య దురభిమానం సృష్టించడం చట్టరీత్యా (153వ అధికరణం)

**"2006 ఏప్రిల్‌లో నాందెడ్‌లో, అపఖ్యాతి తెచ్చిపెట్టే బాంబు పేలుళ్లలో, రాజీవ్ రాజకొండవర్, హిమాంశు పన్సే అనేవాళ్లు మరణించారు. తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు పర్యవేక్షించే యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఈ కేసును పరిశోధించిన మీదట, ప్రమాదానికి గురైన వారితో హిందుత్వ కూటములు సంబంధాలు కలిగి ఉన్నారని, ఆ బాంబులను 'గాడ్సే అమరత్వం పొందిన రోజు' పేల్చడానికి క్రమం తప్పకుండా ఉత్పత్తి చేస్తుంటారని తేలింది."**

నేరం. ఇటువంటి చర్యలకి కనీసం రెండేళ్లు కారాగార శిక్ష అనుభవించవలసి రావచ్చు. అయితే గాడ్సే విషయానికి వచ్చేసరికి విషయం మారిపోతుంది.

1997 అక్టోబర్ 5, ఆర్గనైజర్ పత్రికలో ఢిల్లీ కేంద్రంగా గల ఒక ప్రచురణ సంస్థ 'చదివేందుకు ఆకర్షణీయంగా ఉండే ఆరు పుస్తకా'ల ప్రమోషన్ కోసం ఒక ప్రకటన ఇచ్చింది. అందులో రెండు గోపాల్ గాడ్సే రాసిన: కుతుబ్ మినార్ విష్ణు ధ్వజం, గాంధీ హత్య, తదనంతరం. మూడో పుస్తకం, ఆర్యా, మీకు దయ కలుగుతుందా, అని హంతకుడు కోర్టులో చేసిన ప్రకటన. ఆర్గనైజర్ పత్రిక, తనకు వ్యతిరేకంగా మాట్లాడే వారి ప్రకటనలు ప్రచురిస్తుందని అనుకోలేము. ప్రచురణకర్తలు ఒక పుస్తకం వెనుకపేజీ అట్ట పై, గాంధీ హత్య "ఒక రాజకీయ నేరం". ఒక ఆలోచనాపరుడు అవమానం భరించలేక చేసిన న్యాయమైన పని అని రాశారు. "గాడ్సే కోర్టులో ఇచ్చిన సుదీర్ఘ ఉపన్యాసం గాంధీని హత్య చేయడానికి రాజకీయ కారణాలు ఉన్నాయని ఎత్తి చూపింది. నాథురాం గాడ్సే భారతదేశ స్వతంత్ర పోరాట చరిత్రను, అందులో గాంధీ పాత్రను అవలోకనం చేసుకున్నారు. గాంధీని హత్య చేయడం తప్పని పరిస్థితుల్లో జరిగిన దురదృష్ట సంఘటన అనే నిర్ణయానికి వచ్చారు" అని రాశారు.

ఆ సంస్థలు, వాటికి దగ్గరగా ఉన్న వ్యక్తులు, బహిరంగంగానో, మరీ బహిరంగంగా కాకుండానో దశబ్దాలుగా గాడ్సే గురించి మాట్లాడుతూనే ఉన్నారు. హిందుత్వకి సంబంధించిన గ్రూపులు ప్రతి నవంబర్ 15వ తేదీ–గాడ్సే తన నేరానికి ఉరితీయబడిన రోజు – మహారాష్ట్రలోనూ, ఇతర పశ్చిమ భారతదేశ ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ముంబై, పునాలలో గాడ్సే వారసత్వాన్ని స్మరించుకుంటూ కార్యక్రమాలు నిర్వహించుకోవడం వార్తా పత్రికలలో ప్రచురించబడుతూనే ఉంది.

2006 ఏప్రిల్‌లో నాందెడ్‌లో, అపఖ్యాతి తెచ్చిపెట్టే బాంబు పేలుళ్లలో, రాజీవ్ రాజకొండవర్, హిమాంశు పన్సే అనేవాళ్లు మరణించారు. తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు పర్యవేక్షించే యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఈ కేసును పరిశోధించిన మీదట, ప్రమాదానికి గురైన వారితో హిందుత్వ కూటములు సంబంధాలు కలిగి ఉన్నారని, ఆ బాంబులను 'గాడ్సే అమరత్వం పొందిన రోజు' పేల్చడానికి క్రమం తప్పకుండా ఉత్పత్తి చేస్తుంటారని తేలింది.

**3**

మహాత్మా గాంధీని హత్య చేయడానికి హిందుత్వ మూర్ఖులు ఎలా ప్రణాళిక రచించారో ప్రపంచానికంతటికీ తెలుసు. సావర్కర్, గోల్వాల్కర్ లాంటి ఆర్ఎస్ఎస్ అధినాయకులు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి కారణమని, అవే ఇటువంటి దారుణ హత్యలకు దారితీస్తాయని అందరూ ఎరుగుదురు. సర్దార్ పటేల్ నుండి, శ్యాం ప్రసాద్ ముఖర్జీ (అప్పుడాయన హిందూ మహాసభ సభ్యుడు, ఆ తరువాతి కాలంలో భారతీయ జనసంఘ్‌ని ఆర్ఎస్ఎస్ మద్దతుతో స్థాపించారు) వరకు అందరికి ఈ రెండు సంస్థల కార్యకలాపాలు, వాటి నేపధ్యాలు తెలుసు. సర్దార్ పటేల్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి లేఖ రాస్తూ, "మాకున్న సమాచారాల ప్రకారం, ఈ రెండు సంస్థలు, ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు దేశంలో ఘోరమైన సంఘటనలు (గాంధీజీ హత్య) జరగడానికి కారణమవుతున్నాయి. ఈ కుట్రలో హిందూ మహాసభ తీవ్రవాదుల హస్తం ఉందనడంలో ఎటువంటి సందేహం నాకు లేదు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు ప్రభుత్వానికి, రాజ్యం మనుగడకు కూడా ఆపదను తెచ్చిపెట్టేవిగా ఉన్నాయి. నిషేధం ఉన్నప్పటికీ, వారి కార్యకలాపాలు ఆగిపోలేదని మాకు

**❝ తమ అభిప్రాయాలు మాత్రమే గొప్పవని భావించే హిందుత్వశక్తులు, సమాజంలో మూలల కంటా ఎలా పాతుకు పోయాయో చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. వారి నేరపూరిత చర్యలు, ఒక మహానాయకుడిని హత్య చేయడం, సరైనదని భావింప చేసే పరిస్థితులు కల్పించ గలుగుతున్నారు. ❞**

అందిన నివేదికలు తెలియజేస్తున్నాయి. కాలం గడుస్తున్న కొద్దీ ఆర్ఎస్ఎస్ వారు మరింత ధిక్కరిస్తున్నారు. మరిన్ని విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడుతున్నారు" అని చెప్పారు.

తమ అభిప్రాయాలు మాత్రమే గొప్పవని భావించే హిందుత్వశక్తులు, సమాజంలో మూలలకంటా ఎలా పాతుకు పోయాయో చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. వారి నేరపూరిత చర్యలు, ఒక మహానాయకుడిని హత్య చేయడం, సరైనదని భావింపచేసే పరిస్థితులు కల్పించ గలుగుతున్నారు.

గాంధీని చంపడానికి హిందూత్వ శక్తులు అనేక ప్రయత్నాలు చేశాయి. ఈ సందర్భంలోనే గాంధీజీవితాన్ని కాపాడిన ఒక యువ స్వతంత్ర సమరయోధుని గాథ, అదీ గాంధీ చనిపోయిన తరువాత వెలుగుచూసింది. అతని పేరు భిలారే గురూజీ.

భికూ దాజి భిలారే (1919లో పుట్టారు) తన 98వ ఏట మరణించారు. అతనో ప్రత్యేకమైన వ్యక్తిత్వం గలవాడు. అతని అంతిమ యాత్రలో అన్ని తరగతుల, అన్ని రంగాల, అన్ని రాజకీయ పార్టీల వారు పాల్గొన్నారు. ప్రధాన స్రవంతి ప్రసార మాధ్యమాలు కూడా ఆ వార్తను ప్రసారం చేశాయి. దానికి ప్రధాన కారణం అతడు తన యవ్వనంలో రాష్ట్రీయ సేవదళ్ సభ్యునిగా ఉండడం. సతారా జిల్లాలో విప్లవకారుడు నానా పటేల్, ఇతరులు నడిపే "సమాంతర ప్రభుత్వం" ఉద్యమంలో క్రియాశీల కార్యకర్తగా ఉండడం. సామాజిక రాజకీయ సేవలలో చురుకుగా పనిచేయడం. 18 సంవత్సరాలు జావలి శాసన సభకు ప్రాతినిధ్యం వహించడం. గాంధీ జీవితాన్ని కాపాడడంలో అతను ప్రదర్శించిన ధైర్యసాహసాలు చాలా కొద్ది మందికే తెలుసు. ఆ ఏడాది స్వతంత్రం రావడం దాదాపు ఖరారైంది. గాంధీ ప్రధాన పాత్ర పోషించవలసిన అవసరం ఉంది. 1944లో గాంధీ పంచగిని దర్శించనున్నారు. అది పూనా దగ్గరిలో ఉన్న ఒక పర్వత ప్రాంతం. 15-20 మంది యువకులు ఒక బస్‌లో అక్కడికి చేరారు. రోజంతా గాంధీకి వ్యతిరేకంగా ధర్నాకు దిగారు. గాంధీ వారిని చర్చలకు ఆహ్వానించారు. కానీ వారు చర్చించడానికి అంగీకరించలేదు. ఆ సందర్భంలోనే దాడి జరిగింది.

గాంధీజీ ముని మనవడు తుషార్ గాంధీ, తన పుస్తకం 'గాంధీని చంపేద్దాం'లో ఈ సంఘటనను ప్రస్తావించారు. ప్రార్థన సమయంలో నాథురాం గాడ్సే నెహ్రూ కుర్తా వేసుకుని కత్తి పట్టుకుని గాంధీజీ వైపుకు గబాగబా పరుగులు పెట్టాడు. అతన్ని భిలారే గురూజీ, మణిశంకర్ పురోహిత్లు బంధించారు. గాడ్సేతో కలిసి వచ్చిన ఇద్దరు యువకులు పారిపోయారు.

ఈ విషయాన్నే భిలారే గురూజీ చాలా సార్లు ప్రస్తావించారు. చాలా చోట్ల దీని గురించి రాశారు కూడా. "గాంధీజీ ప్రార్థన సమావేశానికి అందరు ఆహ్వానితులే. ఆ రోజు అతను సహచరులు, ఉషా మెహతా ప్యారేలాల్, అరుణ అసఫలీ, మొదలైన వారు వచ్చారు. గాడ్సే కత్తి పట్టుకుని పరిగెత్తుకుంటూ గాంధీ వద్దకు వెళ్లారు. గాంధీని కొన్ని ప్రశ్నలు అడగాలనుకుంటున్నట్టు చెప్పారు. నేనతనికి ఆపాను. అతని చేయి మెలేసి, కత్తిని స్వాధీనపరచుకున్నాను. కానీ గాంధీ అతనిని లోపలి అనుమతించారు."

ఈ సంఘటనను గురించి ఎన్.డి పాటిల్ రాస్తూ, "గురూజీ గాంధీజీని రక్షించిన వార్త సతారా అంతటా దావానలంలా పాకింది. మాలాంటి విద్యార్థులమంతా సైకిళ్ళు వేసుకుని గురూజీని కలవడానికి బయలుదేరాము. అతను మాకు ఒక ఆదర్శమూర్తిగా అనిపించారు. చాలా సాధారణమైన జీవితాన్ని గడిపేవారు. గాంధీ సూత్రాలను తుచతప్పకుండ పాటించేవారు అని రాశారు".

అయితే ఈ ఉదంతం ఇప్పుడు అంతగా ప్రచారంలో లేదు. అయితే గాంధీజీపై నాథురాం గాడ్సే గానీ అతని మిత్ర బృందంగానీ ఎందుకు దాడికి దిగిందో ఇప్పటికి ప్రశ్నగానే మిగిలిపోయింది.

**4**

మహాత్మా గాంధీని నాథురాం గాడ్సే హత్యచేయడానికి ముందు అతనిపై 5 హత్యా ప్రయత్నాలు జరిగాయన్న విషయం చాలామందికి తెలియదు. నిజానికి పంచగనిలో జరిగింది మొదటి హత్యా ప్రయత్నం కాదు. మొదటిసారి జరిగింది పూనాలో, 1934 జూన్ 25వ తేదీ కార్పొరేషన్ ఆడిటోరియంకి ఒక ప్రసంగం ఇవ్వడానికి వెళుతుండగా. అప్పుడు కస్తూరిబా గాంధీ ఆయన వెంట ఉన్నారు. ఆనాడు అనుకోకుండా గాంధీ ప్రయాణం చేస్తున్న కారుకి ఏదో లోపం వచ్చి ఆగింది. అతనితో వెళ్లాల్సిన కార్లు వరుసగా ముందుగా సభాస్థలికి చేరాయి. దానితో బాంబు దాడి నుంచి బాపు తప్పించుకోగలిగారు. కొంతమంది పోలీసులు, సాధారణ ప్రజలు బాంబు దాడిలో గాయాలపాలయ్యారు. పంచగనిలో జరిగింది రెండో ప్రయత్నం. మూడో ప్రయత్నం గాంధీ 1944 సెప్టెంబర్‌లో జిన్నాతో చర్చలకు వెళ్లిన సందర్భంలో జరిగింది. గాంధీ జిన్నాతో చర్చలు జరపడానికి ముంబై వెళ్లడానికి సేవాగ్రాం నుండి బయలుదేరుతుండగా, నాథురాం గాడ్సే నాయకత్వంలో కొంత మంది హిందూ మూఢ భక్తులు అతనిని అడ్డగించే ప్రయత్నం చేశారు. అప్పుడు కూడా నాథురాం గాడ్సే అధీనంలో ఒక కత్తి దొరికింది. నాలుగో ప్రయత్నం 1946లో జరిగింది. పూణెకి గాంధీజీని తీసుకుని వెళుతున్న రైలు నీరులా, కర్జాత్ మధ్య ఆక్సిడెంట్‌కి గురయ్యింది. రైలును పట్టాలు తప్పించడానికి అడ్డు పెట్టారని డ్రైవర్ తెలియచేశాడు. 1948 జనవరి 20వ తేదీ జరిగిన హత్యాయత్నంలో మదన్ లాల్ పహ్వా, శంకర్ కిస్తయ్యా, దిగంబర్ బడే, విష్ణు కర్కరే, గోపాల్ గాడ్సే, నాథురాం గాడ్సే, నారాయణ్ ఆప్టే ఉన్నారు. వారు గాంధీని, హుస్సేన్ షహీద్ సుహ్రావార్దిలపై దాడి చేయాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నం గనక విఫలమైతే మరో ప్రయత్నంగా, మదన్ లాల్ పహ్వా, గాంధీ నివసించే బిర్లా భవనం పోడియం వెనక ఉన్న గోడపై బాంబును గుడ్డతో చుట్టి పెట్టారు. ఆ బాంబు పేలింది. మదన్ లాల్ పట్టుబడ్డారు. గాంధీని చంపమని

ఆదేశాలతో ఆయుధాలు అందిచ్చిన మిగిలిన సభ్యులు భయపడి పారిపోయారు.

చివరి ప్రయత్నం 1948 జనవరి 30వ తేదీ, సాయంత్రం 5 గంటల. 17 నిముషాలకి జరిగింది. నాథురాం గాడ్సే గాంధీ దగ్గరికివచ్చి కాల్చిచంపారు. ఈ కుట్రలో భాగస్వాము లందరిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. ఇదంతా ప్రసార మాధ్యమాలను ఆకర్షించింది నాథురాం గాడ్సే, నారాయణ్ ఆప్టేలకి మరణ శిక్ష విధించబడింది. మిగిలిన వారికి జైలుశిక్ష పడింది. కానీ సావర్కర్‌ని మాత్రం సాక్ష్యాలు లేవని విడుదల చేశారు.

“చివరి ప్రయత్నం 1948 జనవరి 30వ తేదీ, సాయంత్రం 5 గంటల. 17 నిముషాలకి జరిగింది. నాథురాం గాడ్సే గాంధీ దగ్గరికివచ్చి కాల్చిచంపారు. ఈ కుట్రలో భాగస్వాము లందరిని పట్టుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. ఇదంతా ప్రసార మాధ్య మాలను ఆకర్షించింది నాథురాం గాడ్సే, నారాయణ్ ఆప్టేలకి మరణ శిక్ష విధించబడింది. మిగిలిన వారికి జైలుశిక్ష పడింది. కానీ సావర్కర్‌ని మాత్రం సాక్ష్యాలు లేవని విడుదల చేశారు.”

### 5. గాంధీని చంపిన హంతకుడు వారి నేరాన్ని ఎలా హేతుబద్ధమైనదిగా చూపగలిగారు?

గాంధీ ముస్లింలకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చే ఆలోచనను సమర్థించారు. అందువల్ల పాకిస్తాన్ ఏర్పడడానికి కారణం అతడే. ముస్లింలు యుద్ధానికి కాలు దువ్వడానికి కారణం గాంధీ వారిని బుజ్జగించడమే. మతసహనం పాటించడానికి, అందుకు జీవితాంతం కట్టుబడి ఉండడానికి హిందుత్వ వాదులు పూర్తిగా వ్యతిరేకం. హిందూ ఆధిపత్యం ఉండాలన్నది, ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ సభ్యులవాదన. హిందుత్వ శక్తుల ఆలోచనలలో దేశమంటే ఒక మతపరమైన, మతానికి సంబంధించిన కట్టుబాటు. గాంధీకి సంబంధించినంతవరకు భౌగోళిక సరిహద్దులు. అందులో రకరకాల మతాల, జాతుల వారు కలిసి జీవిస్తారు. గాంధీజీపై 14 ఏళ్ల కాల వ్యవధిలో జరిగిన హత్యయత్నాలను పరిశీలిస్తే – 1934– 1948 –, అతనిని హత్య చేయాలన్న ఆలోచన చివరి ప్రయత్నానికి చాలాకాలం ముందు నుండి ప్రారంభమైందని తెలుస్తున్నది.



హత్యకు గురైన మహాత్ముడు. ఇన్‌సెట్‌లో హంతకుడు నాథూరామ్ గాడ్సే

గాంధీని తప్పనిసరిగా హత్య చేయాలని 1930లలోనే నిర్ణయించడం మనం నమ్మగలమా? ఎందుకంటే అప్పటికి బ్రిటిష్ వారి నుండి స్వాతంత్ర్యం సంపాదించడం కోసం అనేక రకాల పోరాటాలు జరుగుతున్నాయి. ఒక్క కాంగ్రెస్ మాత్రమే కాదు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు కూడా ఈ పోరాటాలు చేస్తున్నారు. అంబేద్కర్ – పెరియార్ – మంగే రామ్ – అచ్యుతానంద – వంటివారు సామాజిక విముక్తి కోసం అనేక రకాల పోరాటాలు లేవదీస్తున్నారు. హిందుత్వశక్తులు వీటన్నిటికీ చాలా దూరంగా ఉన్నారు. వారు హిందుత్వ సంఘాలు నిర్మించుకోడంలో, గాంధీని హతమార్చే ప్రయత్నాలు చేయడంలో బిజీగా ఉన్నారు.

స్వాతంత్ర్య పోరాటకాలంలో, కాలం గడుస్తున్న కొద్దీ, బహుశా గాంధీగారి సామరస్య సహజీవనం ప్రతిపాదనకి ప్రాచుర్యం వచ్చి ఉంటుంది. హిందుత్వ శక్తులు ప్రతిపాదించిన హిందూత్వ ఆధిపత్యం గాంధీ బతికుండగా సాధ్యపడదని భావించి ఉంటారు. అందుకనే ఏదో ఒక తీవ్రమైన చర్య తీసుకోవాలని నిర్ణయించుకుని ఉంటారు. వారి లక్ష్యం గాంధీ. ఎందుకంటే అతడో తిరుగులేని నాయకుడిగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమంలో ఎదిగారు. పైగా అతను ఉపన్యాసాలలో, ప్రచారాలలో మతసహనాన్ని గురించి వాడే భాష. అతని ప్రత్యర్థులు గాంధీ బతికి ఉన్నన్ని రోజులు హిందూ రాష్ట్ర సాధన అనే వారి కల ఏ మాత్రం ముందుకు సాగదని నమ్మారు.

గాంధీపై వారి పోరాటం రెండు స్థాయిలలో ఉందని తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. మొదటిది, జాతి అనే ఆలోచన – గాంధీకి హిందూయిజం అంటే,' సర్వ ధర్మ సంభవం', కానీ హిందుత్వ శక్తులకు దాని అర్థం పూర్తిగా వ్యతిరేకం.

1930లలో ఎందరో దేశభక్తులు ప్రాణత్యాగాలు చేశారు. ప్రధానంగా – భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ప్రాణత్యాగం చేసిన 1931, మార్చి 23వ తేదీ. ఆ కోపం బాధ ప్రజలలో నిండి ఉంది. ప్రజలలో స్వతంత్రం పొందాలన్న వాంఛ బలంగా ఉంది. కరాచీ కాంగ్రెస్ మహాసభ ప్రజల్లో ఉన్న ఈ కోరిక ప్రతిబింబించింది. అందుకే స్వరాజ్య ఆలోచన ముందుకొచ్చింది. కాంగ్రెస్ అతిరథ మహారథులందరూ పాల్గొని, సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన జరిగిన కరాచీ కాంగ్రెస్, రాజ్యం మతపరంగా తటస్థంగా ఉండాలని తీర్మానించింది. ఈ మహాసభ గురించి తీస్తా సెతెల్వాడ్ ఇలా రాశారు: “ఈ కాంగ్రెస్ మహాసభ భారతదేశం

**"కానీ గోపాల్ గాడ్సే 'మహాత్మా గాంధీని నేనెందుకు చంపాను' అనే పుస్తకంలో గాడ్సే స్పష్టంగా. 'అతడు (నాథురాం) ఆర్ఎస్ఎస్‌ని వదిలిపెట్టినట్టు చెప్పాడు. ఎందుకంటే గాంధీ హత్య జరిగిన తర్వాత, గోల్వాల్కర్, ఆర్ఎస్ఎస్ పీకల్లోతు కష్టాలలో మునిగిపోయారు. కానీ నిజానికి అతను ఆర్ఎస్ఎస్‌ని విడిచిపోలేదు.'"**

అనుసరించవలసిన ప్రాథమిక హక్కులు, ఆర్థిక విధానాలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన తీర్మానాలు చేసింది. మొట్టమొదటిసారిగా భారతదేశ సామాన్య పౌరుడి, స్వరాజ్యానికి అర్థాన్ని నిర్వచించింది. ఆ తీర్మానంలోని కొన్ని ముఖ్యాంశాలు – ప్రాథమిక పౌరహక్కులు, వాక్ స్వతంత్రం, భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘటితమయ్యే స్వేచ్ఛ, చట్టం ముందు సమానత్వం, సార్వజనీన ఓటుహక్కు ప్రాథమిక నిర్బంధ విద్య, పనులలో, కౌలులో భారీ తగ్గింపులు, కార్మికులకు మెరుగైన జీవన పరిస్థితులు... దేశంలో అమలవుతున్న అంటరానితనంపై చట్టపరమైన చర్యలు..." మొదలైనవి. ఈ సూత్రాలనే ఆ తరువాత రాజ్యాంగంలో చేర్చారు.

తీస్తాసేతెల్వాద్ ఇంకా ఇలా రాశారు: "మత సామరస్యం కాంగ్రెస్ పార్టీ నిర్మాణాత్మక కార్యక్రమంలో కేంద్ర బిందువుగా ఉండేది. ముస్లిం మేధావులను కాంగ్రెస్ నాయకత్వంలో ఇముడ్చుకునే ప్రయత్నాలు జరిగాయి. ఆ సమయంలో ముస్లిం, హిందూ మత శక్తులు ఒకరికి ఒకరు వ్యతిరేకించుకుంటూ, వెనక్కి నెట్టుకుంటూ వారి సంకుచిత, విద్వేష మతతత్వ అజెండాని ముందుకుతెచ్చారు."

సావర్కర్, గోల్వాల్కర్ 'జాతీయతను' గురించి రాసిన ఉటంకింపులు తెలియచేస్తూ, బద్రి రైనా, కూడా ఇదే నిర్ధారణకు వచ్చారు. ఆయన ఇలా రాశారు: "గాంధీజీ అడ్డు తొలగించుకోవడం హిందూ/ ఫాసిస్టు శక్తులకు 'జాతి' అవసరంగా మారింది. హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ ఒక వైపు ఉంటే కాంగ్రెస్ మరోవైపు ఉంది. సావర్కర్, గోల్వాల్కర్ జాతీయతను ఎలా నిర్వచించారో చూద్దాం. 'సావర్కర్ : భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభ దినాలలోనే, కాంగ్రెస్‌లో ఉన్న హిందువులు చేసిన నిజమైన నేరం, ఇప్పటికి చేస్తున్న నేరం, భారత దేశాన్ని ఒక భౌగోళిక స్వరూపంగా చూడడం. హిందూజాతి జీవం దాని అభివృద్ధిని చంపేయడం. మనం హిందువులుగా ఒక రాజ్యాంగా ఉండడానికి కారణం – మన మతం, జాతి, సంస్కృతి, చారిత్రక బంధాలు, సంబంధాలు. ఇవే మనలనందరినీ ఒక దేశంగా బంధించి ఉంచాయి. గోల్వాల్కర్: 'ప్రజలు జాతీయ జీవితాన్ని పొందగలుగుతామని భావిస్తున్నారు. భూమ్మీద, ప్రజలందరూ, ఐక్యంగా, సాధారణ 'జాతి వేదికగా, 'రాజ్యాంగం ద్వారా' స్వేచ్ఛగా 'ఒక దేశంలో నివసిస్తుంటారు. ప్రజాస్వామ్యమంటే బలమైన తప్పుడు అభిప్రాయాలు ఏర్పడడం వల్ల, మనకు మనమే మన పూర్వీకులపై దాడులు జరిపిన వారు, శత్రువులు భారతీయులనే పెట్టిన పేరుతో చూసుకోవడం వల్ల, మనం అందరం ఒక జాతి అని భావిస్తున్నాం. ఈ విషం విరజిమ్మిన ఫలితం మనకు కనపడుతూనే ఉంది. మన స్వహస్తాలతో మన జాతిని కించపరచుకుంటున్నాం. "ఈ జాతికి సంబంధించని వారందరూ, అంటే హిందూ జాతి, మతం, సంస్కృతి, భాషకి సంబంధించని వారు సహజంగానే నిజమైన 'జాతి'గా ఇక్కడ జీవించలేరు. మళ్ళీ ఒకసారి చెప్తున్నాను : హిందూస్థాన్, హిందువుల భూమి. ఇక్కడ బతికే వారు హిందూ దేశస్థులు గానే బతకాలి. ఆధునిక ప్రపంచంలో దేశమంటే ఉండే శాస్త్రీయ దృక్పథానికి అనుగుణంగా, తప్పనిసరిగా పాటించవలసిన 5 అత్యంత ప్రధానమైన అంశాలు, ఇక్కడున్న వారందరూ కలిగి ఉండాలి.'' అంటే, సావర్కర్, గోల్వాల్కర్, దేవరస్‌ల ఆలోచనలు, ఈనాటి 'సాంస్కృతిక జాతీయవాదం' – దేశం అంటే భౌగోళిక అంచులు గల ప్రాంతం కాదు, జాతి, మతంతో ఏర్పడినది అనే భావన. ఇది గాంధీజీ అభిప్రాయానికి పూర్తిగా భిన్నమైనది. అంటే, గాంధీజీ తప్పంతా, 'స్వరాజ్యం, హిందూ ముస్లింల ఐక్యత లేనిదే సాధ్యం కాదని చెప్పడం'.

**6**

నాథురాం గాడ్సేకి ఆర్ఎస్ఎస్‌కి ఉన్న సంబంధం ఇప్పటికీ తేలలేదు. నిజానికి మహాత్మా గాంధీహత్యకీ సంబంధించిన ఏ విషయం చర్చకు వచ్చినా చివరికి అది ఆగేది ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు గాడ్సే, అతని సహచరుల గురించిన వారి ప్రకటనల దగ్గరే. వారిరువురితో తమకు ఎటువంటి సంబంధాలు లేవని చెప్పడానికి – కనీసం హత్య జరిగిన సమయంలో – గట్టి ప్రయత్నాలు చేస్తుండడం స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. ఎల్.కె అద్వానీ గారి ప్రకటననే చూడండి. 'నాథురాం ఆర్ఎస్ఎస్‌ని తీవ్రంగా విమర్శించేవాడు. ఆర్ఎస్ఎస్ హిందువులను అసమర్థులుగా చేసిందనేది అతని వాదన. మాకు గాడ్సేతో ఏ సంబంధం లేదు. ఇతర విషయాలు ఏవీ లేనప్పుడు కాంగ్రెస్‌కి ఈ విషయాన్ని బయటికి లాగుతుండడం అలవాటయింది.'

కానీ గోపాల్ గాడ్సే 'మహాత్మా గాంధీని నేనెందుకు చంపాను' అనే పుస్తకంలో గాడ్సే స్పష్టంగా. 'అతడు (నాథురాం) ఆర్ఎస్ఎస్‌ని వదిలిపెట్టినట్టు చెప్పాడు. ఎందుకంటే గాంధీ హత్య జరిగిన తర్వాత, గోల్వాల్కర్, ఆర్ఎస్ఎస్ పీకల్లోతు కష్టాలలో మునిగిపోయారు. కానీ నిజానికి అతను ఆర్ఎస్ఎస్‌ని విడిచిపోలేదు.'

హత్య జరిగినప్పుడు నాథురాం ఆర్ఎస్ఎస్ సభ్యుడుగా లేదు అని అద్వానీ అనడం 'పిరికితనం' అని గోపాల్ గాడ్సే అదే పుస్తకంలో అన్నారు. ఫ్రంట్ లైన్‌కి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ప్రశ్నలకు ఆయన ఇలా సమాధానాలు చెప్పారు.

**ప్ర : మీరు ఆర్ఎస్ఎస్‌లో భాగస్వాములా?**

జ : మా అన్నదమ్ములందరం ఆర్ఎస్ఎస్‌లోనే ఉండేవారం. నాథురాం, దత్తాత్రేయ, నేను, గోవింద్. మేము నిజానికి మా ఇంట్లోకన్నా ఆర్ఎస్ఎస్ ఆఫీస్‌లోనే ఎక్కువగా పెరిగాం. అదే మా కుటుంబం.

**ప్ర : నాథురాం ఆర్ఎస్ఎస్ లోనే ఉన్నారా? ఆర్ఎస్ఎస్‌ని వదిలేయలేదా?**

జ: నాథురాం ఆర్ఎస్ఎస్‌లో కార్యవాహకుడు (మేధోపరమైన కార్యక్రమాలు నిర్వహించేవాడు) అయ్యారు. అతను ఆర్ఎస్ఎస్ ని విడిచిపెట్టానని ప్రకటించాడు.

కారణం గాంధీ హత్య జరిగిన తరువాత గోల్వాల్కర్, ఆర్ఎస్ఎస్ చిక్కుల్లోపడ్డారు. కానీ అతను ఆర్ఎస్ఎస్ ని విడిచిపెట్టలేదు.

**ప్ర: ఈ మధ్యనే అద్వాని గారు నాథురాంకి తమకి ఎటువంటి సంబంధం లేదన్నారు కదా!**

జ: నేను అతనిని వ్యతిరేకిస్తున్నాను. అది పిరికితనం. 'మీరు వెళ్లి గాంధీని చంపండని ఆర్ఎస్ఎస్ తీర్మానం చేయలేదు' అని అనవచ్చు. కానీ మీరు నాథురాంని వదిలించుకోకూడదు. హిందూ మహాసభ అతనిని వదిలించుకోలేదు. 1944లో ఆర్ఎస్ఎస్ బౌదిక్ కార్యవాహక్‌గా ఉన్నప్పటి నుండి హిందూ మహాసభలో పనిచేయడం మొదలుపెట్టారు.

తన తమ్ముడు, నాథురాంని ఉరితీయడానికి కొన్ని గంటల ముందు జరిగిన సంఘటనల గురించి చర్చిస్తూ, ఉరికంబం ఎక్కే ముందు తాను మాతృభూమి పట్ల విధేయతను ప్రదర్శించే కొన్ని పద్య పంక్తులు చదివాడు. 'నమస్తే సదావత్సలే మాతృభూమి, త్వయ హిందుభూమి సుఖంవర్ధితే హమ్, మహామంగళే పుణ్య భూమి త్వ దర్థే, పటివేశ్ కాన్యా నమస్తే నమస్తే.

ఆర్ఎస్ఎస్ దినచర్యలు తెలిసినవారెవరైనా ఈ పద్యం ఆర్ఎస్ఎస్ శాఖలో ప్రతి దినం పాడే పద్యమని ఇట్టె గ్రహిస్తారు.

గాంధీ హత్య కేసులో కోర్టు ముందు సాక్ష్యం చెప్పే సమయంలో నాథురాం తనకు ఆర్ఎస్ఎస్, సావర్కర్‌లతో ఎటువంటి సంబంధాలు లేవని చెప్పడం వేరే విషయం. నాథురాం ఈ విషయాన్ని స్పృహతోనే చెప్పాడు. కానీ ప్రాచీన దస్తావేజులు తిరగేస్తే, 1935 నుండి ఆర్ఎస్ఎస్‌కి, సావర్కర్‌కి నాథురాంతో దగ్గరి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది. నాథురాం అతని సహనిందితుడు సావర్కర్‌కి నేరంలో కీలక పాత్ర పోషించినా, వ్యూహాత్మకంగా మెలిగి, శిక్ష పడకుండా కాపాడారు అనడంలో సందేహం లేదు.

నిజానికి మొదట విచారణ జరిపేటప్పుడు, జడ్జి ఆత్మ చరణ్ ఎనిమిది మంది నిందితులపై చార్జిషీట్ పెట్టారు. వారంతా గాంధీ హత్యచేయడంలో కుమ్మక్కు అయినట్టు అభియోగంమోపబడింది. మిగిలిన అందరు నిందితుల విషయంలో ఆయన అందరినీ ఒప్పించారుగాని, ఆశ్చర్యంగా సావర్కర్ విషయంలో సాంకేతిక కారణాలు చూపి వదిలి వేశారు అతనిపై నేరారోపణను ధృవీకరించడానికి ఆధారాలు లేవని విడుదల చేయడం జరిగింది.

**❝ నిజానికి మొదట విచారణ జరిపేటప్పుడు, జడ్జి ఆత్మ చరణ్ ఎనిమిది మంది నిందితులపై చార్జిషీట్ పెట్టారు. వారంతా గాంధీ హత్యచేయడంలో కుమ్మక్కు అయినట్టు అభియోగం మోప బడింది. మిగిలిన అందరు నిందితుల విషయంలో ఆయన అందరినీ ఒప్పించారుగాని, ఆశ్చర్యంగా సావర్కర్ విషయంలో సాంకేతిక కారణాలు చూపి వదిలి వేశారు అతనిపై నేరారోపణను ధృవీకరించడానికి ఆధారాలు లేవని విడుదల చేయడం జరిగింది. ❞**

బాగ్డే హిందూ మహాసభ కార్యకర్త. అతడే, నాథురాంకి మదన్‌లాల్‌కి తుపాకీ పత్తిని సరఫరా చేశాడు. గాంధీ హత్య కుట్రలో సావర్కర్ జోక్యానికి సంబంధించిన అనేక ఆసక్తికరమైన వాస్తవాలు ఇతనే కోర్టుకు వెల్లడించాడు. బాగ్డే హత్య చేయడానికి ప్రేరణ ఏమిటన్న పోలీసుల ప్రశ్నకు, "ఆప్టే నన్ను తనతో ఢిల్లీకి వస్తావా అని అడిగాడు. ఎందుకు వెళుతున్నారని నేను అడిగితే, తాత్యారావ్ (సావర్కర్) గాంధీజీని, నెహ్రూని, సుహ్రావార్ధిలను హత్య చేయాలని నిర్ణయించారని, ఆ పనిని తమకు అప్పగించారని చెప్పాడు."

"నన్ను కిందనే ఉండమన్నారు... వీళ్లిద్దరు అంటే, ఆప్టే, గాడ్సేపైకి వెళ్లారు. సావర్కర్ దర్శనం చేసుకున్నారు. పది పదిహేను నిముషాల తరువాత ఇద్దరు బయటికి వచ్చారు. వాళ్ళు కిందికి దిగుతుండగా సావర్కర్ వారి వెంట మెట్లు దిగారు. 'విజయం వరించుగాక' అని అన్నారు. సావర్కర్ నుండి సెలవు తీసుకున్న ఆప్టే, బాగ్డే 'తాత్యా రావ్, గాంధీకి నూరేళ్లు నిండాయని జోస్యం చెప్పారని' అన్నారు. బొంబాయి ప్రెసిడెన్సీ డిసిపి, జంషెడ్ నాగర్వాల్‌ని, అప్పటి బొంబాయి ప్రాంత గృహమంత్రి మొరార్జీ దేశాయ్, బాంబు పేలుళ్ల తరువాత సావర్కర్ ఇంటి మీద నిఘా పెట్టాలని అడిగారు. అందుకు కారణం లేకపోలేదు. మదన్ లాల్ పహ్వా, నిందితుడుగా ఉన్న జనవరి 20 బాంబు పేలుడు ఘటనలో వచ్చిన నేర పరిశోధన నివేదికలో," అందుబాటులోకి వచ్చిన ఆధారాల ప్రకారం, సావర్కర్ ప్రత్యక్షంగా మహాత్మా గాంధీ హత్యకు పురికొల్పినట్టు, కుట్రపన్నినట్టు ఆధారాలు ఉన్నాయి. అతను జబ్బుపడినట్టు, రాజకీయాల నుండి వైదొలగినట్టు చెప్పడం పూర్తిగా కట్టుకథే. అందువలనే అతని ఇంటికి నిఘా పెట్టాలని ఉన్నట్టు తెలిపారు.

అయితే దీనిపై మొరార్జిని స్పందించమని కోరగా, భిన్నంగా మాట్లాడారు. "నేను నా కారణాలు చెప్తాను. నేను సమాధానం చెప్పాలా వద్ద అన్నది సావర్కర్ నిర్ణయించాలి. నేను నా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను". వెంటనే సావర్కర్ న్యాయవాది, తాను ప్రశ్నని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించారు.

గాంధీజీ చనిపోయిన 16 సంవత్సరాల తరువాత ప్రజాగ్రహం మరో కమిషన్ చేత విచారింపచేసింది. ఏదైనా కుట్ర కోణం ఉన్నదా, లేదా ఎవరైనా తమ బాధ్యత సరిగా నిర్వర్తించలేదా అనే విషయం పరిశోధించాలని ఆదేశించడం జరిగింది. నేరస్థులు తమ శిక్షా కాలాన్ని పూర్తిచేసుకుని విడుదల అవుతున్న సందర్భంగా జరుపుకుంటున్న ఉత్సవాల నేపథ్యంలో బహిరంగ సభ జరిగింది. అందులో కొంతమంది తమకు అసలైన హంతకుడెవరో తెలుసని చెప్పారు. దానివల్ల పార్లమెంటులో 29 మంది పార్లమెంటు సభ్యులు, అప్పటి గృహ మంత్రి గుల్జారీ లాల్ నందాని పరిశోధించడానికి ఒక కమిషన్ వేయాలని కోరగా, జీవన్ లాల్ కపూర్, అనే రిటైర్ అయిన సుప్రీం కోర్టు జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరపడానికి ఒక కమిషన్ వేశారు. ఆ కమిషన్ చాలాకాలం పరిశోధన చేసి, 'సావర్కర్ గాంధీ కుట్ర కేసులో కీలక నిందితుడు' అని తేల్చింది. "వాస్తవాలన్నిటిని పరిగణనలోనికి తీసుకుంటే, హత్య చేయాలనే కుట్రకు సావర్కర్ అతని సమూహం తప్ప వేరేవారు కారణం కాదని స్పష్టంగా తెలుస్తున్నది" అని నివేదించింది.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# ఏది అసలైన భారతీయ సంస్కృతి?



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

పిబి చారి

ఏది అసలైన భారతీయ సంస్కృతి? ఈ విషయం తెలియాలంటే మనం వేద కాలం నుండి వివిధ సంస్కృతులు వాటి గుణవిశేషాలు, అవి సమాజాన్ని ఏ వైపుకు ఎలా ప్రభావితం చేశాయి అన్నది తెలుసుకోవాలి. ఆయా సంస్కృతులు అసమానతలు లేని సమాజం వైపు నడిపించాయ లేక సమానత్వం లేని, మనిషిని మనిషిగా గుర్తించని మూర్ఖత్వం వైపు నడిపించాయా. లేక శాస్త్రీయంగా, కాస్తంత సమాజ అభివృద్ధికి దోహదం చేశాయ లేక మూఢత్వంలో ఈ విషయం ముంచే ప్రయత్నమే చేశాయా అన్నది వివిధ సంస్కృతులను పరామర్శిస్తే ఏది అసలైన భారతీయ సంస్కృతి అన్నది అర్థమవుతుంది.

వేదకాలం నాటి సంస్కృతి ప్రధానంగా యజ్ఞసంస్కృతి. వీర్యవంతులైన పుత్రులను, ఆహారాన్ని, గోవులను, యుద్ధాల్లో విజయం చేకూర్చమని వైదిక రుషులు దేవుళ్ళు అయిన ఇంద్రుడిని, వరుణుడిని, సవితా సావిత్రులను, సూర్యుని, అలాగే ప్రకృతిలో ఉన్న కొండలు కోనలు నదులు పర్వతాలు అరణ్యాలకు మానవీయ రూపకల్పన చేసుకొని ఆరాధించారు. యజ్ఞ క్రతువులలో పశువులను బలి ఇచ్చేవారు. గోవులు, ఎద్దులు, గుర్రాలు, గొర్రె, మేక ఒకటేమిటి అన్నిరకాల పశువులను బలిపశువులుగా మార్చి హోమగుండంలో కాల్చుకొని, వారి దేవుడైన ఇంద్రుడికి హవనం (నైవేద్యం) పెట్టి తినే వారు. వేద ఋషులు నిస్సంకోచంగా గోవులను చంపి మాంసాన్ని ఆరగించే వాళ్లు. వీరి సంస్కృతి పశు బలుల సంస్కృతి. మన దేశానికి బయటనుంచి వచ్చిన ఈ ఆర్యులు, ఆర్య ఋషులు ఇక్కడ ఉన్న స్థానికులపై అనేక యుద్ధాలు చేశారు. స్థానికుడైన శంబరుడు అతని సైన్యంతో భరద్వాజ ఋషి పురోహిత్యంలో దివోదాసు అనే నాయకుడి నాయకత్వంలో 40 ఏళ్లు యుద్ధం చేసి ఇ శంబరుడిని వధించినట్లు ఋగ్వేదం వర్ణిస్తుంది. శంబరుడికి ఉన్న నూరు పురములలో 99ని ధ్వంసం చేసి మిగిలిన ఒక్క పురాన్ని దివోదాసునకు ఇంద్రుడు ఇచ్చినట్లుగా ఋగ్వేదం వర్ణించింది. ఈ ఆర్యుల, ఆర్య రుషులది మరో సంస్కృతి యుద్ధ సంస్కృతి.

యజ్ఞాలలో పశువులను బలి ఇవ్వడం వల్ల ముఖ్యంగా గోవులను, ఎద్దులను వధించచటం వలన వ్యవసాయం చేసే వ్యవసాయ కులకు వ్యవసాయంలో ఉపయోగపడే పశువుల కొరత ఏర్పడింది. దానితో ఈ పశు బలుల, యజ్ఞసంస్కృతికి వ్యతిరేకంగా వ్యవసాయ కులు తిరగబడ్డారు. యజ్ఞ గుండాలను ధ్వంసం చేశారు. ఇలా ధ్వంసం చేసిన వ్యవసాయకులను వేద ఋషులు వారిని రాక్షసుల అని పేరు పెట్టి ప్రచారం చేశారు. బలి ఇవ్వబడిన పశువుల మాంసం ఎంతో కాలం నిల్వ ఉండదు. అవి పశువులను వ్యవసాయంలో వినియోగిస్తే నిల్వ ఉండే తృణధాన్యాలను పండిస్తే, ఆ సమాజంలోని అనేక రెట్ల మందికి ఆహారాన్ని అంది వ్వవచ్చు. అందువల్లనే యజ్ఞ సంస్కృతికి వ్యతిరేకంగా, పశువుల బలికి వ్యతిరేకంగా వ్యవసాయకులు తిరగబడ్డ వలసి వచ్చింది. ఆ తిరుగుబాటు అహింస సిద్ధాంతానికి దారితీసింది. ఆనాడు వ్యవసాయాన్ని ప్రోత్సహించింది ప్రధానంగా క్షత్రియులు. దాని చరిత్రకు సాక్షి గౌతమ బుద్ధుడు. బుద్ధుడు యజ్ఞయాగాలును తీవ్రంగా వ్యతిరేకించాడు. అందులో చేస్తున్నబలులకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. అహింస ఒక తాత్విక సిద్ధాంతంగా ప్రతిపాదించాడు. వ్యవసాయం అభివృద్ధి అయ్యేకొద్దీ, యజ్ఞ క్రతువులను వ్యతిరేకించే కొద్దీ, బుద్ధుని తాత్విక సిద్ధాంతమైన అహింస ఆ సమాజాన్ని అమితంగా ప్రభావితం చేసింది. వ్యవసాయ అభివృద్ధికి ఆటంకంగా మారిన వైదిక రుషుల పశు బలుల సంస్కృతిని బుద్ధుని అహింసా సిద్ధాంతం సంపూర్ణంగా కాకపోయినా నిరోధించగలిగింది. ఈ పరిణాత్మకమైన మార్పు సమాజంలో గుణాత్మక మార్పుకు దారి తీసింది. ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు, వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేసింది. బుద్ధుని అహింసా సిద్ధాంతం మెరుగైన సమాజ అభివృద్ధికి దోహదపడింది. వైదిక రుషుల యజ్ఞసంస్కృతి వెనకపట్టు పట్టింది. అంటే బౌద్ధమతం బుద్ధుడు ప్రవచించిన అహింసా సిద్ధాంతం వ్యవసాయాభివృద్ధికి తోడ్పడింది అన్నమాట. శాకాహారం అయిన తృణధాన్యాలు పండించడం వల్ల అనేక రెట్ల మందికి సమాజంలో ఆహారం అందుబాటులోకి వచ్చింది. ఈ రకమైన యజ్ఞ సంస్కృతి ఇప్పటి ఆధునిక సమాజానికి

అవసరమా అన్నది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. సంఘపరివార్ ప్రబోధించే సనాతన ధర్మము ఇదేనా? ఇలాంటి ధర్మం మనకి కావాలా?

ఋగ్వేదంలోని ఆఖరిదైన పదవ మండలంలో మొదటి సారిగా చాతుర్వర్ణ వ్యవస్థను గురించి ప్రస్తావించబడింది. అప్పటి వరకు అందరూ అన్ని రకాల వృత్తులు చేసుకుని జీవించే పద్ధతికి ఇది తూట్లు పొడిచింది. బ్రహ్మ ముఖమునుండి బ్రాహ్మణులు, వక్షస్థలం నుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, కాళ్ళ నుండి సూద్రులు పుట్టారని వారు చేయవలసిన విధులు కూడా నిర్వచించినది. బ్రాహ్మణులు వేదాధ్యయనం, క్షత్రియులకు (క్షిత్ అంటే రక్షించటం) ప్రజల రక్షణ అంటే పై వర్ణాల రక్షణ, వైశ్యులకు (విశ్ అనే ధాతువు నుండి వచ్చింది వైశ్య) వ్యవసాయం ప్రధాన వృత్తిగా, నాలుగో వర్ణమైన సూద్రులు పై మూడు వర్ణాలకు నిర్బంధంగా సేవ చేయటం అనే విధులను నిర్వచించింది. ఈ కుల వ్యవస్థ మనుస్మృతి కాలానికి లేదా స్మృతుల కాలానికి మహావృక్షమైనది. అనేక ఇతర కులాలను కూడా సృష్టించింది ఈ మనుస్మృతి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను స్వీకరించింది. ఈ కుల వ్యవస్థ ఇప్పటికీ సమాజాన్ని అతలాకుతలం చేస్తూనే ఉన్నది. ఈ కుల వ్యవస్థ అనే బిడ్డకు పురుడు పోసింది వేదాలే. వేదాలే కుల సంస్కృతికి బీజం వేసింది.

కుల వ్యవస్థ పై బుద్ధుడు ప్రతిస్పందించిన తీరు చాలా శాస్త్రీయంగా ఉంటుంది. బ్రహ్మముఖం నుండి బ్రాహ్మణులు పుట్టారని, అందువలన వారే శ్రేష్టులు అని, బ్రహ్మకు దాయాదులని అశ్వలాయనుడు అనేవాడు బుద్ధునితోవాదిస్తాడు. అప్పుడు బుద్ధుడు ఇలా అంటాడు. ఓయి అశ్వలాయనా! బ్రాహ్మణ స్త్రీ కూడా అందరిలాగానే ఋతుమతి అవుతున్నది. గర్భిణీ అగుచున్నది. కనుచున్నది. శిశువుకు పాలిస్తున్నది. ఇదంతా జరుగుతున్నది మనం నిత్యం చూస్తూనే ఉన్నాం కదా. ఇతర కులములలో కూడా శిశువులు జన్మించే పద్ధతి ఇదే కదా! అలా అయినప్పుడు బ్రాహ్మణులు బ్రహ్మదేవుని ముఖం నుండి పుట్టారనుట ప్రకృతి విరుద్ధం కాదా. అని బుద్ధుడు

> **" స్మృతుల కాలానికి కుల వ్యవస్థ మరింతగా ఘనీభవించింది. నాలుగో వర్ణంగా చెప్పబడిన శూద్రుల పరిస్థితి మరింత దిగజారి పోయింది. మనుస్మృతిలో శూద్రుని గురించి మనువుచెప్పిన అభిప్రాయాలు ఒకసారి చూడండి. "భగవంతుడు శూద్రునికి ఒకే వృత్తిని కేటాయించాడు. అది పై మూడు కులాల వారిని వినయంగా సేవించటం (మనుస్మృతి 1.91). సూద్రుడిని కొనుక్కున్నా కొనుక్కో కపోయినా పై కులాల వ్యక్తి అతని చేత దాస్యం చేయించుకోవచ్చు. ఎందుకంటే అతడు (శూద్రుడు) బ్రాహ్మణుడికి ఊడిగం చేయటానికే భగవంతుని చేత సృష్టించబడ్డాడు. "**

ప్రశ్నించాడు. అంటే కృత్రిమంగా సృష్టించిన ఈ కులవ్యవస్థ పుట్టుకను బుద్ధుడుతీవ్రంగా వ్యతిరేకించాడు.

స్మృతుల కాలానికి ఈ కుల వ్యవస్థ మరింతగా ఘనీభవించింది. నాలుగో వర్ణంగా చెప్పబడిన శూద్రుల పరిస్థితి మరింత గాదిగజారి పోయింది. మనుస్మృతిలో శూద్రుని గురించి మనువుచెప్పిన అభిప్రాయాలు ఒకసారి చూడండి. "భగవంతుడు శూద్రునికి ఒకే వృత్తిని కేటాయించాడు. అది పై మూడు కులాల వారిని వినయంగా సేవించటం (మనుస్మృతి 1.91). సూద్రుడిని కొనుక్కున్నా కొనుక్కో కపోయినా పై కులాల వ్యక్తి అతని చేత దాస్యం చేయించుకోవచ్చు. ఎందుకంటే అతడు (శూద్రుడు) బ్రాహ్మణుడికి ఊడిగం చేయటానికే భగవంతుని చేత సృష్టించబడ్డాడు. యజమాని స్వాతంత్రం ఇచ్చినా శూద్రుడు స్వతంత్రుడు కాలేడు. బానిసత్వం అతని సహజ లక్షణం. కాబట్టి అతనికి స్వాతంత్ర్యాన్ని ఎవ్వరు ఇవ్వగలరు? (అదే గ్రంథం 8.413-14). వీలున్నా సరే శూద్రుడు సంపదను సేకరించరాదు. ఎందుకంటే సంపదను సేకరించుకున్న శూద్రుడు బ్రాహ్మణుడికి బాధాకరంగా తయారవుతాడు (అదే మనుస్మృతి 10-129). అతడు (శూద్రుడు) చేతి వృత్తి అనుసరించనివ్వు. ఏ చేతి వృత్తుల్ని అనుసరిస్తే బ్రాహ్మణులకు ఎక్కువ సేవలు లభిస్తుందో వాటిని అనుసరించనివ్వు. (అదే గ్రంథం 10.99-100).

గౌతముని స్మృతి మరి ఇంత భయంకరమైన వివరాలను కలుపుతుంది. అతనికి (శూద్రునికి) నిజాయితీ, వినయం, పవిత్రత నిర్దేశించబడ్డాయి. అతడు అగ్రవర్ణాల వారిని వినయంతో సేవించాలి. తన జీవన భృతిని వారినుండి ఆశ్రయించి పొందాలి. వారు వదిలేసిన పాదరక్షలను, గొడుగులను, బట్టల్ని, చాపల్ని మాత్రమే అతడు ఉపయోగించాలి. వారు అంటే పై వర్ణాలవారు తినగా మిగిలిన ఆహారాన్ని మాత్రమే తినాలి. (గౌతమ స్మృతి 10.51-60).

ఒకవేళ శూద్రుడు కావాలని వేదఘోష వింటే కరిగించిన సీసం గాని లక్కతో గాని అతని చెవులు నింపాలి. అతడు వేదాన్ని ఉచ్చరిస్తే అతని నాలుక తెగ కోయాలి. అతడు వాటిని జ్ఞాపకం వుంచుకుంటే అతని శరీరాన్ని రెండుగా చీల్చలి. కూర్చున్నప్పుడు పడుకున్నప్పుడు, మాట్లాడేటప్పుడు, రహదారి మీద శూద్రుడు బ్రాహ్మణులతో సమానంగా ప్రవర్తిస్తే అతడికి శారీరక దండన ఇవ్వాలి (గౌతమ స్మృతి 12.4-7).

ఇలా స్మృతులు భయంకరమైన వివరాలు ఇస్తూ పోతూ ఉంటాయి. అవి మన దేశానికి ,మనసంస్కృతికి శాశ్వతమైన అవమానం కాదా! ఇదా సంఘ పరివార్ శక్తులు పునఃప్రతిష్టించాలి అనుకుంటున్న సంస్కృతి? ఇదేనా మన భారతీయ సంస్కృతి?. మనువు ఇంకా ఏమంటాడంటే ధర్మ భ్రష్టులతో కుల కట్టును దాటిన వారితో, మిథ్యా చారులతో, స్వతంత్రంగా ఆలోచించే వారితో (హేతువాదుల తో) ఎవరూ మాట్లాడకూడదు. (మనుస్మృతి 4-30). ఇదీ మన స్మృతులుమనకు అందించే సంస్కృతి. శ్రమ చేసేవారు ఆలోచించకూడదు. ఆలోచించే వారు శ్రమ చేయరు. వాస్తవానికి కుల వ్యవస్థ యొక్క అర్థం ఇదే. అందుకే స్మృతులలో బ్రాహ్మణుడు నాగలి తాగకూడదని

> **"బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, శారీరక శ్రమను చాలా నీచంగా చూశాయి. శారీరక శ్రమ చేసే వారిని పందులతో, కుక్కల తో సమానం చేయబడ్డారు (చాందోగ్యోపనిషత్ 5-10-8). దీనర్థం భౌతిక వాస్తవికతను నిరాకరించడం శారీరక శ్రమను, శ్రమ చేసేవాడిని అసహ్యించుకోవడం. స్వతంత్ర ఆలోచనాపరులను దొంగలతో, అబద్దాలకోరు లతో, మోసగాళ్ల తో సమానం అని చెప్పటం ఈ స్మృతులకే చెల్లింది."**

శాసించారు. అంటే శ్రమ పడకూడదు. ఎదుటివారు (సూద్రులు) కష్టపడి సృష్టించిన ఆహారాన్ని సుష్టుగా భోంచేసి ఊకదంపుడు ధర్మపన్నాలు వల్లించడానికే వీరు ఉన్నారన్న మాట.

శాసించారు. అంటే శ్రమ పడకూడదు. ఎదుటివారు (సూద్రులు) కష్టపడి సృష్టించిన ఆహారాన్ని సుష్టుగా భోంచేసి ఊకదంపుడు ధర్మపన్నాలు వల్లించడానికే వీరు ఉన్నారన్న మాట.

బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు, శారీరక శ్రమను చాలా నీచంగా చూశాయి. శారీరక శ్రమ చేసే వారిని పందులతో, కుక్కల తో సమానం చేయబడ్డారు (చాందోగ్యోపనిషత్ 5–10–8). దీనర్థం భౌతిక వాస్తవికతను నిరాకరించడం శారీరక శ్రమను, శ్రమ చేసేవాడిని అసహ్యించుకోవడం. స్వతంత్ర ఆలోచనాపరులను దొంగలతో, అబద్దాలకోరు లతో, మోసగాళ్ల తో సమానం అని చెప్పటం ఈ స్మృతులకే చెల్లింది. స్వతంత్ర ఆలోచనాపరులు వారు వెల్లడించిన అభిప్రాయాలు, సిద్ధాంతాలు సమాజం లో పెను మార్పులకు దారి తీశాయి కనుకనే ఈ శాపనార్థాలు. మనుషులను కాసింత శాస్త్రీయంగా ఆలోచించడానికి తద్వారా సమాజ అభివృద్ధికి ఈ స్వతంత్ర ఆలోచనాపరుల వలన పునాదులు పడ్డాయి కనుకనే ఇన్ని తిట్లు. ఆనాడు స్వతంత్ర ఆలోచనాపరులు స్మృతుల భావజాల సంస్కృతికి వ్యతిరేకంగా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎవరూ !ఈ స్వతంత్ర ఆలోచనాపరులు ఒక్కసారి చూద్దాం.

ఉపనిషత్తులు తప్ప మిగిలిన దార్శనిక చింతనలు అన్ని భౌతికవాద తాత్విక ఆలోచన సరళ్లు లే. కార్యకారణ సంబంధాన్ని వివరించిన వే. కపిలుడి సాంఖ్యం, కణాదుడివైశేషికము, మీ మాంస, లోకాయత ము,, తొలినాళ్ళ బౌద్ధం, జైన మతం అన్నీ కూడా అనుభవ తత్వం, తర్కం మీద ఆధారపడిన నూతనమైన స్వతంత్ర ఆలోచన సరళి యే.

లోకాయత లు ఆత్మను, భగవంతుని, వేద ప్రామాణికతను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. జగత్తు పుట్టుకకు, అభివృద్ధికి, వైవిధ్యానికి మూలకాల స్వభావమే కారణమన్నారు. మరొక రకంగా చెప్పాలంటే ఈ ప్రపంచం ఎలా పుట్టింది అన్న ప్రశ్నకు భగవంతుడు లేకపోవటం చేత, మూలకాల స్వభావం చేత అని సమాధానం చెప్పారు. మూలకాలు ఎవరి చేత సృష్టించబడ్డాయి అన్న ప్రశ్నకు తావే లేదు అన్నారు. లోకేశుఆయుతః లోకాయతః . అంటే లోకంలో వ్యాప్తి చెందిన ప్రజల దృక్పథం. అది ప్రజల తత్వశాస్త్రం. లోకాయత లు ప్రపంచం వాస్తవం అన్నారు. శరీరం, ముక్కు, మొఖం, కాళ్లు చేతులు అందరికీ ఒకేలా గునఉన్నప్పుడు ఈ వర్ణ కుల తారతమ్యాలు ఉండాల్సిన అవసరం ఎందుకు అని ప్రశ్నించారు. నాలుగు లేదా ఐదు మూలకాల సంయోగం వలన ఈ ప్రపంచం ఏర్పడిందని నొక్కి చెప్పారు. నాలుగు మూలకాలు భూమి, నీరు, నిప్పు, గాలి ఐదవది ఆకాశం అన్నారు. చైతన్యం భూతాల నుండి వస్తుంది అని చెప్పారు. (భుతెభ్యాహ చైతన్యం). అని లోకాయత గట్టిగా చెప్పారు. మత్తు పదార్థాలు పుచ్చుకోవటం ద్వారా వచ్చే శక్తి లాంటిదే ఈ చైతన్యం అన్నారు. ఉదాహరణకు సారాయి తయారు చేయడానికి ఉపయోగించే వివిధ పదార్థాలు వేరువేరుగా తీసుకుంటే అవి ఎలాంటి మత్తును కలగచేయవు. కానీ వాటిని కలిపి ఉడకబెట్టి, పులియబెట్టి తాగితే సాధారణ మానవుల్లో లేని ఒక రకమైన చైతన్యము కలగచేస్తాయి. మాదక స్థితిలో ఈ చైతన్యం ఎలా వచ్చింది? అది అది కొన్ని పదార్థాలు, కొన్ని పరిస్థితులలో, కొన్ని పరిమాణంలో కలియటం వల్ల వచ్చింది. అలాగే కొన్నిపదార్థాలు, కొన్ని పరిస్థితులలో కలియటం చేత మామూలు చైతన్యం మాత్రం ఎందుకు ఉద్భవించ కూడదు? అని ప్రశ్నించారు లోకాయతలు.

వ్యవసాయం, పశు పాలన, ఉద్యోగాలు మొదలైన వృత్తులు తెలివైన వారు మాత్రమే చేయగలరు. కానీ ఒళ్లంతా బూడిద పూసుకుని, అగ్నిహోత్రం మొదలైన మత కర్మలను అనుసరించే వారు బుద్ధిహీనులు. కాబట్టి మానవులు అనుభవం మీద ఆధారపడ్డ, వాస్తవిక ప్రయోజనం ఉన్న శాస్త్రాలను, పనులను అనుసరించాలి అన్నారు లోకాయతులు.

నిజమైన బానిసత్వం ఇతరులకు ఊడిగం చేయడం. స్వేచ్ఛాస్వాతంత్ర్యమే నిజమైన మోక్షం. వేరే మోక్షం ఏమి లేదు. మానవ జీవితం చావుతో ఆఖరి అయిపోతుంది. పునర్జన్మ లేదు. పరలోకం లేదు. భగవంతుడు అనేది లేదు. కాబట్టి ఇ ధర్మం పేరుతో చెప్పే మోసపు మాటలు, మోక్షం అనే మాట మగతనం ఉన్న వారి ఆదర్శాలు ఎంతమాత్రం కావు. వేదాలు మూడింటిని రచించినవారు మిథ్యా చారులు, కుచ్చితులు, టక్కరి దొంగ లు, రాక్షసులు. కర్మకాండల కోసం వారు రూపొందించిన పాండిత్య ఆడంబర సూత్రాలన్నీ దక్షిణ సంపాదించుకోవడానికి మాత్రమే అని లో కాయలు క్రతువులను హేళన చేశారు.

పురోహితులు చెప్పినట్లు అగ్నిష్టోమ యజ్ఞంలో బలి ఇవ్వబడిన పశువు సరాసరి స్వర్గానికి చేరేటట్లు అయితే, ఆ యజ్ఞం చేసేవాడు తన తండ్రిని ఎందుకు బలి ఇవ్వకూడదు? అలా చేస్తే అతనికి స్వర్గం ప్రాప్తిస్తుంది కదా !అని ప్రశ్నించారు.

శ్రాద్ధంలో పెట్టిన పిండాలు చనిపోయిన వారికి ఆకలి తీర్చేలా ఉంటే ప్రయాణికులు ఆహారపదార్థాలు మూసుకుపోవడం ఎందుకు దండగ కదా! ప్రయాణం మీద వెళ్ళే వాడికి ఇంట్లో శ్రాద్ధంపెడుతూ ఉంటే దూరాన ఉన్న ప్రయాణికుడికి ఆహారం అందాలి కదా? ఇలాంటి ప్రశ్నలకు స్మృతి కారులు వద్ద

సమాధానం లేదు.

ఈ లోకంలో లో సామాజిక దౌర్జన్యాన్ని , మానసిక దోపిడీని అంతం చేయడమే నిజమైన స్వాతంత్ర్యం అని, అదే మోక్షమని లోకాయత లు నొక్కి చెప్పారు. ఉన్నత వర్గాలు చెలాయించే పెత్తనాన్ని, పొగరుబోతు తనాన్ని, కపటత్వాన్ని తూర్పార పట్టింది లోకయతం. ఈ వాదనలు ఆనాటి మనుషులను సమాజాన్ని ఆలోచింపజేసేవిగా టమే కాకుండా ఒక నూతన సంస్కృతికి బాటలు వేసింది.

సాంఖ్యులు ఈ జగత్తు పుట్టుక గురించి ఏమని ప్రతిపాదనలు చేశారో కూడా చూద్దాం. సాంఖ్యం అంతిమ సత్యం ప్రకృతి అని నమ్ముతుంది. ప్రకృతి నిర్వహించే పాత్ర సాంఖ్యవాదానికి పునాది. ప్రకృతిలో లో పరీ శుద్ధమైన పదార్థం, తక్కువ పరిశుద్ధమైన పదార్థం, ఆ పరిశుద్ధమైన పదార్థం ఉన్నాయి (సత్యం, రజస్సు, తమస్సు). మొదట ఈ మూడు పదార్థాల మధ్య సమగ్రమైన సమతుల్యత ఉండటం వల్ల ప్రకృతిలో చలం ఉండేది కాదు. ఎలాగో ఈ సమతుల్యత చెడిపోయింది. ప్రకృతిలో చలనం ప్రారంభమయింది. అంటే ప్రకృతి మార్పు చెందడం ప్రారంభించింది. ఈ మార్పు ఫలితంగానే ప్రతి వస్తువు లో వైవిధ్యం, సంక్లిష్టత, ఈ పరిణామం ఏర్పడుతుందని సాంఖ్యులుప్రతిపాదించారు. ఆనాటి గొప్ప శాస్త్రీయ ఆలోచన. సాంఖ్యం పరిణామ వాదాన్ని ఈ పరిణామానికి కార్యకారణ సంబంధం ఉందని చెబుతుంది. కార్యం సూ క్ష్మ రూపంలో కారణం లోనూ, అలాగే కారణం సూక్ష్మరూపంలో కార్యం లోను ఉంటుంది. ఇది కార్యకారణ సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే గతితార్కిక పద్ధతి. ఇవి ఇవి సాంఖ్యులస్వతంత్ర ఆలోచనా ధోరణి.

ఇక కణాదుడి వైశేషికము ఈ ప్రపంచం గురించి దాని పుట్టుక గురించి ఎలాంటి ఆలోచనలు చేసిందో ఒకసారి పరిశీలిద్దాం. అణువుల సంయోగ వియోగాల చేత ఈ ప్రపంచం ఏర్పడిందని వైషేశికులు ప్రతిపాదించారు. అణువులకు ప్రారంభం లేదని, వాటిని ఎవరు సృష్టించలేదని కూడా చెప్పారు. దీనితో భౌతిక శాస్త్రములో నూతన సిద్ధాంతాల ఆవిష్కరణలకు పునాది ఏర్పడింది. ఈనాడు మనం "శాస్త్రీయం"అంటున్నది న్యాయ, వైశేషిక, సాంఖ్య దర్శనాలలో తొలినాటి జైనం బౌద్ధంలో కనిపించే ప్రాథమిక భౌతిక దృక్పదం ఇది. అంతిమ సత్యం విచ్ఛేదం చేయడానికి సాధ్యం కానీ భౌతిక పదార్థమైన అణువులు. ఇదే వారి సిద్ధాంతానికి ప్రాతిపదిక. వాటిని ఎవరూ సృష్టించలేదు. తర్వాత వచ్చే అన్ని పరిణామాలకు వాటి సంయోగం వియోగాలే కారణము. ఈ రకమైన స్వతంత్ర ఆలోచన సంస్కృతియే ఈనాడు అభివృద్ధి చెందుతున్న సైన్సుకు తొలినాళ్ళలో బీజాలు వేసింది. ఇది కదా అసలు సిసలైన భారతీయ సంస్కృతి? సమాజాన్ని చాతుర్వర్ణంగా మార్చి, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకు పునాదులు వేసిన వైదిక మత సంస్కృతా ఈ నాటి భారత దేశానికి కావాల్సింది? ఉపనిషత్తులు స్త్రీలు, సూద్రులు, వైశ్యులకు కనీసం మోక్షం ప్రసాదించడానికి సైతం నిరాకరించిన సంస్కృతా మన సంస్కృతి? శ్రమను, శ్రమ పడితే వారిని నీచంగా చూసే సంస్కృతా మన భారతీయ సంస్కృతి? వయసులో ఉండి వైధవ్యం ప్రాప్తించిన స్త్రీకి గుండు గొరిగించి తెల్ల చీర కట్టి, ఎలాంటి స్వతంత్రతకు నోచుకోని, ఎదురుపడితే అపశకునం అని ప్రవచించేసంస్కృతా భారతీయ సంస్కృతి? చనిపోయిన భర్తతో పాటు చితిమంటల మీద భార్య సతీసహగమనం చేయటమా మన భారతీయ సంస్కృతి? ఈ రకమైన సంస్కృతిని సృష్టించిన వైదికమతం, తదనంతర సాహిత్యం, మనిషిని నిర్వీర్యం చేసి, స్వతంత్ర ఆలోచనకు, మేధస్సుకు మేకులు కొట్టింది ఈ సంస్కృతియే. ఇలాంటి సంస్కృతిని వెయ్యి అడుగుల లోతున పాతి పెట్టవలసిన అవసరం లేదా? ప్రతి ఒక్కరూ తిరస్కరించనవసరం లేదా? ఇలాంటి దారుణమైన సంస్కృతిని ఈ ఆధునిక సమాజంలో కూడా పాటించాలనా? ఇలాంటి సంస్కృతి నుంచి విమోచన కోరుకో వద్దా? దీనికి భిన్నంగా ఆనాడే శాస్త్రీయంగా ఆలోచించి పనికిమాలిన మత క్రతువులను, నిరుపయోగమైన ఆచారాలను, ప్రశ్నించి,

> **“సమాజాన్ని చాతుర్వర్ణంగా మార్చి, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థకు పునాదులు వేసిన వైదిక మత సంస్కృతా ఈ నాటి భారత దేశానికి కావా ల్సింది? ఉపనిషత్తులు స్త్రీలు, సూద్రులు, వైశ్యులకు కనీసం మోక్షం ప్రసాదించడానికి సైతం నిరాకరించిన సంస్కృతా మన సంస్కృతి? శ్రమను, శ్రమ పడితే వారిని నీచంగా చూసే సంస్కృతా మన భారతీయ సంస్కృతి?”**


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> "ఒకవైపు మనది వసుధైక కుటుంబకం అని గొప్పలకు పోతూనే సమాజంలో ఘోరమైన తరతమ బేధాలు, అసమానతలను సృష్టిస్తుంటారు. ఇది వారి ద్వంద వైఖరి. అదే సనాతన ధర్మం అంటూ నెత్తినెట్టుకొని చలనం లేకుండా గడ్డకట్టుకుపోయిన జీవితాలను గడప మంటారు. కానీ అందరూ నడుస్తున్న మార్గంలో నడవటం సులభం. గొర్రెలు అలానే చేస్తాయి. కానీ వివేకంతో ఆలోచించి మనమే ముళ్లను తొలగించుకుని దారి చేసుకుని కొత్త దారిలో నడవాలి. ప్రశ్నించడంలోనే మానవ ప్రగతి దాగి ఉంది."

మనిషి స్వేచ్ఛా స్వాతంత్రాలకు, స్వతంత్ర ఆలోచనలకు పునాదులు వేసిన లోకాయత, సాంఖ్యం, వైశేషిక, న్యాయ, మీమాంస లాంటి అలాగే తొలి నాటి బౌద్ధం జైనం యొక్క స్వతంత్ర ఆలోచన సంస్కృతులను అసలుసిసలైన భారతీయ సంస్కృతిగా స్వీకరించాలి. ఈనాటి సైన్సుకు బీజప్రాయంగానైనా ఆనాడే పునాదులు వేసిన వారి సంస్కృతికి మనం వారసులం కావాలా వద్దా? ఆ సంస్కృతులను మనం గౌరవించాల వద్దా? అవే కదా అసలు సిసలైన సంస్కృతి.

భారతదేశంలో శాస్త్రీయ ఆవిష్కరణలు అన్నీ ప్రాచీన ఋషులు హిమాలయ పర్వత సానువుల్లో కూర్చుని తమ తపశ్శక్తితో, అతీంద్రియ శక్తితో, అంతఃకరణ ప్రేరణతో కనుగొన్నారని వేదాంతులు వారి వారసులు చెప్పే అబద్ధాల, అభూత కల్పనల కబుర్లు ఇంకా ఈ ఆధునిక సమాజంలో కూడా నమ్మాలా? మనదేశంలో సైన్సు అభివృద్ధి చేసింది తపశ్శక్తి సంపన్నులు అని చెప్పుకుంటున్న రుషులు, మునులు కాదు. శాస్త్రీయ పద్ధతులు అనుసరించి, ప్రకృతిని పరిశీలించి అనేక విషయాలను ఆవిష్కరించినది శాస్త్రవేత్తలు మాత్రమే. ఆర్యభట్ట, వరహా మిహిరుడు, కుమారిలుడు, చరకుడు, సుశ్రుతుడు లాంటి అనేకమంది ప్రకృతి పరిశీలకులు, సమాజ పరిశీలకులు, లాంటివారి వలన సైన్సు అభివృద్ధి అయినది కానీ ఆవిష్కరణ అనంతరం ఇవన్నీ మా వేదాల్లోనే ఉన్నాయిష అని గొప్పలు చెప్పుకుని తిరిగే వారి వల్ల ఎప్పుడూ ఏమీ కాలేదు.

మనదేశంలో ఈ నాటికీ కొనసాగుతున్న కుల వ్యవస్థలో ప్రతి కులము పై కులాల కంటే తక్కువదిగా, అపవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. అలాగే ప్రతి కులము క్రింది కులాల కంటే ఎక్కువ దిగా, పవిత్రమైనదిగా భావించబడుతున్నది. మతం విషయంలోనూ, సామాజిక, ఆర్థిక విషయాలలోనూ ఒక కులం జీవించే విధానానికి, మరొక కులం జీవించే విధానానికి సంబంధం ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో వీళ్లంతా ఎలా ఏకమవుతారు? ఎలా కలుస్తారు? తమను సామాజికంగా, సాంస్కృతికంగా, మతపరంగా, ఆర్థికంగా తొక్కి పెడుతున్న, పీడిస్తున్న వారిమీద అ ఎలా తిరుగుబాటు చేస్తారు? భారతదేశంలో రాజకీయ తిరుగుబాట్లు, సామాజిక సాంస్కృతిక తిరుగుబాట్లు అనుకున్న మోతాదులో రాకపోవడానికి ఈ నిచ్చెన మెట్ల కులవ్యవస్థ ఒక కారణం. దానితోపాటు అన్ని మతాలు భూలోకంలో తమకు లభించిన దానితో సంతోష పడమని, పూర్వ జన్మలో చేసుకున్న పాప పుణ్యాల ఫలితంగా ఇలా ఉన్నార , పరలోకంలో మోక్షం గురించి ప్రయత్నించమని చెప్పే కర్మసిద్ధాంతం మరొక కారణం. అందువల్ల కుల వివక్షతకు వ్యతిరేకంగా వర్గ పీడనకు వ్యతిరేకంగా జమిలిపోరాటాలు నిర్వహించవలసిన కర్తవ్యం బాధ్యత ఎంతో ఉన్నది. అది జరిగినప్పుడే సమాజ స్థితిని మార్చగలుగుతాము.

**చివరగా**

మన దేశం ఆధ్యాత్మిక దేశం అని, మన దేశం విశ్వగురువు అని, మన దృష్టి పారలౌకిక మని, మనం మాయను జయించి వాళ్ళమని బడాయి కబుర్లు ప్రచారం చేస్తుంటారు. వాళ్లే మరొకవైపు భౌతిక సంపదల కోసం ఎగబడుతుంటారు. వేరే వాళ్లను అణగ తొక్కిపైకి రావాలని తాపత్రయ పడుతూనే ఉంటారు.


ఒకవైపు మనది వసుధైక కుటుంబకం అని గొప్పలకు పోతూనే సమాజంలో ఘోరమైన తరతమ బేధాలు, అసమానతలను సృష్టిస్తుంటారు. ఇది వారి ద్వంద వైఖరి. అదే సనాతన ధర్మం అంటూ నెత్తినెట్టుకొని చలనం లేకుండా గడ్డకట్టుకుపోయిన జీవితాలను గడప మంటారు. కానీ అందరూ నడుస్తున్న మార్గంలో నడవటం సులభం. గొర్రెలు అలానే చేస్తాయి. కానీ వివేకంతో ఆలోచించి మనమే ముళ్లను తొలగించుకుని దారి చేసుకుని కొత్త దారిలో నడవాలి. ప్రశ్నించడంలోనే మానవ ప్రగతి దాగి ఉంది. మోక్షం మోక్షం అని మోకరిల్లడం అంటే మన ఈ జీవితాలను మెడకు చుట్టుకున్న పాములా భావించడమే అవుతుంది. ఇప్పటికీ మన సమాజం మూఢత్వం, మూర్ఖత్వం అనే రాహువు కేతువు బాహువుల్లో ఇరుక్కొని ఉన్నది. యమ ద్వారం వద్ద ఉన్న వైతరణీ నది దాటడం ఎలా అన్నది కాదు మనం ఆలోచించ వలసినది. ఈ సమాజంలో కొనసాగుతున్న దోపిడీని కపటత్వాన్ని అంతం చేసిసమ సమాజానికి బాటలు వేసే వైతరణి ని ఎలా దాటాలో ఆలోచించాలి. ఒక సమాజం తన ఒరవడిలో కొన్ని ఆచారాలను సంప్రదాయాలను ఏర్పరచుకుంటుంది. అవసరం తీరిన తర్వాత కాలానుగుణంగా ఒక్కొక్కటి వదిలించుకుంటు లేదా మార్చుకుంటూ ముందుకు పోతుంది. అలాంటి సమాజానికి ఒక సంస్కృతి చరిత్ర ఉంటుంది. అలా కాకుండా ఎలాంటి మార్పులు లేకుండా ఒక నిశ్చల తటాకంలా ఉండి పోతే అందులో క్రిములు కీటకాలు ఏర్పడి రోగాలు వ్యాపిస్తాయి. అదే సమాజంలో అయితే అనేక రుగ్మతలు ప్రబలుతాయి.

విమానం ఆకాశంలో మబ్బులను చేదించుకుంటూ పైకి పోయి నిర్మలాకాశాన్ని చూడ కలిగినట్లు మనం ఐక్యంగా శాస్త్రీయ దృష్టితో పరికించి పరిశీలించి ప్రతి విషయాన్ని విశ్లేషించుకుని ముందుకు నడవాలి. అప్పుడే అభ్యుదయానికి, సమాజ అభివృద్ధికి దోహదపడిన వారం అవుతాం..

❃

# ప్రాంతీయ పార్టీల అవకాశవాదం గురించి సిపిఐ(ఎం)కు స్పష్టమైన అవగాహన ఉంది

**సందేహాలు సమాధానాలు**



**బి.వి. రాఘవులు**

**ఒక వ్యక్తి ఓటుని ఒకచోట మాత్రమే వేయాలని ఎన్నికల కమిషన్ చెప్తుంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ రెండు నియోజకవర్గాలలో పోటీ చేస్తే రెండు చోట్ల ఓటు వేసే హక్కు ఉంటుందా? తెలంగాణలో కూడా ఓటు హక్కు ఉందని అంటున్నారు. ఎలక్షన్ కమిషన్ చెప్తుంది పవన్ కళ్యాణ్ కి వర్తించదా?**

**ఉసిరికాయల నాగబాబు,**
**అమరావతి, గుంటూరు జిల్లా.**

పజా ప్రాతినిథ్య చట్టం ప్రకారం ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలి. అంతకుమించి ఉండడం శిక్షార్హం. రెండు మూడు చోట్ల నివాసాలున్నా, ఓటు నమోదుకోసం ఒక్క చోటునే ఎంచుకోవాలి. ఎక్కడ ఓటుందో అక్కడే ఓటు వేయాలి. ఇది ఎవరికైనా వర్తించే నిబంధన. పవన్‌కళ్యాణ్ గారికి కూడా ఇదే వర్తిస్తుంది.

చట్టం ప్రకారం ఒక వ్యక్తి రెండు నియోజకవర్గాలలో పోటీజేయవచ్చు. అసెంబ్లీకి పోటీజేయడానికి నియోజకవర్గంలో ఓటరు అయివుండాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలో ఎక్కడైనా ఓటరై ఉండవచ్చు. ఎక్కడ ఓటువుంటే అక్కడే ఓటు వెయ్యాలి. అంతే తప్ప ఎక్కడ పోటీజేస్తే అక్కడ కాదు. పవన్‌కళ్యాణ్ రెండు చోట్ల పోటీజేసినా ఎక్కడ ఓటుంటే అక్కడే ఓటు వేయాల్సి ఉంటుంది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాలో రెండుచోట్ల ఓటుండేందుకు చట్టం ఒప్పుకోదు. తెలంగాణా రాష్ట్రంలో ఓటు లేకుండా తెలంగాణాలో పోటీజేయడం కుదరదు.

**ఆర్యా, 1996 ఎన్నికల్లో డబ్బు పంపకం మొదలెట్టిన వ్యక్తి చంద్రబాబు. బాబు జమానా అవినీతి ఖజానా అని 2003 మార్క్సిస్ట్ పార్టీ బుక్ లెట్ వేసింది. ఇప్పుడు అవినీతి కేసులో అరెస్ట్ అయితే అక్రమ అరెస్టు అని గంటల వ్యవధిలో ప్రకటించారు. అవినీతి ఎవరు చేసినా సమర్ధించటమేనా! సీపీఎంకి విధి విధానాలు లేవా?**

**- మంజుల సి హెచ్,**
**రాయవరం గ్రామం**
**మాచర్ల మండలం, పల్నాడు జిల్లా 522426**

అవినీతి ఎక్కడున్నా, ఏ పార్టీ అవినీతికి పాల్పడినా మార్క్సిస్టు పార్టీ వ్యతిరేకిస్తుంది. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల హయాంలో జరిగిన అవినీతిని వ్యతిరేకించింది. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలనైనా, చంద్రబాబుపై వచ్చిన ఆరోపణలనైనా సిపిఐ(యం) విస్మరించలేదు. అవినీతిని బాహాటంగానే ఖండించింది.

సిపిఐ(యం) చంద్రబాబు అరెస్టు జరిగిన తీరును మాత్రమే వ్యతిరేకించింది. సిపిఐ(యం)జేసిన ప్రకటననుజూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణపై చట్టబద్ధమైన పద్దతులలో విచారణజేసి నిజాలను నిగ్గుతేల్చాలన్నదే సిపిఐ(యం) అభిప్రాయం.

**రాఘవులుగారు, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చే పథకాల వల్ల ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దూరమైంది. యువతకు ఉపాధిచూపడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. టిడిపి హయాంలో కంపెనీలు తేవడానికి చంద్రబాబు అమలు చేసిన విధానాలను జగన్ అటకెక్కించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2024 ఎన్నికల్లో గెలుపు కోసం జగన్, చంద్రబాబు పన్నుతున్న వ్యూహాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియజేస్తారని ఆశిస్తున్నాను**

**ఉసిరికాయల నాగబాబు, అమరావతి,**
**గుంటూరు జిల్లా.**

వైఎస్సార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిజేయడంలో విఫలం అయ్యిందన్నది వాస్తవం. అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథం కూడా ఈ ప్రభుత్వానికి లేదు. ఇక ఉపాధి కల్పించే అభివృద్ధి గురించి ఆలోచిస్తుందనుకోలేం. కేంద్రం అనుసరించే సరళీకరణ విధానాలను తుచ తప్పకుండా ఈ ప్రభుత్వం అనుసరిస్తున్నప్పుడు ఉపాధి కల్పన గురించి మర్చిపోవాల్సిందే.

విభజన చట్టంలో పేర్కొన్న నిర్ణయాలు, కేంద్రం జేసిన వాగ్దానాలు అమలు జరిగి వుంటే ఉపాధి కల్పన కొంత మెరుగై ఉండేది. వైఎస్సార్ ప్రభుత్వం కేంద్రానికి పూర్తిగా దాసోహమయి రాష్ట్రం హక్కులను కాపాడడంలో విఫలం అయ్యింది. తెలుగుదేశం, జనసేనలు సైతం బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ వైఎస్సార్ పార్టీకి తోడుదొంగలయ్యాయి. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం అయ్యాయి. ఈ విషయంలో వామపక్షాలు మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు శాయశక్తులా కృషిజేస్తున్నాయి.

నూతన రాష్ట్రం ఏర్పడ్డ మొదటి ఐదు సంవత్సరాలు పరిపాలనజేసిన తెలుగుదేశం పార్టీ కూడా రాష్ట్రాభివృద్ధికిజేసింది చాలా స్వల్పం. సింగపూర్ తరహా రాజధాని నిర్మాణం పేరుతో కలల ప్రపంచంలో ప్రజలను తిప్పుతూ కనీసం_పరిపాలనకవసరమైనమేరకైనా రాజధానిని పూర్తిజేయలేదు. ఈలోపు ఐదేళ్ళు పూర్తయి అధికారాన్నే కోల్పోయింది.

ఇప్పుడు అధికారాన్ని నిల్పుకోవాలని వైఎస్సార్‌సిపి, మరోసారి గద్దెనెక్కాలని టిడిపిలు ప్రయత్నిస్తున్నాయి. వీటి మధ్య విధానపరమైన అంశాలేవీ లేవు పోటీ పడడానికి. రెండు పార్టీలూ బిజెపి పంచన ఉన్నాయి. ఆ విధానాలకు తందానాతానా అంటున్నాయి. జనసేన బిజెపితో పొత్తులోనే వున్నది.

రాష్ట్రాభివృద్ధి విషయంలోనూ ఈ మూడింటికి భిన్నమైన విధానాలేమీ లేవు. అందుకే ప్రధానంగా వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చుట్టూ అవి తిరుగుతున్నాయి. రాష్ట్ర రాజకీయాలలో నేడు చోటుచేసుకున్న దయనీయ పరిస్థితి ఇది.

**బిఆర్ఎస్ పార్టీ బీజేపీకి బి టీమ్ అని ఆ పార్టీ రెండో పర్యాయం గెలిచిన తర్వాత, ఢిల్లీ రైతుల పోరాట సమయంలోనూ ఇంకా పలు బిల్లులకు మద్దతు ద్వారా సామాన్య ప్రజలేగమనించారు. సీపీఎం నాయకత్వం సీట్లు ఇవ్వం పో అన్న దాకా కాపలాగా ఎందుకు వుంది! ఆశ్చర్యం. వివరణ ఇవ్వగలరు.**

**- గిరి ప్రసాద్ చెలమలు,**
**201 క్లాసిక్ అవెన్యూ మియాపూర్**
**హైదరాబాద్ 500049**

బిఆర్ఎస్ పార్టీ 2019 ఎన్నికల తరువాత కొద్ది సందార్భాలలో మినహా కేంద్ర బిజెపి మతోన్మాద విధానాలకు, అది తెచ్చిన అనేక హానికరమైన చట్టాలకు, నిర్ణయాలకు

వ్యతిరేకంగా నిలబడింది. పార్లమెంటులో బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలతో సహకరించింది. 'ప్రశ్న'లో ప్రస్తావించిన రైతు వ్యతిరేక నల్లచట్టాలను సమర్థించలేదు. పార్లమెంటులో వ్యతిరేకించింది. ఇప్పటికీ బిజెపి టిఆర్ఎస్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది.

అయితే బిఆర్ఎస్ మొదటి నుండి మూడవ ఫ్రంటు పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నది. అది ప్రస్తుత పరిస్థితులలో అసాధ్యం అన్నది మొదటి నుండి సిపిఐ(యం) అభిప్రాయం. ఈ విషయంలో రెండు పార్టీలకు మొదటి నుండి తేడా వుంది.

ఈ మధ్య అఖిలభారత స్థాయిలో 'ఇండియా' పార్టీల వేదిక ఏర్పడినప్పుడు బిఆర్ఎస్ అందులో చేరలేదు. సిపిఐ(యం) ఆ బృందంలో వుండి బిజెపిని ఓడించే కృషిలో భాగస్వామి కావడానికి నిర్ణయించుకున్నది. సిపిఐ(యం) యొక్క ఈ విధానంలో బిఆర్ఎస్ విభేదించింది. అప్పటి వరకు వామపక్షాలతో సీట్ల సర్దుబాటుకు చర్చలు జరుపుతున్న బిఆర్ఎస్ ఈ వంకబెట్టి ఏకపక్షంగా సీట్లు ప్రకటించి సర్దుబాటుకు స్వస్తి పలికింది. నిజంగా 'ఇండియా'లో వామపక్షాలుండడం కారణమా? అది ఒక సాకా? మీడియాలో వచ్చినట్లు ఇతర కారణాలున్నాయా అన్న ఊహాగానాలు చేయవచ్చు. ఏమైనా బిజెపికి వ్యతిరేకంగా సాధ్యమయిన్ని ఎక్కువ శక్తులను సమీకరించాలన్న ప్రయత్నానికి బిఆర్ఎస్ విఘాతం కల్గించిందనేది వాస్తవం. రాష్ట్రంలో అది అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీ లేకుండా పోరాడుతున్నది. ఇందుకు బిఆర్ఎస్ కోపంగా వున్నది.

ప్రాంతీయ పార్టీల స్వభావంలోనే ఇటువంటి అవకాశవాదం వున్నదన్న విషయం సిపిఐ(యం)కు తెలుసు. ఇదే మొదటి అనుభవం కాదు. గతంలో అనేక ప్రాంతీయ పార్టీలు ఇలా అకస్మాత్తుగా ప్లేటు మార్చడం చూశాం. భవిష్యత్తులోనూ చూస్తాం. ఇప్పుడు బిఆర్ఎస్, వామపక్షాలతో సీట్ల సర్దుబాటును కాలదన్నడం ఆక్షేపణీయం తప్ప, ఆశ్చర్యమేమీ కాదు. అందువలన ప్రశ్నలో ఉన్న సీట్లు ఇవ్వంపో అన్నదాకా కాపలాగా ఎందుకు వున్నది అన్న ఆక్షేపణ సరైంది కాదు. చివరివరకు బిజెపి వ్యతిరేక శక్తులను రాబట్టాలన్న వైఖరిని, వామపక్షాలు జేసిన ప్రయత్నంగా ఈ అంశాల్ని చూడాలి.

బూర్జువా పార్టీలు 'ఎ' టీంలు, 'బి' టీంలు అని ఒకరినొకరు ఆడిపోసుకోవడం ఆనవాయితీగా చూస్తున్నాం. సిపిఐ(యం) మాత్రం మతోన్మాద ప్రమాదం తీవ్రమవుతున్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాజకీయ పార్టీలను బిజెపి కూటమి వ్యతిరేక శక్తులా, అనుకూల శక్తులా అన్న తేడాతో మాత్రమే చూడాలని, బిజెపి వ్యతిరేక లౌకిక శక్తులన్నింటితో, అవి ఎంత తాత్కాలికమైనావైనా, కలిసి పనిజేయాలని భావిస్తున్నది. అది బిఆర్ఎస్ అయినా, కాంగ్రెస్‌తో సహా 'ఇండియా'లోని ఇతర పార్టీలైనా సిపిఐ (యం)కు పట్టింపు లేదు. అయితే కొన్ని సందర్భాలలో స్థానిక పరిస్థితులను బట్టి, ఎన్నికలలో ఇలా కలిసి పనిజేయడం సాధ్యంకావచ్చు, కాకపోవచ్చు. ❊

---

# పత్రికా స్వేచ్ఛపై పైశాచిక దాడి

**(6వ పేజీ తరువాయి)**

ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. ప్రపంచ సిగ్గు మాలిన క్లబ్బు అని ఒకటుంది. 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్' అనే సంస్థ శిక్షపడుతుందన్న బయం లేకుండా నేరాలకు పాల్పడే దేశాల సూచీని తయారు చేసింది. దీనిలోని వారు సిగ్గుమాలిన క్లబ్బు సభ్యులన్నమాట. భారత దేశం ఈ క్లబ్బులో శాశ్వత స్థానం సంపాదించింది. ఇటీవల వైర్ పత్రికలో ప్రచురితమైన ఒక వ్యాసం ప్రకారం 16 మంది జర్నలిస్టులను చట్టవిరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం క్రింద అరెస్టు చేశారు. వారిలో ఏడుగురు జైల్లో ఉన్నారు. ఎనిమిది మంది బెయిల్‌పై బయటకు వచ్చారు. ఒక్కరిని అరెస్టు చేయలేదు. వీటిలో ప్రతి కేసునూ ప్రాధాన్యతగల సీరియస్ కేసులుగా తీసుకోవాలి. న్యూస్‌క్లిక్‌పై దాడికి నిరసనగా జరిగిన విస్తృతమైన ఉద్యమాన్ని కొనసాగించాలి. స్వతంత్ర, విమర్శనాత్మక జర్నలిస్టుల గళాన్ని రక్షించడమే కాదు, వారి జీవితాలనూ, భద్రతనూ, రాజ్యాంగం వారికి ప్రసాదించిన ప్రాథమిక హక్కులను రక్షించడం కోసం, ఒక్కడికి నష్టం జరిగినా అందరికీ జరిగినట్టే నన్న భావనతో లోలైన ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించడానికి దీన్ని ఆలంబనగా చేసుకోవాలి.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

# గాజా యుద్ధం

**(20వ పేజీ తరువాయి)**

పెద్ద మూల్యం చెల్లిస్తూ కూడా ప్రతిఘటన కొనసాగించడం, అన్నిటికీ మించి అరబ్బు ప్రపంచంలోనూ, వర్ధమాన దేశాల్లోనూ పాలస్తీనా సమస్యకు లభిస్తున్న మద్దతు... ఇవన్నీ కూడా ఇజ్రాయిల్‌తో పొత్తుకు తొందరపడకూడదని ఈ ప్రాంత నేతల మీద ఒత్తిడి తెస్తాయి. అరబ్బు-ఇజ్రాయిల్ దేశాల సయోధ్య ద్వారా పాలస్తీనియన్ల హక్కులు కాపాడబడతాయన్న మాయమాటలను పాలస్తీనా ప్రజలు గానీ, వారి అరబ్బు మిత్రులు గానీ ఇంకెంత మాత్రం నమ్మబోరు. దీని గురించి సౌదీ జర్నలిస్టు ఫైసల్ అబ్బాస్ అరబ్ న్యూస్ పత్రికలో ఇలా రాశారు:"...సాధారణ ప్రజలను రక్షించే ఉత్తమ పరిష్కారం రెండు దేశాల ఏర్పాటు మాత్రమే. అంతర్జాతీయ సమాజం ఈ దిశగా ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి".

పాలస్తీనా జాతీయ కవి మహమూద్ దార్విష్ రాసిన ఈ కవితలో పాలస్తీనా సమస్య హృదయం దాగి ఉంది. ఆయిన ఇలా రాశాడు:

నీవు మా పూర్వీకుల పచ్చని తోటలు దొంగిలించావు
నేను పండించే పంటభూములను కూడా
నీవు మాకు ఏమీ వదిలిపెట్టలేదు
ఈ రాళ్లు తప్ప...
అందువల్ల నాకు ఆకలి వేస్తే
దోపిడీదారుని మాంసమే నా ఆహారమవుతుంది.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

# ఆయన దేశానికే అన్నదాత

**(2వ పేజీ తరువాయి)**

జీవవైవిధ్య సంపదతో అడవుల్ని పరిరక్షించడంలో స్థానికుల పాత్ర గురించి. అనేక అడవుల్లో జన్యుపరమైన వనరులను గుర్తించారు. వాటిని యావత్ ప్రపంచానికి చాటారు. అవి ప్రజల నియంత్రణకు గురికావడం ఏమాత్రం సరైనది కాదని ఆయన తెలిపారు. అది ఒక విధంగా, రైతుల హక్కులుగా గుర్తించి సహజ సిద్ధంగా ఉండే జన్యుపరమైన వనరులను సంరక్షించేందుకు మద్దతుగా నిలిచారు. దీనిని యావత్ ప్రపంచం గుర్తించింది.

**ఆకలి లేని దేశం కోసం తపనపడ్డారు**

భారతదేశంలో 'హరిత విప్లవం' చరిత్రలో లిఖించాల్సిన అంశం. అందుకోసం ఆయన పోషించిన పాత్ర ఎప్పటికీ మసకబారిపోదు. ఆకలితో అలమటిస్తున్న జానభా కోసం కడుపునింపేందుకు ఓడలలో ఆహారం వచ్చినప్పుడు. "ఓడ నుండి నోటికి" ఎప్పుడు చేరుతుందా అని ఎదురుచూసే పరిస్థితి నుండి దేశాన్ని బయటకు లాగేందుకు ఆయన పోరాడారు. బహుశా 20వ శతాబ్దంలో ఇదో పెద్ద విజయంగా చెప్పవచ్చు.

1950, 1960ల్లో ఆహార సంక్షోభం ఎంత తీవ్రంగా ఉండేదో నేటి తరానికి పెద్దగా అవగాహన లేదు. ఆహార కొరతను ఎదుర్కోవడం ఎంత సవాలుతో కూడుకున్నదని అప్పటి ఆహార మంత్రిగా (1965-1967) ఉన్న సి.సుబ్రహ్మణ్యంను అడగ్గా, "దేశంలో కేవలం ఒక వారం మాత్రమే ఆహార నిల్వలు న్నాయి" అని అతను చెప్పానే. భారతదేశానికి దగ్గరగా ప్రయాణించే ఆహారాన్ని మోసుకెళ్ళే ఓడను అధికారులు గుర్తించారు. వేలాది మంది చనిపోకుండా ఉండేందుకు ఓడను భారత్‌కు మళ్లించేందుకు అప్పటి అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్‌కు ఒక లేఖను పంపారు.

మెక్సికోలోని అంతర్జాతీయ మొక్కజొన్న, గోధుమల అభివృద్ధి కేంద్రంలో డాక్టర్ నార్మన్ బోర్లాగ్ అధిక దిగుబడినిచ్చే పొట్టి గోధుమ రకాలపై పరిశోధనలు చేస్తున్నప్పుడు ఈ పొట్టి రకాల ఉత్పత్తి సామర్థ్యాన్ని డాక్టర్.స్వామినాథన్ గుర్తించారు. సాగునీరు, ఎరువులు, పురుగుమందులుంటే బ్రహ్మాండమైన దిగుమతులు వస్తాయని తెలుసుకున్నారు. రాజకీయ అనుమతులు పొందిన తరువాత 1966లో మెక్సికో నుంచి 18,000 టన్నుల పొట్టి విత్తనాన్ని దిగుమతి చేసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చిన్న ప్యాక్‌లలో పంపిణీ చేశారు. ఇది వ్యవసాయంలో మొత్తం ఉత్పత్తిని పెంచే దిశగా అపారమైన విజయాన్ని సాధించింది. దీనిని విస్తరించేందుకు, పంత్‌నగర్ (ఉత్తరాంఖండ్) లూథియానా (పంజాబ్) వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా కేంద్రాలు స్థాపించారు. ఈ విత్తనాల్ని ప్రత్యేక మొక్కల పెంపకందారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అనేక మంది ప్రముఖులు వారి స్వంత పొలాల్లో వేసి విజయం సాధించారు. భారతీయ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే కొత్త రకాల విత్తనాల ఉత్పత్తికి ఈ పద్ధతి ఎంతగానో ఉపయోగపడింది. తర్వాత ఫిలిప్పీన్స్‌లోని ఐఆర్ఆర్ఐ నుండి వచ్చిన ఆమోదంతో గోధుమ, వరి బియ్యంలో ఈ పద్ధతి పునరావృతమైంది. 1968లో, యుఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేటర్ విలియం గౌడ్ అద్భుతమైన ఈ విజయాన్ని నిర్వచించడానికి ''గ్రీన్ రివల్యూషన్'' అనే పదాన్ని ఉపయోగించారు.

అదే సమయంలో, పంట పొలాల్లో అధిక మోతాదులో ఎరువులు, రసాయన పురుగుమందుల వాడకం వల్ల పర్యావరణానికి జరిగే హాని గురించి కూడా .స్వామినాథన్ హెచ్చరించారు. రాబోయే రోజుల్లో భూగర్భ జలాల క్షీణత గురించి కూడా ఆయన చాలా వివరంగా చెప్పారు. అప్పటికే హరిత విప్లవ పద్ధతుల్ని ప్రోత్సహించిన వారిపై సామినాథన్ చేసిన హెచ్చరికల ప్రభావం కనపడింది.

**కాంబోడియాలో కృషి**

కంబోడియాలో (అప్పట్లో కంపూచియా అని పిలువబడేది) పోల్ పాట్ నిరంకుశ పాలన కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా ఖ్మెర్ రూజ్ "కిల్లింగ్ ఫీల్డ్స్" సమయంలో కంబోడియాలో వరి సాగు నాశనమయ్యింది. పాల్‌పాట్ పాలన అంతమైన పదేళ్లకు స్వామినాథన్ అక్కడకు వెళ్లారు. దేశంలోని 400 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలలో కేవలం 40 మంది మాత్రమే మారణహోమం నుండి బయటపడ్డారని నివేదికలు చెబుతున్నాయి. ఆ సమయంలో స్వామినాథన్, ఐఆర్ఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా, అప్పటి కంబోడియా ప్రధాన మంత్రి హున్ సేన్‌తో దేశ వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి చర్చలు ప్రారంభించారు. కంబోడియా తన సాంప్రదాయ వరి రకాలను, దాని ప్రధాన ఆహారాన్ని కోల్పోయింది. ఐఆర్ఆర్ఐ జీన్‌బ్యాంక్‌లో సురక్షితమైన కస్టడీలో ఉన్న 766 భూభాగాల్లో అధిక దిగుబడుల్ని ఇచ్చే సంప్రదాయ రకాలను తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడానికి ఐఆర్ఆర్ఐ సహాయపడింది.

చాలా మందిలాగా కాకుండా స్వామినాథన్ టెక్నాలజీని ఆరాధించడంలో మునిగిపోలేదు. సాంకేతికతను గుడ్డిగా అనుసరించడం వల్ల కోలుకోలేని పర్యావరణ విధ్వంసం జరుగుతుందని అతనికి తెలుసు. అందువల్లనే ఆయన సైన్సును మానవాళి వినాశనానికి కాకుండా పురోగమనానికి వినియోగించాలని ఆరాటపడ్డారు.

అందుకే "జన్యుమార్పిడి పంటలు/ఆహారాల వాటి ప్రతికూల ప్రభావాలు" అనే సంకలన పుస్తకానికి ముందుమాట రాయాలని ఆహ్వానించినప్పుడు ఆయన దాన్ని తిరస్కరించ లేదు. వాస్తవానికి ఆయన ఇలా రాశాడు: "మాలిక్యులర్ బయోలజీ ద్వారా ప్రాతినిధ్యం వహించే కొత్త జన్యుశాస్త్రం ఒక ఆశీర్వాదంగా మారుతుందని, శాపం కాదని నిర్ధారించడానికి ఆసక్తి ఉన్న వారందరూ ఈ పుస్తకాన్ని విస్తృతంగా చదవగలరని నేను ఆశిస్తున్నాను." అని రాశారు.

కేంద్ర ప్రభుత్వం రైతులపై వేసిన జాతీయ కమిషన్‌కు ఐదు నివేదికలను సమర్పించిన తర్వాత స్వామినాథన్ ప్రతి ఒక్కరి నోటిలో నానడం మొదలు పెట్టారు. 2004లో రైతుల కమీషన్‌కు నేతృత్వం వహించిన ఆయన రైతుకు వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే వ్యవసాయోత్పత్తుల ధరకు 50 శాతం లాభం (C2+50) కలిపి ఇవ్వాలని చేసిన సూచన రైతులకు ఎంతో మేలుచేసే అంశంగా మారింది. ప్రభుత్వాలు ఈ సూత్రాన్ని అంగీకరిస్తున్నప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడంతో రైతు నష్ట పోతున్నాడు. స్వామినాథన్ సూత్రం ప్రకారం గిట్టుబాటు ధరలు ఇవ్వాలని భారత దేశ రైతాంగం నేటికీ ఎడతెరిపి లేకుండా పోరాడుతూనే ఉంది.

కొన్నాళ్ల క్రితం పూణేలో ఎం.ఎస్. స్వామినాథన జీవిత చరిత్రను (మరాఠీలో) విడుదల చేసినప్పుడు ఆయనను కలిశాను. ఇంకా ఎంతో కాలం నేను ఉండకపోవచు అని ఆయన అన్నారు. భారత దేశ రైతాంగం అనుభవిస్తున్న దుర్భరమైన కష్టాలు, నష్టాలనుండి బయటపడాలనేది అయన కోరిక. అప్పుడే వారికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని ఆయన చెప్పేవారు.

**(రచయిత ప్రముఖ వ్యవసాయవేత్త, ఆహార విధాన నిపుణుడు, పరిశోధకుడు)**

**(అనువాదం : టి.విష్ణు వర్ధని)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 6 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# తలసరి విద్యుత్ వినియోగంలో భారత్ వెనుకబాటు

ఒక దేశం యొక్క నిజమైన అభివృద్ధిని అక్కడ విద్యుత్ వినయోగంతో పోలుస్తారు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటే ఆ దేశం అభివృద్ధి చెందినట్లు తక్కువగా ఉంటే అభివృద్ధి తక్కువగా ఉన్నట్లు. తిరగేసి చెప్పాలంటే అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది, అభివృద్ధి చెందని దేశాల్లో వినియోగం తక్కువగా ఉంటుంది.

జిడిపి రీత్యా భారత దేశం అయిదవ అతి పెద్ద దేశం అయినప్పటికీ తలసరి విద్యుత్ వినియోగంలో మన దేశం ఇప్పటికీ చాలా పేద దేశాల సరసన ఉంది. 2021 నాటి లెక్కల ప్రకారం ప్రపంచ తలసరి విద్యుత్ వినియోగం ఏడాదికి సగటున 3,204 యూనిట్లు కాగా భారత దేశంలో కేవలం 1,025 యూనిట్లు మాత్రమే తలసరి వినియోగించడం జరుగుతోంది.

25.5 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచంలో అతి పెద్ద అర్థిక వ్యవస్థ కలిగిన అమెరికాలో తలసరి విద్యుత్ వినియోగం 11,267 యూనిట్లు. 18 లక్షల కోట్ల డాలర్లతో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన సోషలిస్టు చైనాలో తలసరి విద్యుత్ వినియోగం 5,474 యూనిట్లు. చైనా జనాభా భారత్ జనాభాతో సమానంగా ఉందన్న విషయం దృష్టిలో ఉంచుకుంటే అది సాధించిన అభివృద్ధి అర్ధమవుతుంది. ఇక 4.2 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జపాన్‌లో తలసరి విద్యుత్ వినియోగం 7,327 యూనిట్లు కాగా 4.1 లక్షల డాలర్లతో నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన జర్మనీలో 6,138 యూనిట్లు. కానీ 3.4 లక్షల కోట్ల డాలర్లతో అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత దేశంలో మాత్రం తలసరి విద్యుత్ వినియోగం వెయ్యి యూనిట్ల వద్దనే ఉంది. దాని కన్నా చిన్న ఆర్థిక వ్యవస్థలు కలిగిన బ్రిటన్‌లో 4,266, ఫ్రాన్స్‌లో 6, 927 జర్మనీలో 6,138 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఉంది.

బ్రిక్స్‌లోని ఇతర దేశాలతో పోలిస్తే కూడా భారత్‌లో తలసరి వినియోగం చాలా తక్కువగా ఉంది. చైనా గురించి పైన పేర్కొనడం జరిగింది. మిగిలిన బ్రిక్స్ దేశాలైన రష్యాలో 6,864 యూనిట్లు, దక్షిణాఫ్రికాలో 3,216 యూనిట్లు, బ్రెజిల్‌లో 2,692 యూనిట్ల తలసరి వినియోగం ఉంది. యూరప్, లాటిన్ అమెరికాలోని మెజారిటీ దేశాల్లో తలసరి విద్యుత్ వినియోగం భారత్ కన్నా చాలా మెరుగ్గా ఉంది.

చైనాతో సహా సోషలిస్టు దేశాలు విద్యుత్ వినియోగంలో మెరుగైన స్థితిలో ఉన్నాయి. వియత్నాంలో తలసరి విద్యుత్ వినియోగం 2,349 యూనిట్లు కాగా, క్యూబాలో 1, 421 యూనిట్లు. ఉత్తర కొరియాలో మాత్రం ఇది 462 యూనిట్లే.

ఇక దక్షిణాసియాలో చూస్తే బూటాన్ మినహా ఇతర దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. బూటాన్ ప్రజల తలసరి విద్యుత్ వినియోగం 4,244 యూనిట్లు కాగా పాకిస్తాన్ 570, బంగ్లాదేశ్ 461, శ్రీలంక 689 యూనిట్లు.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..............................................
వీధి ..............................................
గ్రామం ..............................................
మండలం లేదా పట్టణం ..............................................
జిల్లా ..............................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.